రాష్ట్రకూటముయొక్క వివిధనాయకులయొక్క *యధికారతుల్యము సాహూయొక్క మధ్యవర్తితనమువలన జాగ్రత్తగ నిలుపఁబడెను. విశ్వనాథునితరువాత యిద్దరు పీష్వాలును సైన్యాధిపత్యము నపరిమితముగ నెక్కువ జేసికొనఁ బ్రయత్నింప సాహూ దాని నడ్డగించెను. సింధియా హోల్కారులు తమలోతాము పోరాడి యీ యధికార తుల్యమునకు భంగము చేయనున్నప్పుడట్టి యుద్యమమునుండి వా రుడిగింపఁబడిరి. పరస్పర సాహాయ్యభావమును పరస్పర పదవీ గౌరవ భావము నీ నూఱు వత్సరములయొక్క మహారాష్ట్రకూటచరిత్రయొక్క ముఖ్యసారాంశమైయున్నది. సనదులవలనను, సమాధానములవలనను, వివిధ ప్రముఖులయొక్క యధికారతుల్యము దిట్టపఱుపఁబడినది.

బాలాజీ బాజీరావు కాలములో చక్రవర్తితో చేయఁబడిన ప్రసిద్ధ సమాధానమందు, పీష్వా కొప్పగింపఁబడిన విశ్వాసమునకు అతని సహాయసేనాపతులు జామీనులుగ నుండుమని తమ యధి కార తుల్యమును కనుబఱచిరి. (3) ఈ భావముచేతను అభిమానముచేతను రాష్ట్రకూటమునకు వారియొక్క యైకమత్యమును బంధము చేయుటయేగాక, వివిధనాయకులను వారివారి విధ్యుక్త యుద్యోగములను నెఱవేర్చుటయందు వారి లౌకికలాభములు ప్రధానస్థానమునకు కట్టుపడియుండునట్లు బాలాజీ విశ్వనాథుడు చేసెను. డిల్లీయం దతని రాజతంత్ర విజయముచే దక్కనునందు చౌతు సర్దేశముఖీల వసూలునకు చక్రవర్తి యంగీకారము నతఁడు సంపాదించినపుడు సాహూయొక్క మంత్రిమండలియందుఅష్టప్రధానులలో ముఖ్యులగు నిద్దఱకును దనకును రాజాయొక్క బాపతులు (Items of Revenue) వసూలు చేయుపనిని సమానముగ పంచి యియ్యఁబడు నట్లేర్పాటు చేసెను. దక్కను సుభలకు దాటి యావల చౌతు సర్దేశముఖీలు వసూలు చేయఁబడునప్పుడు కూడ నా పద్ధతియే అవలంబింపఁబడెను. ఈ యధికార విభాగము, అందఱియొక్క లాభనష్టములును సామాన్య

* అధికార తుల్యమనగా వివిధ రాజ్యనాయకులయొక్క యధికారములొకదానినొకటి మించకుండ సమానముగ నుండుట (Balance of Power.)

యుద్యమముగ నుండు నట్లేర్పాటు చేయఁబడెను. (4) గొప్ప సేనాపతు లందఱును అసలు మహారాష్ట్రదేశములో నినాములను వతనులను కలిగి యుండిరి. తమ శిబిరములకు దూరమున నీ వారసత్వపు వతనులను కలిగి యుండుటవలన వారియొక్క భక్తికూడ నాకర్షింపఁబడి యున్నది. (5) ఈ గొప్పలాభములను కలిగియుండుటయేగాక అందఱు సేనాపతులును, రాష్ట్రధనాగారములోనికి తమ సంవత్సరాంతపు లెక్కలు తనిఖీ చేయింపఁబడుటకు దాఖలు చేయవలసిన యేర్పాటు చేయఁబడెను. ఈ లెక్కలన్నియు పరీక్షింపఁబడి సవరింపఁబడుట కొక గొప్ప ప్రధానమైన ఫడ్నవీసు లేక శక్రటేరియటు డిపార్టుమెంటు నిర్మింపఁబడెను. (6) ప్రధానధనాగారపు స్థానమును, లెక్కల డిపార్టుమెంటు మాత్రమే కాక, మహారాష్ట్ర సైన్యములయొక్కయు దుర్గములయొక్కయు సేనాపతులు, కొద్దివారైనను, గొప్పవారైనను, అందఱితోడను ప్రధానాధికారముచే నియమింపఁబడిన యుద్యోగస్థులు ఆడిటరులుగా నుండుటకేర్పాటు చేయఁబడెను. ఈ ఆడిటరులు, ప్రధానస్థానమునకు సంవత్సరాంతమున లెక్కలు తనిఖీకి పంపఁబడినప్పుడు వానికి తామే త్తరవాదులుగా నుండవలసియుండెను. అట్లు ప్రధానాధికారముయొక్క యుద్యోగస్థులు ప్రతినాయకునితోడనుండి యచ్చటి యక్రమములను లోపములను తెలియపఱచువారై యుండిరి. ఈయుద్యోగస్థులు దారకదారులని పిలువఁబడుచుండిరి. గొప్పనాయకులయొద్ద సైనయొడల వీరుదివానులు, మజుందారుల, ఫడ్నవీసులు అనియు, దుర్గములలోను, సామాన్యప్రముఖులయొద్ద సైనయొడల సబ్నీసు, చిట్నీసు జమాదారు, కార్ఖానీసు, అను నామములతోడను లెక్కలు ఆడిటు చేయుటకు నియమింపఁబడి యుందురు. వీరు ప్రధానకార్యస్థానమందలి యధికారుల యంగీకారములేనిదే తీసివేయఁబడుటకు వీలులేదు.

ఈయాఱు విధమార్గముల వలనను, సాహుచే నేర్పాటు చేయఁబడిన రాష్ట్రకూటముయొక్క నవీనపద్ధతిలోని లోపములను, సాధ్యమైనంతవఱకు బాలాజీ విశ్వనాథుఁడు తగ్గించివేసెను. ఈయేర్పాటులు తమయందీ లక్షణములు మాఱకుండ నుండినంతకాలము ప్రధానాధికారము యావత్తు పరిపాలనను

వశమునందుంచుకొనుటకు శక్తికలిగియుండెను. అయితే యీయేర్పాటునందు జీర్ణనాశనముల యొక్క బీజము లున్నమాట వాస్తవము. కావి యొక్క శతాబ్దములంతకు మాత్రము పవి మొలకలెత్తకుండ నణచివేయఁబడియుండెను. ఈపద్ధతి సిద్ధాంత ప్రకారము చాలలోపములు కలిగియున్నను, అనుష్ఠానమందు శాంతి భాగ్యముల నొడగూర్చినందువలన, మహారాష్ట్రరాజ్యము చుట్టుప్రక్కలనున్న పరరాజ్యములవారిచే భయభక్తులతోఁ జూడఁబడియుండెనని మి. మౌంటుస్టూయార్టు ఎలిఫిన్‌స్టనుచే యోగ్యతా సాక్ష్యముకూడ మనకుఁగలదు. ఈయేర్పాటునకు చేయఁబడిన ఆటుకట్టుదిట్టములును, ఏదో యెల్లరికి నంగీకృతంబైన అధికారమున్నఁగాని, బలవంతముగ నమలుపెట్టఁబడుటకు వీలులేదు. కావున బాలాజీ విశ్వనాధుని యొక్క అంత్యకాలము ఈయుద్దేశము నెఱవేర్పఁబడుటకై వినియోగింపఁబడెను. అదియెద్దియనగా, సామ్రాజ్య మంతటియందును, స్వరాజ్య చౌతుసర్దేశముఖీలకు మహారాష్ట్రకూటముయొక్క హక్కులనుఁగూర్చి డిల్లీ చక్రవర్తినుండి యంగీకారమును పుచ్చుకొనుట యై యున్నది. ఈసంపాదనయే మహారాష్ట్రాధికారమునకుధర్మాధిక్యత నిచ్చినది. ఇదిలేనిచో బలాత్కారమునకును, అధికారమునకును భేద మారయఁజాలము. బాలాజీ విశ్వనాధుని యంగనిర్మాణశక్తి కిదియే పట్టాభిషేక కార్యంబు. దీనివిజయంబున కనేక యితర కారణములు తోడ్పడియున్నను, ఈ నిర్వహణము వలననే యితఁడు మహారాష్ట్రకూటంబుయొక్క ప్రధానస్థాపకుండగు శివాజీకి రెండవవాఁడుగా చెప్పటకిని పరిగణింపఁబడవలసి యుండెను.

బాలాజీ విశ్వనాధుఁడు డిల్లీకి వెడలినపు డతనిపేరున ఆబాజీపురంధరే ముఖ్యప్రధాను పనిచేసెను. బాలాజీ డిల్లీనుండి వచ్చులోపలనే ప్రతినిధియగు పరశురామత్రింబకు చనిపోయెను. అతని కుమారుఁడు శ్రీపతిరావు తదాస్థానమున నియమింపఁబడెను. బాలాజీ విశ్వనాధుడు సనదులను తీసికొనివచ్చి యేర్పాటులన్నిటిని పూర్తిచేసికొని, డిల్లీప్రయాణమువలనను, తరువాత చేసిన కష్టమువలనను, దేహారోగ్యముచెడినవాడై, రాజాదగ్గఱ సెలవుగైకొని కుటుంబముతోకూడ కలిసి సాస్వదునందు విశ్రాంతి పుచ్చుకొనుటకు వచ్చెను. అటు

తరువాత నతఁడు విస్తారము దినములు జీవింపక 1720 వ సం॥ ము నవంబరు నెలలో తన విధ్యుక్త ధర్మమును నెఱవేర్చి దేశమాతయొక్క ఋణముఁ దీర్చు కొంటినని స్వర్గస్థుఁడయ్యెను. అతనికి బాజీరావు, చిమ్నాజీయను నిద్దఱుకుమారులుగలరు. కుమార్తె లిద్దఱుగలరు. భూబాయి అను నామె, బారామతి గ్రామములో బాపూజీ నాయకుఁడను నొకగొప్ప ధనవంతుని సోదరుఁడగు ఆబాజీ నాయకునకిచ్చి వివాహము చేయఁబడెను. అన్నాబాయి అను నామె యిచలకరంజీ గ్రామమునందలి నారాయణరావు ఘోరేపురే యొక్క భార్య. బాలాజీ యొక్క పెద్దకుమారుఁడగు బాజీరావు తండ్రి చనిపోయిన ఏఁడుమాసములవఱకు పీష్వాయొక్క హోదా లాంఛనముగ నియ్యఁబడలేదు. ఈ యాలస్యమునకు కారణ మెచ్చటను జెప్పఁబడలేదు, కాని బహుశః ముఖ్య యుద్యోగస్థులు కార్యాంతరములమీద నెచ్చటకైన పోయియుండుటయో లేక బాజీరావు సైన్యముతో నెచ్చటకైన పోయియుండి యాలస్యముగఁగాని రాకపోవుటయో కారణమై యుండవలెను.



పీష్వా బాజీరావు.

రావురంభా నిబాల్కారువలనను, కొల్లాపురముయొక్క కొంతసైన్యము వలనను కలిసికొనఁబడెను. సయ్యదుల పక్షమువాడగు మాల్వాలోని దిలావరల్లీఖానుఁ డతనినడ్డగించెను గాని బరహాంపురమునం దోడి రణనిహతుఁడయ్యెను. తరువాత ఔరంగబాదునందు సయ్యదులచే నియమింపఁబడిన ఆలమల్లీఖాను అతనిని బేరారుపైయన్ ఘాటువగ్గిర కలిసికొని యుద్ధమునం దోడి చనిపోయెను. ఈ తని పక్షమున సాహూయొక్క సేనాపతులగు కనోజీభాంస్లే ఖండీరావు దాభ రే మొదలైన వారును హుస్సేనాలీఖాను దగ్గఱ నిదివఱకు పనిచేసిన వృద్ధయోధుఁ డగు శంకరాజీ మల్హారును అసంతశౌర్యముతో పోరాడిరి, కాని లాభములేక పోయెను. మహారాష్ట్రులయందు శంకరాజీ మల్హారుతప్ప గొప్ప యోధు లెవ్వరును యుద్ధమునందు మృతినొందలేదు.

1720 జూలై నెలలో జరిగిన యీ యుద్ధముయొక్క వార్తఢిల్లీయందు తెలియగనే, హుస్సేనాలీఖాను, చక్రవర్తి మహమ్మదుషాతోకూడ, నిజాములు ముల్కును శిక్షించుటకు దక్కనుకు బయలుదేరెను. మార్గమునందు, చక్రవర్తి యొక్క రహస్యప్రోత్సాహము వలనను, నిజాములుముల్కు కుట్రవలనను, హుస్సే నాలీఖానుడు చంపివేయఁబడెను. అకుట్రదారులలోనొకఁడు తన ప్రాణమును వెంటనే సమర్పించెను. తక్కిన వారగు మహమ్మదు అమీనుఖానును, సాదతు ఖానును, హైదరుకూలీఖాను అనువారితో కలిసి మహమ్మదుషాను సయ్యదుల దాస్యమునుండి వదలించితిమని ప్రకటించిరి. వీరందఱును మరల వెనుకకు తిరిగి పోయి రెండవసయ్యదగు అబ్దుల్లాఖానును షాపూరునందు యుద్ధమునందోడించి ఖైదిగఁ బట్టుకొనిరి.

స్వతంత్రుఁడైన మహమ్మదుషా చక్రవర్తి, నిజాములుముల్కు, సాహూ, ఎల్లరు సుభేదారులు, యూరోపియను ఫాక్టోరీల నాయకులు మొదలైన వారం దఱియొక్కయు రాజభక్తి సన్మానములను చిరతరారోగ్యైశ్వర్యయుత పరి పాలనాశీర్వాదములను బొందెను.

మహమ్మదుషారాజ్యము, దీర్ఘమైనదియేకాని,లోలోన జీర్ణమగుచున్నది. అప్పటి కా ఢిల్లీపట్టణమున కున్న యానందవైభవంబులును అటుతరువాత

శీఘ్రకాలములో నరుదెంచిన నాశనమును మహావిపత్తును బోల్చిచూడ నెంతయు శోచనీయంబైయుండు. నిజాములు ముల్కు యొక్క తిరుగఁబాటు వలనక్లే, యీభద్రంబగు విప్లవము చక్రవర్తిరాజ్యమునకు లభించినది కావున, నతఁడు దక్కనునకు వైసరాయి (రాజప్రతినిధి) గనే గాక మాల్వాకు గవర్నరుగఁ గూడ నుండ నియ్యఁబడెను. సాదతుఖాను, తన పూర్వ పోషకులగు సయ్యదులపై కుట్ర చేసినందుకు, ఔదు(అయోధ్య) గవర్నరుగాఁ జేయఁబడెను. ఇతఁడు తత్కాలములో ననేక విషయములలో ముందుప్రసిద్ధికి రాఁగలఁడు. ఇప్పటి ఔదు నబాబునకు మూలపురుషు డితఁడే.

బాలాపూరు యుద్ధమునందు ఖండీరావు దాభరే యొక్క సైన్యములు పరాక్రమంబుతో పోరాడెను. ఇతని సైన్యమందు దమ్మాజీగాయక్వాడు అనునొక యుద్యోగస్థుఁడు తనకుమారు లనేకులతో ఖండీరావు యొక్క మెప్పువడసి తరువాత సాహూరాజాకు సిఫారసు చేయఁబడెను. రాజా యందు వలన నతనిని ఖండీరావుకు సేనాపతిత్వమందు ద్వితీయునిగా నియమించి షంషేరు బహద్దరను బిరుదము నొసంగెను. ప్రస్తుతము బరోడా సంస్థాన రాజకుటుంబమునకు మూలపురుషునియొక్క యుత్పత్తి యిదియే. తరువాత ఖండీరావుగాని దమ్మాజీగాని కొన్నిమాసములకు మించి జీవింపలేదు. ఖండీరావు కుమారుఁడగు త్రింబకురావు దాభరే మేనెలలో సేనాపతి చిహ్నములచే గౌరవింపఁబడెను.

1721 దమ్మాజీ గాయక్వాడు తమ్ముఁడగు జంకోజీ గాయక్వాడుని కుమారుఁడు పీలాజీ, పెదతండ్రి యుద్యోగమునకు వచ్చెను. పోయిన పీష్వా యొక్క రెండవ కుమారుఁడగు చిమ్మాజీ యన్నగారిక్రింద సహాయసేనాపతిగ నియమింపఁబడెను. చిమ్మాజీకి సోపాప్రాంతము జాగీరుగా నియ్యఁబడెను. బాలాజీ విశ్వనాధుని మరణమునకును కుమారుని యభిషేకమునకును మధ్యకాలములో ఆబాజీ పురంధరే యతని కార్యము లన్నిటి నతనిపేరుమీఁద జరుపుచుండెను. కాని వ్యవహారము చాలవఱకు కంమాబిలాలు చిట్నీసు చేతియందును, ప్రతినిధి యగు శ్రీపతిరావు చేతియందును పడెను. ఇంకు మొదటివారు కొంతకాలమునందు అంగ్రియా,సిద్దీ మొదలైన వారితో వ్యవహరించుచుండిరి. రెండవ [illegible]

తప్రధానియగు ఆనందరావుయొక్క సాహాయ్యమున నిజాములు ముల్కుతో రాయభారముల నిర్వర్తించుచుండిరి.

నిజాములుముల్కు, బాలాపూరునందు జయమునొందినను, సయ్యదుల నాశనము నొందుపఱకును, భయములోనే యుండి, కొల్లాపురపు శంభాజీతో మిత్రత్వంబున నుండి సాహూతో చక్రవర్తి యిచ్చిన సనదులప్రకారము మహారాష్ట్రుల హక్కులనెల్లనిచ్చెదనని సామవాక్యములతో కాలము గడుపుచుండెను. కాని సయ్యదు లిద్దఱును పదభ్రష్టులై తన పక్షమువారు ఢిల్లీయం దధికారసమన్వితులైరని సువార్త వినినతోడనే, సాహూయొక్క చౌతు సర్దేశముఖీలు వసూలుచేయువారిలో, శంభాజీ చంద్రసేనజాధవులు హక్కుదారుల మనుచున్నారను మిషమీద, పేచీపెట్ట నారంభించెను. కాని బాలాజీ విశ్వనాథునిచే చౌతుసర్దేశముఖీపన్నులు పంచియివ్వఁబడి, సమానమైన లాభదృష్టి యెల్లరకును కల్పింపఁబడిన కారణమున, నిజాములుముల్కు రాజ్యారంభకాలమునందున్న దానికంటె మహారాష్ట్రరాజే యెక్కువ యధికారస్థానముననుండెను. ఔరంగబాదునందు సాహూయొక్క వకీలు సామమున బోధచేయు చుండగనే గంగోత్రియందు సర్‌లష్కరు క్రింద సైన్యములు దండోపాయమునకు సిద్ధమగుచుండెను. ఇంతియకాక ఢిల్లీశ్వరుని యొద్దనుండి మరల క్రొత్తసన దొకటి కూడఁ దెప్పింపఁబడెను. నిజాములుముల్కు యిక సాహూయొక్క హక్కుల నెదిరించుట బుద్ధికాదనుకొని, కేవలము బలమునకే భయపడి నట్లుగాక చక్రవర్తియాజ్ఞను శిరసావహించినటుల మంచి తరుణములో మహారాష్ట్రులకు లోఁబడి, జాగ్రత్తగ తప్పించుకొనెను.

నిజాములుముల్కు, తాను పెట్టిన పేచీవలన, సతారా కొల్లాపురము సంస్థానములకు పోరాటముఁ గల్పింప యత్నించెను. వారియొక్క యధికార మెక్కువగ ప్రబలిపోవునేమో యని యతఁడిట్టి తంత్రమును గల్పించెను. కాని యతనితంత్రము పాఱనందున వెంటనే సాహూను స్తోత్రపాఠంబులచేతను, ప్రతినిధిని సామవాక్యములచేతను, సోమంతుని లంచముచేతను తనకిష్టులుగఁ జేసికొనెను. మొత్తముమీఁద నిజాము యొక్క తంత్రములు, దర్బారువం

డు తన పదవిని నిలుపుకొనుటకును, దక్కను నందు తన యధికారమును స్థిరము చేసికొనుటకును, నేర్పాటు చేయఁబడియుండెను. మహారాష్ట్రులలో పూర్వకలహములు చావకుండ నుంచుటకును, క్రొత్తవానిని పుట్టించుటకును, ఎప్పుడైన చక్రవర్తి రాజ్యము మీఁద వారిదెబ్బ లవసరమైనపుడు పడు నట్లు జేయుటకుఁగాను వారితో సంబంధమును విడిపోకుండ నుంచుకొనుటకును, . అతఁడు యుద్యమముగ నుండెను. ఈరాజ తంత్రములు కొంత యసందిగ్ధముగ నున్నను, అతఁడు తన జీవితకాలములో నీ యత్నముల వలన చాలవఱ కభివృద్ధినొందుచునే వచ్చెను. కావున నీయుద్దేశముతో మొగలుచక్రవర్తితో తన ప్రస్తుతస్నేహము వలనఁగాని భవిష్యద్విరోధము వలనఁగాని యేమిసంభవింపగలదో స్వయముగఁ జూచుకొనుటకు 1722 సం॥ము జనేవరిలో డిల్లీకిపోయి మరల చేరెను. నిజాముల్ ముల్కుయొక్క నియమము లేవియు దర్బారునందలి భోగపరాయణులగు సర్దారులకు పనికివచ్చినవి కావు. హైదరుకూలీఖాను కొన్ని యక్రమములు చేసి చక్రవర్తి నగౌరవించి అహమ్మదాబాదుపోయినందున నతని దండించుటకు నిజాముల్ ముల్కు నియమింపఁబడెను. వీరిద్దఱును చాలా కాలము యుద్ధము చేసి పరస్పరవినాశమును చేసికొనవలెనని దర్బారువారియొక్క యుద్దేశమైయున్నది. కాని నిజాము, హైదరుకూలీఖాను సైన్యమునందు ద్రోహమునుఁబుట్టించిజయమునొంది, అహమ్మదాబాదునందు తన మేనమామయగు హామేదుఖానును, మాల్వాయందు అజీముల్లాఖాను అను తన బావమఱఁదిని నియమించి డిల్లీకి వచ్చెను. అయిన నచ్చట చక్రవర్తికిని యితనికిని పరస్పర ద్వేషము పెరుగుట వలన నుండఁజాలక 1723 అక్టోబరు మాసమున వేటకుఁబోవుమిషమీఁదఁ జెప్పకుండ దక్కనునకు వచ్చిచేరెను. అటుతరువాత నతఁడు సంపూర్ణస్వతంత్రుఁడైనను పేరుకుమాత్రము, చక్రవర్తితోఁ బోరుచున్నను వినయవిధేయత లున్నటులనే నటించుచుండెను. అట్లు నర్మదానదికిఁ గ్రిందనున్న దేశము ఒకశతాబ్దమువఱకును మొగలులచే జయింపఁబడుటకుఁ బ్రయత్నింపఁబడినను, చిట్టచివఱకు డిల్లీ సింహాసనమునుండి పూర్తిగఁ ద్రెంపి వేయఁబడెను.

హిందూస్థానమునం దీ కథ జరుగుచుండ బాజీరావు సైన్యసమేతుఁడై ఖానుదేశమున కరిగి తన మొఖాసామ పసూలుచేయ మొదలుపెట్టెను. ఇందుకు నొత్తుగ నాటంకములు పెట్టఁబడక పోలేదు. అతఁడు, పీష్వాయైనప్పటినుండియు, నుత్తరమునకు మహారాష్ట్రదండయాత్రల నడుప నుద్దేశించుచుండెను. అతని దృష్టి ప్రథమమున మాల్వా పైఁ బాఱినది. కాని కొన్ని స్థితిగతులవలన
1724 1724 వ సం॥ మునకు పూర్వము మూఁడు దండయాత్రలందును వర్షకాల మాసన్నమగు నప్పటికి మరల సతారాకు రావలసిన వాఁడగుచుండెను. అతఁడు మాల్వాలోనికి సైన్యభాగములను పంపించుచున్నప్పటికిని ఈసంవత్సరమాఖరు వఱకు నతఁడు స్వయముగ నర్మదానదిని దాటి పోయినట్లు కనుపడదు. అతఁడు పీష్వాయైన తరువాత 11 సంవత్సరములకుఁ గాని మాల్వాయందు చాలకాలము స్థిరముగ నుండలేదు. నిజాముల్ముల్కు తంత్రాంగములవలనను, అంతరంగిక ప్రతివాదములవలనను, అతని యుదాత్తమనోరథసాహసంబులు కట్టువడి యుండెను.

1724 వ సం॥ మునకుఁ బూర్వము బాజీరావు వివిధ సమయములందు బర్హాంపురముయొక్క సుభేదారు నోడించెను, మాల్వానుండి అజీముల్లాఖానుచేఁ బంపబడినదావుదుఖాను నతఁ డోడించెను. ఈ యుద్ధములలో నొకదానియందు బాజీరావుయొక్క యిద్దఱుద్యోగస్థులు ప్రసిద్ధిలోనికి వచ్చిరి. ఇందొకరు కొంత స్వంతయశ్వసైన్యమునకు నాయకుఁడైన మల్హారిరావు హోల్కారు. ఇతఁడు మహారాష్ట్ర ధన్గరు. (గొల్లవాఁడు.) ఈవర్ణము శూద్రులు రామచంద్రపంతు కాలములో నెక్కువగ సైన్యమునందుఁ జేర్చుకొనఁబడుచు వచ్చిరని యీవఱకు చెప్పియున్నాము. ఇతఁడు నీరానదీతీరముననున్న హోలు అను గ్రామమున చౌగులా (పటేలు క్రిందనాయకుఁడు). ఇతఁడు రాజాయుద్యోగస్థులలో నొకఁడైన కాంతాజీ కుద్దము భాండేయను వానిక్రింద సేవఁజేసి, కొంత యశ్వదళమును పోగుచేసికొనెను. హోల్కారు వంశమున కితఁడే మూలపురుషుఁడయ్యెను. రెండవ యుద్యోగస్థుఁడు, సతారా గ్రామమునకు తూర్పున 5 మైళ్లదూరముననున్న కన్నేరకారు అను గ్రామముయొక్క సింధియా

వంశము యొక్క కనిష్ఠశాఖయం దుదయించిన రానోజీ సింధియా యను వాఁడు. భామనీల కాలమునుండియు సింధియాలు ప్రసిద్ధమైన సిలేదారులుగ నుండెడివారు. ఈపేరు గలవి రెండు ప్రసిద్ధములైన వంశములు కలవు. ఒక వంశమువారు కన్నేరుకారు గ్రామము యొక్క పటేలులై ప్రసిద్ధి వహించిరి. రెండవవంశము రవిరావు అను పౌరుష నామమున చెలంగియుండెను. రెండు కుటుంబముల వారును రాజపుత్ర సంజాతులమని చెప్పుకొందురు. కన్నేరు కారువారు ఔరంగజేబుదగ్గర మన్సబుదారిని సంపాదించి యుండిరి. ఆ చక్రవర్తివలన సాహూకిచ్చి వివాహము చేయఁబడిన సింధియా కుమార్తె ఢిల్లీలో చెఱయందు చనిపోయెను. ఆ సింధియా మొగలులకు భక్తుఁడుగనే యుండెను. అతఁడు బహుశః ఆగ్రాయందుపోరాడి అజముషాతో కూడ చనిపోయియుండ వచ్చును. అప్పటి యాకుటుంబము ఖిలమైపోయి యుండ మరల కీర్తిఁదెచ్చిన రానోజీ దరిద్ర పీడితుఁడై, బాలాజీ విశ్వనాథుని హాగా పటాలమందును తరువాత బాజీరావు క్రిందను సామాన్య బార్గీరుడుగా పనిఁజేసెను. అతని ప్రస్తుతపు దీనస్థితిని తెలియపఱచుట కతఁడు పేష్వాయొక్క పాదరక్షలు మోయుచుండెడి వాఁడని చెప్పఁబడుచున్నది. అతఁడట్టి యుద్యోగమును బహుశ్రద్ధాభక్తులతోఁజేయుచుండుటను జూచి బాజీరావతనిని విశ్వాసపాత్రమైనయుద్యోగమునందుంచఁ దలఁచెను.

ఈకాలములో నున్నతికి వచ్చిన యింకొకయుద్యోగస్థుఁడు ఉదయాజీ పవారు విశ్వాసరావు. ఇతని తండ్రి, జింజీముట్టడి కాలములో, రామచంద్ర అమాత్యునివలన, నున్నతికిఁ దేఁబడెను. ఈయౌవనుడు సాహూపక్షము చేరి గొప్పహాగా సైన్యమున కధిపతి యయ్యెను. ఇతఁడు, కాంతాజీ కదమ పీలాజీ గాయక్వాడు కనోజీ భాంస్లే మొదలైన వారివలె, మాల్వా గుజరాతు మొదలగు దూరదేశ యాత్రలచే సంపాదకుఁ డయ్యెను. ఇతఁ డచ్చటి దేశము బలహీనముగ నున్నందున కొంచెముసాయము చేసినయెడల ధారు సర్దేశముఖీలువతనాలు చేసెదనని రాజునకుఁ దెలియ పఱచుచుండెను. కాని గిరిధర బహద్దరు మాల్వాకు గవర్నరుగా నియమింపఁబడిన తరువాత నితఁడు మాల్వాకు పశ్చిమముగ నున్న ధారు స్థుండి వెనుకకు మరలవలసిన వాఁడాయెను.

ఈ ఉదయాజీపవారు యొక్క యభివృద్ధియు, గుజరాతు నందు కాంతాజీ కద్దము పీలాజీ గాయక్వాడుల జయములును, నిజాములుముల్కు కును చక్రవర్తి దర్బారునకును గల మనస్పర్ధలును, హిందూస్థానమునందు మహారాష్ట్ర విజృంభణమునకుఁ గల పీష్వా యొక్క యభీష్టముల కెంతయు ననుకూలములయ్యెను. కాని యివి సాహూచే నామోదింపఁ బడలేదు. వివేక విచారములచేతను, ప్రతిపక్ష భావములచేతను, శ్రీపతిరావు ప్రతినిధిచే నివి ఖండింపఁబడెను.

బాజీరావు చిన్నతనమునుండియు వ్యవహార విషయములందు తండ్రిచే సుశిక్షితుఁడయ్యెను. ఇతఁడు, తండ్రితోఁగూడ ఢిల్లీకరిగి, బాలాజీకిని జయపూరురాజగు జయసింగునకును జరిగిన రెండు మూఁడు సందర్శనములందు, ఉండియుండెను. ఆ ప్రసిద్ధ నాయకునితో భవిష్యత్సంబంధము దీనివలననే వృద్ధిఁ బొందెను. శాస్త్రమునందును రాజతంత్ర జ్ఞానమందు నతఁడు సంపన్నుండై యుండెను. బాజీరావు, మహారాష్ట్ర ప్రముఖునియొక్క సాహసము, దార్ఢ్యము, కాఠిన్యము మొదలైనవానితో, కొంకణస్థ బ్రాహ్మణుని యొక్క బుద్ధిసూక్ష్మ విలాస వాక్చాతుర్యములను కలిగియుండెను. బాజీరావు, తన తండ్రియొక్క రివిన్యూ పద్ధతులతో పరిచయుఁడై యుండి, మహారాష్ట్రము యొక్క దోపిడితండములను సామాన్య యుద్యమమునకై సంధించు నా పద్ధతియొక్క భాగము, నతఁడెన్నుకొనెను. ఈవిషయములో తండ్రి యేర్పఱచిన పద్ధతుల ననుసరించుటకు బాజీ రావునకు బుద్ధినైపుణ్యముఁ గలదు. అనేకమంది బ్రాహ్మణులవలె గాక, అతఁడు యోచించుటకు బుద్ధిబలంబును, దానిని నిర్వహించుటకు బాహు బలంబును, కలిగియుండెను. అతని బ్రాహ్మణ వర్ణమునకు సహజంబగు శ్రద్ధాసక్తికిని సూక్ష్మబుద్ధికిని నతఁడు వివేచనా శక్తిని తోడ్పఱచెను. ఈవివేచనా సామర్థ్యమే యతని పరిపాలనా కాలమునందు మహారాష్ట్రాధికారమును వృద్ధిచేసెడు ముఖ్యరాజకీయ విషయములను గమనింప నతనికి శక్తినిచ్చెను.

బాజీరావునకు, విదేశ శత్రువులే గాక, కొన్ని సామర్థ్యములుకల ప్రతి

నిధి శ్రీపతిరావు స్వదేశ రక్షకుఁడుగ కూడ నుండెను. వీరిద్దఱకునున్న వైరము, కొంతవఱకు బాజీరావు యొక్క యభీష్టములు వెంటనే నెరవేరకుండ నడ్డుకట్టెను. దీనివలననే యతఁడు తఱుచుగ దండ యాత్రలనుండి సతారాకు తిరిగి రావలసివచ్చుచుండెను. నిజాములు ముల్కునకు అంతః కలహములను కలిగింప కొంచెము వీలుకూడ కలుగుచుండెను.

పీష్వా మొట్టమొదట, మాల్వాయందు తనకు స్థిరపడిన కప్పమును వసూలు చేయుటకును, హిందూస్థానమందు మహారాష్ట్ర విజయంబులను బరపుటకును ప్రస్తావించెను. ఈ వఱకు చెప్పిన విధమున నీ ప్రస్తావన ప్రతినిధి వలన తీక్ష్ణముగ ఖండింపఁబడెను. ప్రతినిధి దానిని 'ఆతురమును నవివేకము' నని వాదించెను; 'ఎప్పుడైన నరుదుగ దండయాత్రలు చేయుచుండిన రాష్ట్రముయొక్క యధిపతి యందుకుఁ బ్రత్యుత్తరమియ్య కోరఁబడడు. కాని పుట్టి యధికారమును ముఖ్యప్రధాని చేతిలోఁ బెట్టినయెడల సామ్రాజ్యముయొక్క యావద్బలము నదియాకర్షించును. నిజాములు ముల్కుతో కలహము శీఘ్రమ పొసగును. అతని జయశీలురైన భటులింకను మన రాజ్యముయొక్క సరి హద్దులను విడిచియుండలేదు. ఎదిరించుటకైన మనము సిద్ధముగ లేకపోవుటయే గాక యేర్పాటులందుకూడ క్రమమేమియును లేక యుంటిమి. సామాన్యమైన యొక్క తిరుగఁబాటు జరిగెనేని మనమురక్షించుకొను స్థితియందులేము. మన కిప్పుడొసఁగఁ బడిన దానిని మనమింకను భద్రము చేసికొనక పూర్వమే యుద్ధ సన్నద్ధుల మగుటంత యవివేకమును ఆతురపాటును మఱియొకటి యుండఁబోదు. అంతియకాక పీష్వా యెంత యోధుఁడో నేనునంత యోధుఁడను. అవసరమైనచో దండయాత్రను నడుపుటకు అతనితో సమానముగ నేను సంసిద్ధుఁడ నగుదును. మన శిస్తు వసూలు చేయువారేర్పడి దేశముయొక్క తక్కిన భాగములన్నియు సవరింపఁబడిన తరువాత, ఉత్తర దిగ్విజయంబునకు వెడలుటకుఁ బూర్వము కర్ణాటకము గెల్ల వశపఱుచుకొని శివాజీ మహారాజాచే జయింపఁబడిన రాజ్యములు సంపాదించుట యుత్తమము. కర్ణాటక పెష్కాసాలు వసూలుచేయుటకు, ఫత్తేసింగు భాంస్లే వసదుల చేతఁ బట్టు

కొని యున్నప్పటికిని, అతని సైన్యములు, కొల్లాపురము శంభాజీ యొక్కయు, అతని సహాయులగు చావను, ఘోరేపురే, సావనూరు నవాబు మొదలైనవారి యొక్కయు బలంబులచే, కృష్ణానదిని దాటఁజాలకున్నవి. కావున మన ప్రయత్నము మొట్టమొదట ఆ దిక్కునకు ప్రయోగింపఁ బడవలయును' అని ప్రతినిధి యుగ్గడించెను.

శ్రీపతిరావుయొక్క యథార్థమైన యభిప్రాయమే యదికావచ్చును: కాని బాజీరావుయొక్క బుద్ధిసూక్ష్మ మంతకంటె దివ్యతరంబైనది. దోపిడి యధికారముయొక్క స్వభావ మతఁడు చక్కగ గ్రహించియుండెను. గందరగోళమునందును ఆ రాజకమందు నది యుదయించి వృద్ధిపొందెనని యతఁడు పరీక్షించి యుండెను. ఆ దోపిడి యధికారమునకు రివిన్యూవసూలు చేయు హక్కును పంచియిచ్చుటే సిద్ధౌషధము. దేశమునకు వెలుపల గంద్రగోళము వలన నాంతరంగిక శాంతము కలుగునని యతడు దూరదృష్టితో పరికించెను. దూరదేశ దండయాత్రలకధిపతిగనుండుటవలన నతఁడు సామ్రాజ్యమందు మఱియే ప్రముఖునికంటె నెక్కువ సైన్యమును గణింపవచ్చునని యితఁడు తెలిసికొనెను. అనవసరముగ నింటఁగూర్చుని ధనమెల్ల వ్యయపఱచు నట్టి సైన్యములు దూరదేశమునకు తీసికొని పోఁబడినయెడల దేశము బాగు పడుటయే గాక, అట్టి సైన్యములకు పనియును బత్తెమును నొసంగి, యన్ని వర్ణములును అన్నివిధములునైన దోపిడి మూఁకలను నయభయములచే నదుపులోనుంచుకొనఁగలిగిన వాని వశములోనే యవి యుండఁగలవని యతఁడు వాదించెను. శ్రీపతిరావు యొక్క వాదముల సత్యమును కొంతవఱ కంగీకరించుచు, తన యొక్క యుద్దేశముల నన్నిటి నొక్కమారుగ వెలికిఁ జెప్పకుండ, నతఁడు తన వక్తృతా గరిమవలన రాజాయొక్క కీర్తివంతుఁడగు తాతగారి యద్భుతవిజయంబులను వర్ణించుచు, అతఁడు జయశీలుఁడై పోరాడిన మేటి పృథ్వీపతులను సార్వభౌముని స్మరణకుఁ దీసికొని వచ్చుచు, నాయనయందు ఉత్సాహాధిక మనోరథంబులను గల్పింప యత్నించెను. మొగలుల దుర్బలమును, మాంద్యమును, చిత్తవైకల్యమును,--- మహారాష్ట్రుల సామర్థ్యమును, ఉత్సా

హామును సాహసమును- అతనిచే చక్కగ వర్ణింపఁబడెను. అంతియగాక యతఁడిట్లు బల్కెను, "విదితయశుండగు శివాజీ, ప్రతినిధియొక్క యభిప్రాయము నే కలిగియుండిన యెడల నతఁడు కర్ణాటమునఁ బ్రవేశించుటకు పూర్వము బీజపూరు గోల్కొండలను వశము చేసికొనుట యవసరమని తలఁచెడివాడే. కృష్ణానది కావల తమకున్న యంతఃకలహములనుఁ గూర్చి తరువాత యాలోచించుకొనవచ్చును. మహారాజుగారి యెడలనున్న లక్ష్మీ కటాక్షంబువలన నెల్ల మనోరధంబులు సఫలంబగును." ఒకనాఁడు నిండు కొలువుగంబున రాజును సభికులును దిగ్భ్రమ నొందునట్లు తన వాగ్విభవంబెల్ల విశదపడ గొప్ప యుపన్యాస మొకటి యిచ్చి బాజీరావు చివరకిట్లు దాని పూర్తిచేసెను. "హిందువుల దేశమునుండి పరదేశీయులను పాఱఁదోలి శాశ్వత కీర్తిని సంపాదించుకొనుట కిదియే తరుణము.మన ప్రయత్నములనెల్ల హిందుస్థానము దిక్కు ప్రయోగించుటవలన తమపరిపాలన కాలమందు మహారాష్ట్రపతాకము కృష్ణనుండి సింధూనదికు నాడుచుండును"

'నీవు హిమాలయశిఖరంబున * దాని స్థాపించెదవు. యోగ్యుడగు మీ తండ్రికి నీవు నిజముగ ధీరుండగు పుత్రుఁడవు' అని రాజువిస్మయ మగ్నుఁడై పల్కెను.

బాజీరావు ఆసమయమును గైకొని సాహూను స్వల్పవిషయములను గూర్చి విచారింప వలదని చెప్పుచు, మొగలు సామ్రాజ్యమునుతలంచి యిట్లు చెప్పెను. 'ఈవాడిపోవుచున్న వృక్షమును మూలంట దెగవేయుదము. శాఖలు వానంతనవి కూలిపోవును.'

సాహూయొక్క యంగీకారము, సరిగ నెప్పుడు తీసికొనఁబడినదో యెక్కడను చెప్పఁబడియుండలేదు. కాని ముఖ్యప్రధానికి చాల యధికారముచేరినను అట్టి విషయములలో సాహూయొక్క యంగీకారము తీసికొనుట పీష్వాలు నియమముదప్పక జరుపుచువచ్చిరి. దేశీయులందఱును ఇంకను రాజునెడల నభి

---

* సాహూ హిమాలయముల కావల నున్న కూనూరు ఖండమనుమాట నుపయోగించెను.

మానశ్రీ యున్నందున నాతనియంగీకారము వలననే పీష్వాలకు అధికారబలము కలిగియుండెను.

ఇంతటినుండి మహారాష్ట్రచరిత్ర మొగలుల వ్యవహారములతో సల్లుకొని యుండునుగాన దానికొంచెము విమర్శింతము. నిజాముల్ముల్కు దక్కనుకు చెప్పకుండ పోవుట చక్రవర్తిచే నవమానముగా నెంచఁబడెను. అదివఱకు హైదరాబాదులో నుంచఁబడిన సుభేదారునకు నిజాము నెదిరింప వలసినదని రహస్యముగ నుత్తరువులువచ్చెను. కాని నిజాముల్ముల్కు వాని సైన్యమందు ద్రోహమును కల్పించి యతనిని 1724 సం॥ ము 1 వ అక్టోబరులో సుకుర్వ్యారాయొద్ద నోడించి రాజ్యమును సంపాదించుకొనెను. శత్రువుయొక్క శిరమును ఖండించి దర్బారునకుఁబంపుచు చక్రవర్తియొక్క యూయుధబలమువలన జయమొనఁగూడినదని హాస్యముగ నతఁడు దర్బారునకు త్తరము వ్రాసెను. చక్రవర్తి, నిజాముల్ముల్కునకు గుజరాతుమల్వాలయధికారమునుదప్పించి, యందు మొదటిదానికి సర్బులందుఖానును, రెండవదానికి రాజాగిరిధర బహద్దరును గుజరాతు నాగర* బ్రాహ్మణుని అధికారులుగ నియమించెను. బులందుఖానుపక్షమున సుజావుతుఖానుఁడు గుజరాతు నేలుటకుపంపఁబడెను. అచ్చట నిజాముల్ముల్కు మేనమామ హామేదుఖానుఁడంతకుపూర్వము పాలనఁజేయుచుండెను. ఇతఁడు సాహూ సేనాపతియగు కాంతాజీ కుద్దముభాండే సహాయ్యమున అహమ్మదాబాదులో కలిసికొని యుద్ధమునందు శత్రువును బరిమార్చెను. సుజావుతుఖానుని తమ్ముఁడగు సూరతుగవర్నరు పీలాజీగాయక్వాడుతో సంధిచేసికొని యతని సాహాయ్యమున హామేదుఖానుని శిక్షింపనరుదెంచెను. కాని పీలాజీని రహస్యముగ హామేదుఖాను ద్రోహమునకుఁ ద్రిప్పెను. కావున నా పీలాజీ యుద్ధసమయమున తనమిత్రుని ఫిరంగి శకటంబులను విడిచి శత్రువును వెన్నంటి పోవలసినదని బోధించి యతఁడట్లరుగగనే ఫిరంగిశకటంబుల తలక్రిందులుచేసి వెనుకనుండి తానుకూడ ముట్టడించె

* నాగరబ్రాహ్మణులు గుజరాతులో నొకతెగవారు. వీరు మహమ్మదీయుల కాలమునుండియు వ్యవహారకర్తలుగను, యోధులుగను ప్రసిద్ధిలోనుండెడివారు.

ను. సూరతుగవర్నరు ఇద్దఱు శత్రువుల మధ్యఁబడి ధైర్యముతో పోరాడి రణ
నిహతుఁ డయ్యెను. పీలాజీయీ ద్రోహమునకు కాంతాజీతోఁ గూడ చౌతునందు
1725 సగభాగమును వసూలు చేసికొనునట్లు హమేదు ఖానేర్పరచెను. పీలాజీ
గాయక్వాడు త్రింబకురావు దాభడేయొక్క యేజంటు. కాంతాజీ క
ద్దము సాహూరాయుద్యోగస్థులలో నొకడు. వీరిద్దఱు నొకరికంటె నొకరుగొప్ప
యధికారము కలవారమని ధనము పంచుకొనుటయందు తగవులాడుచుండిరి.
వీరుజనులను భయపెట్టుచు కాంబేదగ్గఱకు వచ్చునప్పటికి నచ్చటిజనులు కాం
తాజీయే యెక్కువయధికారియని తెల్పుచు, పీలాజీని 20000 రూపాయలిచ్చి
వెడలిపొమ్మని చెప్పుటకు రాయభారి నొకరిని పంపిరి. పీలాజీ యందుకు కోపా
యత్తచిత్తుఁడై వానిని బంధించివేసెను. ఇందుకై వారిద్దఱును యుద్ధమునకు
దొరకొనిరి. అందు పీలాజీ యోడిపోయెను. జయము నొందిన కాంతాజీ కాంబే
యందు కప్పమును వసూలుజేసెను. ఇంగ్లీషు ఫాక్టోరీనుండి 5000 రూపా
యలు కప్పముగా నియ్యవలసినదని వారడిగిరి. అచ్చటిఫాక్టోరీ యేజంట్లు సా
హూరాజాయొద్దనుండి పన్ను లేకుండ వర్తకము చేసికొనుటకు మినహాయింపును
పొందితిమని చెప్పిరి ఇందుమీఁదనా 'ఆయుధపాణులగు దుష్టులట్టహాసముచేసి'
రని ఆ ఫాక్టోరీ యధికారియగు ఇన్నిసు చెప్పుచున్నాఁడు.

హమేదుఖాను, ఇద్దఱు మహారాష్ట్రస్నేహితులలో నొక్కరునుబోవు
టకిష్టములేనివాఁడై, వారిద్దఱకును సంధికూర్చి మాహీనదికి తూర్పున చౌతు పీలా
జీకిని పడమటచౌతు కాంతాజీకిని వచ్చునట్లేర్పాటు చేసెను. సర్ బులందుఖాను,
తనయేజంటు హమేదుఖానుచే హతుఁడగుట తెలిసికొని, చక్రవర్తిచే ననుజ్ఞా
తుండై యతని శిక్షింపవచ్చెను. హమేదుఖాను, తన మహారాష్ట్రస్నేహితులతో,
బులందుఖానుయొక్క పురోగమసైన్యము వచ్చునప్పటికి, అహమ్మదాబాదులో
షాయీబాగను నిప్పటికినియున్న రాజభవనమునందు, స్థానమేర్పఱచుకొని
యుండెను. కాని బులందుఖానుయొక్క ప్రధానసైన్యముయొక్క ఫిరంగిశక
టంబులు విరిగి పోయినవని తెలిసి పురోగమసైన్యమును గదిసి యుద్ధమునం
దోడించెను. కాని యీజయమువలన జననష్టము మాత్ర మెక్కువ కలిగినది. మహా

రాష్ట్రులు మఱియొక యుద్ధమునకు దిగుటకు ధైర్యము చేయరైరి. కావున హామేదుఖానుయును మహారాష్ట్రులవలె దేశమును కొల్లఁ బెట్టుచుఁ దిరుగ మొదలు పెట్టెను. బులందుఖాను అడ్డములేక ఫౌజుదారుల నేర్పఱచి గుజరాతునందు కొంతక్రమమును స్థాపింపయత్నించెను. కాని కాంతాజీ పీలాజీలు వర్షకాల మారంభమగు వఱకును దేశమునందు కొల్లఁబెట్టుచు, వానకాలమందు మామూలుప్రకారము విశ్రాంతికై పోయిరి. హిందూదేశమున కారామంబన నొప్పు గుజరాతుదేశము వర్షకాల మాసన్నమైన తోడ సస్యశ్యామల శోభితమై వరఫల పుష్పసంతతుల భాసిలు రమ్యలతాద్రుమావళులం గలిగి లోచనానందంబుఁ గావించుచు కొంత శాంతిం బొందియుండె. ఈప్రకృతిశృంగారము గలదేశమునందు మహారాష్ట్రులు ప్రవేశించిన విధంబును దెలియఁ జెప్పితిమి.

ఇఁక మాల్వాయందు బాజీరావు, మొగలుల యంతఃకలహము వలని యనుకూలతను గ్రహించు, రాజాగిరిధరబహద్దరడ్డమైన నతని నోడించి యచట చౌతును వసూలుచేయు నధికారమును పవారు. హోల్కారు సింధియాలకు నిచ్చి వారిసైన్యముల ఖర్చునకుగాను సగము మొఖాసానుంచుకొనుట కనుమతినిచ్చెను.

తరువాత పీష్వా, ఫత్తేసింగు భాంస్లేతో కలసి కర్ణాటకమునకుఁ బోయి శ్రీరంగపట్టణమునుండి కప్పముఁ గైకొనెను. ఈ దండయాత్రవలన విస్తారము
1726 లాభము పొందలేదని బాజీరావుయొక్క యుత్తరములవలనఁ దెలియ
వచ్చుచున్నది. బాజీరావు తిరిగి వచ్చునప్పటికి, ప్రతినిధి నిజాములు ముల్కుతో చేసిన రాచకార్యములకు, మఱింత యసంతృప్తుఁడయ్యెను. బాజీరావు తరుణములో నిజాముచేసిన తంత్రాంగములను భేదింపక పోయినయెడల విశ్వనాథుఁ డేర్పఱచిన పద్ధతుల కెల్లభంగము వచ్చెడిదే.

మొగలుల ఖిలమగుచున్న సామ్రాజ్యము, నిజాములు ముల్కు, తనవలనను, అతని దేశీయులగు తురానీమొగలుల వలనను, అరాజకములోనికి త్రోసివేయఁబడుటచేత మహమ్మదుషావలని భయం బుడిగినవాడై, మహారాష్ట్రుల విజృంభణ వలనను, వారి దినదినాక్రమణలవలనను, సామ్రాజ్యమునకును తన

కును గూడ రాఁబడులు కృశించిపోవు నను మాతనభీతి నొందినవాఁ[illegible] ఈ యాపదల నెల్లఁ బాపుకొనుటకును, తన యధికారమును దృ[illegible]కొనుటకును, మహారాష్ట్రులయం దంతఃకలహములు కల్పించుటకును న[illegible] వేసిన యెత్తులు చాతుర్య ధుర్యంబులై యుండెననుటకు సందేహములేదు. కాని యతఁడు ప్రతిపక్షియగు బాజీరావు యొక్క శక్తి సామర్థ్యములను విచారించి నటులఁ గనుపడదు.

సుఖురుఖేరా యుద్ధమైన తరువాత, నిజాములు ముల్కు తన దక్కను రాజ్యమునకు, కుతుబ్‌షాహి రాజధాని యగు హైదరాబాదును, తన పరిపాలనాస్థానముగ నేర్పరచుకొనుటకు కన్ను వేసియుండెను. అందువలన నతఁడు మహారాష్ట్ర చౌతు సర్దేశముఖీ జమాదారుల నచ్చటినుండి యెటులైనఁ దప్పింప వలెనని మనసులో నిశ్చయించుకొనెను. నిజాములుముల్కు, చక్రవర్తి సనదుల నెల్ల నంగీకరించినప్పటికిని ఇంకను అన్నిహక్కులను భుక్తమున కియ్యలేదు. సాహూయొక్క బాధ్యతయగు దోపిడులవాపుట నెఱవేర్పఁబడలేదు. ఇందుకై యింకను వివాదములు జరుగుచున్నవి. నిజాములు ముల్కు, పూర్వ మహారాష్ట్ర రాజ్యములో కొంతభాగమునకు క్రొత్తగ నధికారము నిచ్చుచు, నందు కొన్ని యిదివఱకు కొందఱ కియ్యఁబడిన జాగీరులు సాహూ తీసివేయకుండ నుంచునట్లు సమాధాన పఱచెను. పూనాదగ్గరనున్న పూర్వరాజ్యములో రంభాజీ నింబాల్కరుకు నిజాము ఇచ్చియుండిన జాగీరులు తూర్పున కర్మలా దగ్గిర క్రొత్తగ నిచ్చిన దేశమునకు మార్చఁబడెను. ఈ యేర్పాటులు సాహూ కనుకూలములైనవే. కాని దీని తరువాత, ప్రతినిధి ద్వారా, సాహూ హైదరాబాదు దగ్గఱ చౌతుసర్దేశముఖీలు వదలుకొనునట్లును, అందు మొదటిదానికిఁగాను నిజాము సమానమైన ధనము నిచ్చుటకును, రెండవదానికి ఇందపూరు నొద్ద కొంతజాగీరు నిచ్చుటకును ఏర్పాటుజరిగెను. బేరారులో నొక జాగీరు ప్రతినిధి కియ్యఁబడెను. నిజాములుముల్కు తన మొదటి రాజకార్యము నీ విధముగ జరిగించెను. కాని బాజీరావు నిజాముయొక్క రాజ్యమిట్లు దృఢపఱుపఁబడుట కంగీకరింపలేదు. ప్రతినిధికిని తీవ్రముగ ఇందునుగూర్చి

వివాదము లెక్కువాయెను. నిజాము వీనిచే ప్రోత్సాహము నొంది, చంద్రసేన జాధవుని యొక్కయు, రావు రంభా నింబాల్కరుయొక్కయు, బార్శీ జాగీరు దారుయొక్కయు, కొల్లాపురపురాజగు శంభాజీయొక్కయు సఖ్యముచే ధైర్యవంతుఁడై తన యుద్దేశమును పూర్తిగ నెఱవేర్చుకొనఁదలంచెను. కావున నతఁడు సతారా కొల్లాపుర రాజ్యములకుఁ గల పూర్వవైరము నుద్దీపింప నెంచెను. దాభరే తోడను, పీలాజీ గాయక్వాడు తోడను తనకున్న సంబంధము వలనను, మాల్వా గవర్నరగు రాజాగిరిధరుని ద్వారా పీష్వాయొక్క యుద్యోగస్థులకు మాల్వాయందు చేతినిండ పనిఁ గల్పింపఁ గలనను ధైర్యమువలనను, అతని సైన్యము లుత్తమము లైనవను గర్వము వలనను, అతఁడీప్రయత్నమును చేయుటకు సాహసించెను.

నిజామును ముఖ్య, శంభాజీకి రివిన్యూయందు సగభాగము రావలసి యున్నదను వ్యాజ్యమును, క్రమముగ విచారణ చేయుటకు దొరకొనెను. ఈ వివాదము పరిష్కారమగు వఱకును సాహూయొక్క ఛౌతు సర్దేశముఖీలు వసూలు చేయువారి నుద్యోగములనుండి తొలఁగించెదనని చెప్పి నిజా మట్లు చేసెను. బాజీరావు, మహారాష్ట్రదాయల నిట్లు వారసత్వ కలహము లందు పురికొల్పు, నీప్రాత పద్ధతిచే మోసపోవువాఁడు కాఁడాయెను. అతఁడు తత్క్షణమే నిజాముయొక్క యీయుద్ధము లతని దిక్కునకే త్రిప్పివేసెను. నిజాము తన వారసత్వమును గూర్చి ప్రశ్నించుచున్నాడని సాహూ వినిన తోడనే యొక్కసారి హిందూక్షత్రియులకు సహజంబగు కోపావేశంబు నొందెను. అతఁడు శత్రు సంహారణంబున సహాయంబునకై బాజీరావు దిక్కు చూచెను. సాహూ తనరాజ్యమునైనఁ గోలుపోయి నిజామును శిక్షించుటకు మనోనిశ్చయము చేసికొనెను. అతఁడు స్వయముగనే దండయాత్ర వెడలెదనని చెప్పెను గాని బాజీరావు చక్రవర్తి తప్ప మఱి యెవ్వరును హిందూరాజాతో స్వయముగ పోరాడుట కుద్ది కారని యతని వారించెను. పీష్వాకు సర్వాధికార మియ్యఁబడెను. వివిధకక్షుల సిలేదారు కుటుంబములును సత్వరముగ పీష్వాబలంబు లందు చేరుకొనెను.

నిజాముల్‌ముల్కు తానుచేసిన పొరపాటును గ్రహించిన వాఁడై, సాహూరాజును, ప్రతినిధికిని, తానుసదుద్దేశముతో కార్యముచేసి యున్నాననియు, కొంకణబ్రాహ్మణు లన్నియుద్యోగముల నాక్రమించుకొనుచున్నందున, వారిని తప్పించి, రాజుయొక్క బంధువుఁడేయగు శంభాజీయొక్క మొఖాసాదారులను వసూలుచేయువాండ్రఁగ నియమించితిననియు, రాజా పైచెప్పిన బ్రాహ్మణుల వశమునుండి తప్పించుకొనిన తరువాత తన స్వంతమనుష్యులనే నియమించుకొన వచ్చుననియు, ఉత్తరములు వ్రాసెను. ఈనటనలన్నియు బాజీరావుచే విశదపఱుపఁబడినపుడు సాహూ మఱింత తీక్ష్ణావేశుఁడయ్యెను. కావున నిరుపక్షములవారును వర్షాకాలమంతమై నదులు దాటుటకు వీలగుటతోడనే యుద్ధమునఁ గలియుటకు సన్నాహంబులు చేసికొనుచుండిరి.

నిజాముల్‌ముల్కు తనమిత్రులందఱితో కలియ వేచియుండెను. బాజీరావు ముందు రణరంగమునఁ బ్రవేశించి, మొగలుసైన్యమురాకముందే జాల్నాను ధ్వంసముచేసెను. నవంబరులో మహారాష్ట్రులను, నిజాముయొక్క పురోగమ సైన్యము, ఇవాజుఖాను క్రిందవచ్చి, యుద్ధమున కలిసికొనెను. బాజీరావు వారితో కొంతవఱకు సంకులసమరంబు సేసి మాహూరునకు కొంత వెనుకకు తగ్గి మరల సత్వరముగ ఔరంగబాదునకువచ్చెను. కొల్లఁబెట్టుటకు నిలువక వెంటనే బరహాంపురము నాశనము చేయవలయునని వదంతవేసి ఖాన్‌దేశమునకు పోయెను. ఇవాజుఖానును, నిజాముల్‌ముల్కును, బర్హాంపురమును రక్షించుకొనుట కతని వెంటఁ జనిరి. బాజీరావు, వారందఱును తమవస్తుసామగ్రులతో అజంటాఘాటీ దాటిరని తెలియఁగనే, యొకసైన్యభాగమును బర్హాంపురమునకుపంపి, ఎడమచేతి వైపునకు తిరిగి తిన్నగ గుజరాతునకుఁ దోవపట్టెను. అచ్చట దేశమును కొల్లఁబెట్టుచు పరిగి, బులందుఖానునకును నిజామునకు నున్న విరోధమును నిజాముయొక్క కపట వ్యవహారమును తనకనుకూలముగఁ జేసికొని, తన దండయాత్ర నిజాము వల్లనే జరుగుచున్నట్లు గుజరాతు నందు వదంతిని పుట్టించెను. వెనుక నిజాము సేనలు తరుముకొని వచ్చుచున్నందున ఈ వదంతి స్థిరముగ నాబులందుఖానుచే నమ్మఁబడెను. నిజాముల్‌ముల్కు వ్యర్థముగ

పేష్వాను వెంబడించిన వాఁడై, పొరపాటును గ్రహించినవాఁడై పూనాను నాశనము చేయవలెనను నుద్దేశముతో దక్కనుకై తిరిగెను. కాని యతఁడు అహమ్మదునగరము చేరకమునుపే పేష్వా కాసరబారి ఘాటునుదాటి, బీజపూరు గాందపూరు జిల్లాలను పాడుచేసెను. నిజాము గోదావరిని దాటినతోడనే, పేష్వా వచ్చి యతనిని తన కనుకూలమైన క్షేత్రము లోనికి దీసికొనివచ్చి భోజనసామగ్రులనెల్ల నడ్డుకట్టి నడకనుకట్టివేసెను. నిజాము చాలకష్టముమీద నది దాటవలసివచ్చెను. నిజాము ఈ రణమునఁ బ్రవేశించినపుడు అవసరమైన శీఘ్రముగమనమంతయు తన మహారాష్ట్ర మిత్రులు చేయుదురని తలంచెను. అందుచేత వారు తగినంత యాసక్తితోఁ బనిచేయుటలేదని యతఁడు నిందించెను. చంద్రసేన జాధవుడు తన సైన్యమంతయు మొగలులే కాని మహారాష్ట్రులు కారని చెప్పెను. కొల్లాపురపు శంభాజీ, తన సైన్యము స్వల్పమగుటయే గాక, వారు రహస్యముగ బాజీరావుయొక్క యాలోచనయందున్నారని చెప్పెను. శంభాజీ రహస్యముగ నిజాములు ముల్కుకు తన కారూ్కనుల కేమియు సొమ్మియ్యవలదనియు వా రపహరింతురనియు చెప్పుచుండెను. కారూ్కనులు రహస్యముగ నిజాములుముల్కుతో శంభాజీధనమంతయు వారకాంతలకును మధ్యపానమునకును వ్యయము చేయుచున్నాడని చెప్పుచుండిరి.

నిజాములు ముల్కు కేవలము మహారాష్ట్రులమీఁద నెప్పుడు నింత యాధారపడి యుండలేదు. అతని సైన్యములకుఁ గలిగిన బాధవలనను పీడనవలనను సమాధానముచేసి కొనుటకుఁ సిద్ధుఁడాయెను. నిజాము ముందు జల సమృద్ధిగల క్షేత్రమునకుఁ జేరుకొని రాయబారము లారంభించెను. బాజీరావు, శంభాజీని తన శిబిరమునకు పంపుటకును, మహారాష్ట్రీ రివిన్యూను ముందు వసూలు చేసికొనుటకు జామీనుక్రింద కొన్ని దుర్గము లియ్యఁబడుటకును, ఇదివఱకు నిలిచిపోయిన బాకీ లియ్యఁబడుటకును, కోరెను. నిజాములు ముల్కు మిత్రుని పట్టియిచ్చుట తప్ప తక్కిన పద్ధతుల కంగీకరించెను. అతఁడు రాజానకు దగ్గఱ చుట్టముకావున తగిన గౌరవముతో చూడఁబడ వలయునని బాజీరావు

చెప్పెను. చిట్టచివఱకు నిజాములు ముల్కు శంభాజీని సురక్షితముగా పన్హాలా యందు వదలిపెట్టిన తరువాత సాహూ యిష్టమువచ్చినట్లు చేయుట కేర్పాటుచేయఁబడెను.

బాజీరావు నిజాములు ముల్కులకు సందర్శనము కలుగగనే ఉభయుల సైన్యములును రణరంగమునుండి వెనుకకు మరలెను. ఇంతలో పీష్వా సర్ బులందుఖాను నొద్దనుండి గుజరాతుయొక్క ఛౌతు సర్దేశముఖీలు సంపాదించుటకు ప్రయత్నించుచుండెను. సర్ బులందుఖాను మహారాష్ట్రదండయాత్రల నాపుట కెంతయో తంటాలు పడెనుగాని యేమియుఁ జేయలేకపోయెను. కాంతాజీ పీలాజీలకు ఛౌతునిచ్చి సఖ్యము చేసికొనఁజూచెను గాని వారు రివిన్యూవసూలుమాత్రము చేసికొని దేశమునకు రక్షణచేసెడువారుకారు. బులందుఖాను రివిన్యూ నేమియు వసూలుచేసి కొనఁజాలనివాఁడై చక్రవర్తి కెంత విజ్ఞాపనము చేసికొనినను ఢిల్లీశ్వరుఁడేమియు సాయము చేసినవాఁడు కాఁడాయెను. ఇందువలన నతఁడు బాజీరావునకు ఛౌతు సర్దేశముఖీలిచ్చి 2500 మహారాష్ట్ర అశ్వసైన్యము నుంచుటకును, మహారాష్ట్ర జనులెవ్వరును విద్రోహ జమీందారులతో కలసి శాంతమునకు భంగము గలుగ జేయకుండుటకును, సంధి కుదుర్చుకొనెను. ఈ రివిన్యూ వసూలు పని కొంత త్రింబకురావు దాభరే కప్పగింపఁబడెను. ఈ గుజరాతు దేశమున వ్యవహారములలో జోక్యము కలుగఁజేసి కొనినందున బాజీరావుయెడల త్రింబకు రావున కసూయగ నుండెను.

బాజీరావును చిమ్నాజీ అప్పాయు గుజరాతునందు వ్యవహారములఁ జూచుచుండగ, కొల్లాపురపు రాజగు శంభాజీ, ఉదయాజీ చౌవనుచే పురికొల్పఁబడి, సాహూ యెంత జెప్పినను వినక, వరుణానదీ తీరమునఁజేరి, దేశమును కొల్లఁబెట్టుచుండెను. ప్రతినిధి, సాహూయొద్ద తనయెడల నదభిప్రాయమును మరల సంపాదించుకొనుటకుఁ గాను, కొల్లాపురపు రాజుపై దండయాత్ర నలిపి అతని సైన్యమునంతను పన్హాలాకు తఱిమివేసి తారాబాయిని ఆమె సవతియగు రాజాబాయిని పట్టుకొని సతారాకు తీసికొనివచ్చెను. వారకటు చెం

పాల యుంచఁబడిరి. ఈ యపజయముతో కొల్లాపురపురాజు సంధికొడంబ
1730 డెను. ఉత్తరమున కృష్ణావర్ణునా నదులకును, దక్షిణమున తుంగ
భద్రానదికిని మధ్యనున్న కొన్ని దుర్గములుగల దేశముతప్ప తక్కిన
జిల్లాలన్నియు సాహూ కియ్యఁబడెను. సాహూకు కొంకణములో రత్నగిరి
నిచ్చి కొల్లాపురరాజు బళ్లారి దగ్గిర కోపాలు పుచ్చుకొనెను. కొంకణములో
సాల్వి నుండి అంకోలా వఱకును కొల్లాపుర రాజ్యమందుండెను. ఉదయాజీ
చొవనుయొక్క వరుణానది తీరమున నున్న వార్గాము ఘరి ఉభయుల యిష్ట
ప్రకారమును నాశనము చేయఁబడెను. మెరిచ్, తత్సగాం, హాత్నీ మొదలైన
కృష్ణానదికి ఉత్తర తీరమున నున్న గ్రామములును బీజపూరు జిల్లాలో కొన్ని
దుర్గములును సాహూకియ్యఁబడెను. ఈ సమాధానము, రక్షణ శిక్షణలకు పర
స్పర సాహాయ్యము చేసికొనుటకుఁగాను, ఏర్పాటు చేయఁబడెను.

ఈ ప్రతినిధి జయము వలన బాజీరావు యొక్క యాధిక్యత యేమి
1731 యు తగ్గలేదు. నిజాములు ముల్కు ఇంకను బాజీరావును పదభ్రష్టు
నిఁ జేయవలయు నన్న యుద్యమమును విడువలేదు. గుజరాతులో
త్రింబకురావు దాభరే వెనుక చెప్పిన కారణము వలన నసంతుష్టుడై యుండు
టెఱింగి యతని యుద్ధమునకు పురికొల్పెను. త్రింబకురావు 35000 సైన్యమును
కూర్చుకొని యుద్ధమున కాయత్తమగు చుండెను. నిజాములు ముల్కు దక్క
ను నుండి సాయము చేయుటకాలోచించుచుండెను. బాజీరావున కీ సంగతి
తెలియఁగనే, వారి యాలోచనలు పూర్తిగ తేలక మునుపే, రణరంగమున
నిలువఁబడి యెత్తులు వేయుటకు సిద్ధపడెను. దాభరే తాను రాజుయొక్క
యధికారమును రక్షించుట కాయత్తపడుచుంటినని తెలియఁజేసెను. అందు
వలన పీలాజీ, కాంతాజీ, మొదలైనవారు అతని పక్షమునఁ జేరిరి. కాని బాజీ
రావు, దాభరే సేనాపతి నిజాములుముల్కు యొక్క సఖ్యము చేరి, మహారాష్ట్ర
రాజ్యమును భేదింపదలంచుచున్నాఁడనియు, నది రాజనీతి విరుద్ధమును ధర్మ
శాస్త్రవిరుద్ధము ననియు నిర్ధారణ చేసి సాహూమహారాజునకు చూపించెను.

నిజాములు ముల్కు యొక్క సన్నాహ మింకను పూర్తి కాక పూర్వమే

బాజీరావు, దాభడే యొక్క సైన్యములో సగము సైన్యమున్నను జంకక, గుజరాతునకు బయలు వెడలెను. మార్గమున తన పురోగమ సైన్యభాగము నర్మదానదిని దాటిన తోడనే పీలాజీ కుమారుఁడగు డమ్మాజీ నెదుర్కొని యోడి పోయినను బాజీరావు నిరుత్సాహుఁడు కాక, యతని మామూలు పద్ధతి ప్రకారము కాక వెంటనే సంకుల సమరమునకు చొరఁబడెను. దాభడే యొక్క క్రొత్తగఁ జేర్చుకొనఁబడిన సైనికులు, అనుభవ మెక్కువఁగల బాజీరావు యొక్క యోధుల దెబ్బకు నిలువలేక, రణరంగమునుండి పలాయనులైరి. త్రింబకురావు దాభడే గజారూఢుండై, తన మూకలు శౌర్యముదక్కి రణవిముఖులై పాఱుటఁ జూచి, తన యేనుఁగును పరుగెత్తకుండ గొలుసులతో కట్టివేసెను. బాజీరావు అశ్వారూఢుండై సైన్యములఁబురికొల్పుచు, నట్టి మహాసమయమున కవసరమైన ధైర్యోత్సాహంబులతో ముందుకుఁద్రోసికొని పోవుచుండెను. కాని రణరంగమున శత్రుభటులు లేమాత్రమును త్రోవనియ్యక పట్టుదలతో పోరాడుచుండిరి. జయము సందేహముగనుండెను. అట్టి సమయమున త్రింబకురావు వింటి నెక్కుపెట్టి దివియుచుండ నొక్క గుండు దెబ్బతగిలి హతుఁడయ్యెను. అతని మరణముతో బాజీరావు సంపూర్ణ విజయుఁడై మహారాష్ట్ర రాజ్యమునకు నామమాత్రావశిష్టంబుగ నధికారి యయ్యెను. బగోడాకును దుభోయికిని మధ్య జరిగిన యీయుద్ధమందు పీలాజీ గాయకవాడు కొడుకొకఁడుచచ్చిపోయెను. ఆనందరావును, పీలాజీయు గాయము తిని పాఱిపోయిరి. తరువాత సంధి జరిగెను. బాజీరావు నిజాముల ముల్కు యొక్క ద్రోహమునకు శిక్షించెడు వాఁడే కాని యాటక్కరు రాజతంత్రజ్ఞుఁడు తన యొక్క కుతంత్రముల ఫలము విరచుకొని తన నెత్తిమీదనే పడుటఁగాంచి యా దెబ్బను తానుభరించుటకు భయఁపడి, మొగలు సామ్రాజ్యాధిపతి పైకిఁ దప్పించిన వాఁడాయెను.

బాజీరావును ఇందుకు సమ్మతించెను. అతని రాజనీతి కది యనుకూలముగాఁ గాన్పించెను. అంతరంగమున శాంతిని భంగపరచు నతని సైనికుల కది పనిఁ గల్పించెను. వెంటనే సోదరుఁడగు చిమ్మాజీ, సైన్యములతో మాల్వా కంపఁబడెను. బాజీరావు మాత్రము పూనానగరాలయందు అంతరంగిక వ్యవ

ములను జూచుచు కొంతకాలముండెను. ఈ కాలములో నిజాములుముల్కు బాజీరావును చక్రవర్తి రాజ్యము నాక్రమింపబోధించుచుండెను.

దాభరే సేనాపతి యోటమివలన నాపక్షపు జనుల మనములందుకోపము కొంతకాలము వఱకు రగులుచునే యుండెను. కావున బాజీరావు సామమున వారిని సఖ్యపఱచుకొనఁ బ్రయత్నించెను. పూనాకు వాయువ్యమూలనున్న తేలిగామములో ప్రతి సంవత్సరము దాభరేలు సంతర్పణలు చేసి విద్యార్థులకును, ఉపాధ్యాయులకును వైదికులకును దక్షిణల నిచ్చుచుండెడువారు. బాజీరా వీ యాచారమును నిలువఁబెట్టెను. త్రింబకురావు యొక్క సేనాపతిత్వమునకు జన్వంతరావును నియమించెను. అతఁడు పసివాఁడైనందున తల్లి ఉమాబాయిసంరక్షకురాలుగను, పీలాజీగాయక్వాడు, మంషీరు బహద్దఱును పూర్వపు బిరుదుగాక, సేనాఖాస్ ఖేలు అను మఱియొక బిరుదియ్యఁబడి ముతలికుగాను, ఉంచఁబడిరి. సాహూ, పీష్వాకును సేనాపతికిని సంధికూర్చి, యందు పీష్వా గుజరాతులోనికి పోకుండఁగను, సేనాపతి మాల్వాలోని కరుగకుండ నేర్పాటు చేయించి, సేనాపతి తన రివిన్యూలో సగభాగము పీష్వాద్వారా మహారాష్ట్రగవర్నమెంటునకు చెల్లించునట్లుగాఁ జేసెను.

గుజరాతునందు బులందుఖాను చౌతు సర్దేశముఖీలు మహారాష్ట్రులకిచ్చి వేసినందుకు చక్రవర్తిసమ్మతింపక, అతని నుద్యోగమునుండి తప్పించి జాద్పూరురాజగు అభిసింగు అను నతని నియమించెను. బులందుఖాను క్రొత్త గవర్నరును కొంత యెదిరించెనుకాని తరువాత సమాధానపడి డిల్లీకరిగెను. అచ్చట నతడు చేసినకార్యమునకు చాల యవమానింపఁబడెను. బులందు ఖానునకు కావలసిన సాయము చక్రవర్తి చేయక పోయినను, తత్కారణమున నతఁడు చేసిన యేర్పాటునకు మాత్ర మవమాన పఱుచుటయందు వెనుదీయలేదు. దీనిఁజూచి నిజాములు ముల్కు చక్రవర్తియొక్క సఖ్యము వలనను గూడ లాభములేదని తెలిసికొనెను. ఇదివరకే విరోధము నతఁడు సంపాదించెను. పీష్వా చూడ నధికారమందు దినదిన ప్రవర్ధమానుఁడగు చుండెను. కావున నిజాములు ముల్కు, పీష్వా తనపైకివచ్చి తన రాజ్యమునంతను కృశింపఁ

చేయుటకంటె, చక్రవర్తిపైఁబడి తదుద్యోగమునం దతని బుద్ధిశౌర్యబలంబుల వినియోగించుచుండిన మేలని తలంచి, యతని నందుకు పురికొల్పెను.

పీష్వ గుజరాతులో వ్యవహారములన్నిటిని చక్కఁ బెట్టుకొనిన తరువాత మరల మాల్వాపైఁ దిరిగెను. దీని కొఱకు నిజామును కొంత ధన సాహాయ్యము నడిగెను. నిజాము, ఖానుదేశమును, మార్గమునఁ బోవుచున్నపుడు, సురక్షితముగ నుంచునట్లును, దక్కను నందలి ఆఱు సుభేలందును మామూలు కంటె నెక్కువపన్ను వసూలు చేయకుండునట్లు నతని నొప్పించి ధన సాహాయ్యము చేసెను.

మాల్వాలో ననేక భాగములు, పవారు, హోల్కారు, సింధియాల వలనే
1732 కప్పము విధింపఁబడెను. రాజాగిరి ధరుఁడు ప్రతి పర్యాయమును తు మా తేజంబులతోఁ గాపాడుకొనుచుండెను. కాని చివరకు 1729 సం॥ములో రణ నిహతుఁడాయెను. అతని బంధువగు దయా బహద్దరు సుభేదారై మహారాష్ట్రసండయాత్రల నడ్డగింప కొంత ప్రయత్నము చేసెనుగాని చివఱకు ధారు దగ్గిర తాలాయొద్ద చిమ్నాజీ వలనను మల్హారరావు వలనను ఓడింపఁబడి యుద్ధమునందు మృతినొందెను. తరువాత బాజీరావు నర్మదా నదిని దాటివచ్చి, సైన్యాధిపత్యము చేకొని, తమ్ముని దర్బారునందు తన యాధిక్యతను నిలువఁబెట్టుటకును, కొంకణమందు అల్లరులను తగ్గించుటకు కొన్ని యేర్పాటు చేయుటకును, సతారాకు పంపెను.

అట గుజరాతునందు అభిసింగు బరోడాను మరల పట్టుకొనిన వాఁడై, పీలాజీ కోలీలతోడను భిల్లులతోడను ఎక్కువ పరిచయము కలవాఁడగుట వలన నతని నేమియుఁ జేయఁజాలక అక్రమముగ కడతేర్చుటకు కొందఱు హంతకులను బంపెను. వారు దూత కృత్యంబు నలుపవచ్చి పీలాజీతో ననేక ముచ్చటలాడి యొకనాఁడు సాయంకాలము పనువఱకునుండి సెలవు పుచ్చుకొనినట్లు పుచ్చుకొని, అందొకఁడేమియో మఱచి పోయినట్లు నటించుచు మరల వచ్చి, పీలాజీతో చెవిలో రహస్యము చెప్పులాగున దగ్గఱకు వచ్చి ఖడ్గముతో గుండెలపైఁ బొడిచెను. ఆ హంతకుఁడు తత్క్షణమే చంపఁబడెను. కాని తక్కిన

వారందఱను తప్పించుకొని పాఱిపోయెను. ఈహత్య తాపాతి జిల్లాలో ధాకూరు నొద్దజరిగెను.

పీలాజీ గాయక్వాడు యొక్క హత్యవలన ననుకొనిన లాభములేవియును కలుగలేదు. కోలీలును భిల్లులును దేశము నం దంతటను అభిసింగుపై తిరుగఁబాటు చేసిరి. పీలాజీ సోదరుఁడగు మహాదాజీ బరోడాను పట్టుకొనెను. పీలాజీ యొక్క జేష్ఠ పుత్రుఁడగు దమ్మాజీ సోనేగడ నుండి వచ్చి గుజరాతులో తూర్పు భాగమున నున్న జిల్లాల నాక్రమించుకొని జాద్పూరు వఱకును దండయాత్రల నెఱపెను. అభిసింగు దీనికి తాళఁజాలక దేశమును మఱియొకరి కప్పగించి తాను తన స్వదేశమగు జాద్పూరును రక్షించుకొనఁ బోయెను.

దయా బహద్దరునకు తరువాత, మాల్వాకు, అలహాబాదు గవర్నరగు మహమ్మదుఖాను బంగషు సుభేదారుగా నియమింపఁబడెను. ఇతఁడు రాజ్యము
1733 నకు వచ్చిన తోడనే బందలు ఖండులో ప్రవేశించి ఛత్రసాల రాజు
యొక్క రాజ్యములో రాజ్యమును స్థాపించుకొనెను. ఆ రాజపుత్ర రాజు బాజీరావును సాయమడిగెను. బాజీరావు వెంటనే ఖాను బంగషును ముట్టడించి తఱిమివేసెను. ఇందుకు కృతజ్ఞతా సూచకముగ నా రాజు బాజీరావునకు జాన్సీ దగ్గఱ నొక కోటయు కొంత దేశము నిచ్చి, తాను తరువాత కొద్దిరోజులలో చనిపోవునపుడు రాజ్యమునందు మూఁడవభాగమును తన తక్కిన యిద్దఱు కుమారులతో సమానముగ నతనికి పంచి యిచ్చెను.

మహమ్మదుఖాను బంగషు పిమ్మట, రాజా జయసింగు ఆగ్రామాల్వాల కధిపతిగ నియమింపఁబడెను. జయసింగు ఒక వైపున చక్రవర్తి యొక్క యుద్యోగస్థుఁడు కావున రాజపుత్ర ధర్మప్రకారము యదార్థముగ రాజభక్తుఁడుగ నడచుకొన వలసియుండెను. అతఁడు, వెనుక నతని తండ్రి మూలమున, బాజీరావుతో స్నేహితుఁడుగ నుండెను. కావున జయసింగు మొదట కొంత సందేహించెను కాని తరువాత మాల్వా రాజ్యమును మఱుసటి సంవత్సరము బాజీరావున కిచ్చివేసెను. చక్రవర్తికూడ సింగు యొక్క హితోపదేశంబుచే నందు కంగీకరించెను.

మాల్వా గుజరాతులలోనికి మహారాష్ట్రుల ప్రవేశమునుఁ గూర్చి ప్రకాశించి యుంటిమి. ఇఁక బేరారు కొంకణములలో వారిచర్యలను కొంచెము పరిశీలింతము. బేరారునందు విజృంభించిన కనోజీ భాంస్లే సేనాసాహేబు సుభే, యతని దాయాదుఁడగు బింబోజీ యొక్క కుమారుఁడుగు రఘోజీ భాంస్లేవలన పేదా కుట్ర కల్పింపఁబడి, రాజధిక్కారమునకు ఖైదునందుంచఁబడెను. ఈ రఘోజీ, కనోజీ భాంస్లే క్రిందను మఱియొక మహమ్మదీయ రాజకుమారుని క్రిందను కొద్ది యశ్వసైన్యముతో గోండ్వానా యందు సేవఁజేసియుండెను. రఘోజీ మృగయా విహారమునం దత్యంత సమర్థుఁడై సాహూ ననుసరించియుండి యతని దయను బాగుగ సంపాదించి తన దాయాదుని పదవినిఁ బొందెను. ఈభాంస్లేలు పూర్వము సాహూవంశము వారే యై యుండవచ్చును. రఘోజీ, బేరారున కధిపతియైన తోడనే, 5000 గుఱ్ఱపుదళమును రాష్ట్రము కొఱకు నిలువ యుంచుటకును, 10000 అశ్వ సైన్యము నవసరమైనపుడు సిద్ధము చేయుటకును, 9 లక్షలు పేష్కషు నిచ్చుటకును, ఘాసుదానా తప్ప తక్కిన యన్ని శిస్తులలోను సగమునకే లెక్క చెప్పుటకు, నొప్పుకొనుచు పత్రము వ్రాసియిచ్చెను. ఘాసుదానా, రాజారాము కాలమునుండియు, సేనాసాహేబు సుభే స్వంతమున కుంచుకొనుటకే యనుజ్ఞయియ్యఁబడెను. ప్రతినిధి శ్రీపతిరావు కొంకణమునకు రాజాచే బంపఁబడినపుడీ యేర్పాటు జరిగెను. అతఁడు కనోజీభాంస్లేకు స్నేహితుఁడై సందున తిరిగివచ్చిన పిమ్మట నతనిని చెఱనుండి విముక్తుని చేయఁ బ్రయత్నించెను గాని యట్లుచేయలేక పోయెను. కనోజీ మంచిసాహసముకల యోధుఁడు. గోండ్వానాయందు కొంతదేశము నతఁడు జయించి కటకము వఱకును విజృంభించి యుండెను. అతఁడు సతారాలో విడి ఖైదున చాల సంవత్సరములు బ్రతికి తరువాత చనిపోయెను.

నిజాములు ముల్కు ఈయంతః కలహములవలన నేమైన ప్రయత్నములుచేసెనేమో తెలియదు కాని చిమ్నాజీ మాత్రము సతారాయందు పీలాజీ జాధవు నుంచి, తాను 40 మైళ్లదూరమున శిబిరము నేర్పఱచికొని యుండెను.

బాజీరావు మాల్వాకరిగినపుడు, రాజాయొక్క మనస్సు కొంకణములోని

స్వల్ప వ్యవహారములతో నాక్రమింపఁబడియుండునట్లతఁ డుద్దేశించెను. ఆ గోవా బొంబాయిల మధ్యదేశము, అధికార విభాగములవలనను, కత్తులచేతను, దేశీయుల యొక్క కలహాకారితనమువలనను, కావలసినంత వ్యవహారమును మనోవిచారమునకు కల్పించియుండెను. సతారా కొల్లాపురములకు సంధికుదురక పూర్వము కనోజీ యాంగ్రియావలన బాధితులైన వాడీ సావంతులు చిరకాల మత్సరము నతని యెడల కలిగియుండిరి.

కనోజీ ఆంగ్రియా 1728-వ సం॥ మున స్వర్గస్థుఁడయ్యెను. అతఁడు జీవించియున్న కాలములో నతని సాధించుటకు విదేశీయు లెవ్వరికిని సాధ్యము కాలేదు. బొంబాయిలోని ఇంగ్లీషు ఈస్టిండియాకంపెనీవారు పోర్చుగీసువారితో కలిసి కొలాబాపైదండెత్తిరి. భూసైన్యము పోర్చుగీసువారు తీసికొనివచ్చిరి. ఇంగ్లీషు నావలు మూఁడు, కామొడోరు మాథ్యూసువలన నడుపఁబడెను. ఈప్రయత్నము పోర్చుగీసువారి పిఱికితనమువలన విఫలమైనదని ఇంగ్లీషువారు చెప్పుచున్నారు. ఈదండయాత్ర 1722-వ సం॥ములో జరిగినది. తరువాత మఱిరెండు సంవత్సరములకు డచ్చి వారు ఏడు యోడలతోడను రెండు బాంబు నావలతోడను విజయదుర్గముపై (గిరియా) దాడి వెడలిరి. అదికూడ విఫలమయ్యెను. ఆంగ్రియా అనేక ఇంగ్లీషు యోడలను పట్టుకొనెను. అతఁడింకొక సంవత్సరమునకు చనిపోవుననగా చాలవిలువగల సరకులు గల డెర్బీ యను కంపెనీ యోడను పట్టుకొనెను. అతని నావసైనికులు శౌర్యబలంబులఁ గలిగియుండిరి. తీరముననున్న అతని కోటలు దుస్సాధ్యములై యుండెను.

కనోజీ ఆంగ్రియాకు ఇద్దఱు స్వంతపుత్రులును, ముగ్గురు దాసీ పుత్రులును గలరు. ఇందు మొదటి వారిద్దఱిలో పెద్దవాఁడగు సుక్కాజీ కొలాబాయందుండెను. రెండవ వాఁడు సువర్ణదుర్గ నందుండెను. పెద్దవాఁడు తరువాత కొద్దికాలములో చనిపోయెను. రెండవవాఁడగు శంభాజీ, దాసీ సోదరులలో పెద్దవానిని తనతో నుంచుకొని తక్కిన యిద్దఱను కొలాబాయందుంచెను. ఈ యిద్దఱిలో పెద్దవాఁడగు యశాజీ యంతరంగ వ్యవహారమును జూచుచుండెను. రెండవవాఁడగు సన్నాజీ నావసైన్యమును జూచుచుండెను. తరువాత నితఁడు

తన కుటుంబముతో పోరాడి పోర్చుగీసు వారి సాహాయ్యమున కొలాబాను పట్టుకొని యన్నగారి కండ్లు పొడిచివేసి విరోధులగు వారినందఱిని క్రూరముగఁ జంపివేసెను. ఇందుకు శంభాజీ యతని దండింప బయలు వెడలివచ్చెను. కాని మన్నాజీ, బాజీరావు సహాయమునుఁ బడసి, యన్నను ముట్టడి వదలిపోవునట్లు చేసెను.

ఈకాలములో జంజీరా కధిపతియైన సిద్దీ, యాకూటుఖాను అను తన పూర్వబిరుదముతో, ననేక సంవత్సరములనుండి యాస్థానమందుండెను. ఔరంగజేబుచే నితని క్రింద నుంచఁబడిన, మాహాదు, రాయగడ, దాభల్, అన్‌జిన్‌వీడు జిల్లాలు సురక్షితముగ నతనిచేఁ గాపాడఁ బడుచుండెను. మహారాష్ట్రు లతనిదేశమునఁ బ్రవేశించుటవలన నలిగి, దఱచుగ వారియొద్దనుండి కప్పములు వసూలుచేయుచుండెను. ఈసిద్దీని నాశనము చేయుటకు ప్రతినిధి కొన్ని యెత్తులువేసెను. ఆకాలమున యాఖూతుఖాను అను నతఁడు, షేకుజీ యను ప్రసిద్ధ నామముతో తీరమున సాహసాంకుఁడగు నోడదొంగ యొకడుండెను. ఇతఁడు కొంకణమందు కోలీరాజుల వంశమువాఁడు. గోవాగడ యొక్క పటేలు కులమున జన్మించి చిన్నతనమున మహమ్మదీయులచే పట్టువడి మహమ్మదీయుడుగ పెఱిగెను. ప్రతినిధి యితనికి గొప్పవాగ్దానములుచేసి కుట్రచేయించెను. కాని యీకుట్ర యెందువలననో విఫలమైయుద్ధమే జరిగెను. చివఱకు ప్రతినిధియే పరాభవము పొందుటకు సిద్ధమయ్యెను. చిమ్మాజీ అప్పా అతని సాయమునకు సేనను పంపించుటకశ్రద్ధచేసెను. సాహూ చివఱకు 'నీవుపోని యెడల నేనేస్వయముగ పోయెదనని' నిష్ఠురోక్తు లాడెను. జాగీరు దారులు, జయింపఁబడు దేశము తమకు జాగీరుగా నిచ్చిననే తప్ప, యెవ్వరును పోమనిచెప్పిరి. పీలాజీ జాధవుఁడు మాత్రము కడపట కరిగెను. ప్రతినిధి అవమానమును పొందినవాఁడై తిరిగి పోవలసిన వాఁడాయెను. ఈసమయములో సిద్దీ చాలమంది కొడుకులను వారసులుగా విడిచి కాలధర్మమునొందెను. అతని పెద్ద కుమారుఁడగు సిద్దీ అబ్దుల్లా చంపఁబడి తరువాత వారసగు సిద్దీ రహిమాను జంజీరాయందు కేవందున నతనికి లేకుండ రాజ్యమింకొకరిచే నాక్రమించుకొనఁబడెను.

యాకూబుఖాను, సిద్దీరహీమాను పక్ష మవలంబించి, సాహూను సాహాయ్య మడిగెను. కాని బాజీరావు మాల్వానుండి వచ్చువరకు నేమియుచేయ వీలులేక పోయెను. బాజీరావు, మాల్వాయందు సింధియా హోల్కారులను గొప్పసైన్యములతో నుంచి, తత్క్షణమే దండారాజపూరున కరిగెదనని రాజుకు తెలియఁ జేసెను. రాయగడ కోట ఖిల్లేదారునిచే నిచ్చివేయఁబడెను. రాజారాము కాలములో శత్రువుల యాధీనమైన శివాజీ రాజధాని మరల నేఁడు మహారాష్ట్రుల వశమాయెను. మహారాష్ట్రులు తాళగోసల కోటల పట్టుకొని తరువాత దండా రాజపూరు నాక్రమించుకొనిరి. జింజీరాద్వీపమును సాధించుట యసాధ్యమని వెనుకటి యనుభవము వలన బాజీరా వెఱింగియుండెను. కావున జింజీరావాసులు సిద్దీరహీమానును అధిపతిగ నొప్పుకొని, పదునొకండు మహాలుల రివిన్యూలో సగము నిచ్చి పట్టుకొనఁబడిన కోటలను వదలుకొందుమని సమాధానమునకు రాగా యతఁడితర కార్యము లనేకములు ముఖ్యమైనవి యున్నందున, నందుకు సమ్మతించెను.

బాజీరావు దక్కనుకు వచ్చినతరువాత, మాల్వానుండి మల్హారిరావు హోల్కారు ఆగ్రావఱకు దండయాత్రల నెఱపెను. మహమ్మదుషాయొక్క వజీరు ఖానుదురాను ఖడ్గములోఁగాక కలములో వారి నదలింపఁజూచెను. నిజాములు ముల్కును అనుగకుండ తమకు సహాయ్యముచేయునట్లు చేయ, నతఁడు ప్రయత్నములు చేసెను కాని యది సాగకపోయెను. అతఁడు తన సోదరుఁడగు ముజఫర్ ఖానును, శత్రువులను తఱిమివేయఁ బంపెను. హోల్కారు తన సైన్యములో స్వల్పభాగమును ముందుగఁబంపి వారి ప్రయాణమును సాగకుండ బాధపెట్టుచు, రాత్రివేళల శిబిరముపై అవాయిలను వేయుచు కష్టపెట్టుటకుఁ బంపి తాను మాత్రము పన్నులను నిరాటంకముగ వసూలుచేయుచుండెను. మాల్వాలోను చంబలు నదికి దక్షిణమున నున్న దేశములోను కొన్నికోటలు చక్రవర్తి యుద్యోగస్థుల చేతులలో నున్నను చాలభాగము మహారాష్ట్రుల చేతను రోహిలాల చేతను ఆక్రమించుకొనఁబడెను.

బాజీరావు, శత్రువులనెల్ల నిర్జించుటకును, జయములను చేకొనుటకును గొప్ప సైన్యమునుంచి నందువలన నప్పులపాలాయెను. భటులకు జీతములు వెను
1736 కఁబడెను. సాహుకారు లీవలెనే అనేక లక్షలకొలది పెట్టుబడి పెట్టి యిక నిచ్చుటకు నిరాకరించిరి. శిబిరములో కుట్రలును అసంతృప్తియు నెక్కువగుటవలన నతని మనస్సునకు విస్తారము వ్యాకులము కలుగఁ జొచ్చెను. అతఁడు మాల్వాయందు ఫౌజుసర్దేశముఖీలను వసూలుఁజేయుచు చక్రవర్తియొక్క సనదున్నకు జయసింగు ద్వారా యడిగెను. అదియే విధముగ గుజరాతునకు కూడ నతఁడడిగెను. తురానీ మొగలు లీయవమానపు సమాధానమున కంగీకరింపక పోయిరి. జయసింగు సలహాచే నెటులైన చక్రవర్తియు వజీరును మనసు సమాధానముచేసికొనిరి. కాని రాయభారములలో నిరుపక్షముల వారును తమ మొదటి యుద్దేశముల నతిక్రమించి పోవుటవలన సంధి పొసగక మహమ్మదుషాకును నిజామునకును సఖ్యము కుదురుట కవకాశము దగ్గఱయ్యెను. చివఱకు బాజీరావు మాల్వానంతయు జాగీరుగాకోరెను. రోహిలా లున్నదేశము నిచ్చివేయు మనెను. మాండూ, ధార్, రాయిసీనుకోటలు, చంబలు నదికి దక్షిణమున నున్నదేశభాగముయొక్క జాగీరు,ఫౌజుదరీ,చక్రవర్తి ధనాగారము నుండి 50 లక్షల రూపాయిలుకాని లేక బెంగాలులో దానికి సమానమైన దేశముగాని, అలహాబాదు బనారసు గయా మధురా జాగీరులు, దక్కనులో ఆఱు సుభేలుకును సర్దేశపాండ్య, ఇవి యన్నియును అతఁడు కోరెను.

చక్రవర్తి, యన్నికోరికలను దాటవేసి, యొక్క సర్దేశపాండ్యా మాత్రమిచ్చుటకు ఒప్పుకొనెను. బాజీరావు అందుకుగాను ఆఱులక్షలు నజరానా నిచ్చుట కంగీకరించెను. ఈ సర్దేశపాండ్యా, సర్దేశముఖీ వంటిదే. సర్దేశముఖీ నూటికి పది చొప్పునను, సర్దేశపాండ్యాగిరి నూటికి అయిదు చొప్పునను అయియుండెను. ఈ హక్కునిచ్చుట నిజాముల ముల్కు యొక్క అసూయను పురికొల్పుట కొఱకే యైయున్నది. మొగలు కక్షి వారియొక్క ప్రోత్సాహముచేతను, సామ్రాజ్యమును వచ్చి రక్షింపవలసినదని మహమ్మదుషాయొక్క ఆహ్వానములచేతను, నిజాముల ముల్కు తన దోపిడి స్నేహితుల పద్ధతో

యుటకు మనసునందు సంకల్పముచేసికొనెను. బాజీరావుయొక్క కోరిక లెక్కవారెను. మొగలులు యుద్ధము తప్పదని యెంచుకొని కేవలము తమబలములయొక్క యార్భాటములవలన మహారాష్ట్రులను బెదరఁ గొట్టవలెనని యెంచి నట్లు కనఁబడుచున్నది. ఢిల్లీ పట్టణముయొక్క మైదానము లన్నియు గుడారములతో కప్పఁబడెను. ఖాను దురానును, కుమరుద్దీను ఖానుడును గొప్ప సైన్యములతో మథుర వైపునకు వచ్చుచున్నారని విని 'పీష్వా తన సామగ్రి నెల్ల బందలఖండు రాజగు జగతురాజునొద్ద నుంచి తాను ఆగ్రాకు దక్షిణమున 40 మైళ్లదూరమున యమునా తీరమునకు వచ్చెను. మల్హారిరావు హోల్కారు దూయాబునందు దండయాత్రలు చేయుచుండ సాదతుఖాను అయోధ్యనుండి వచ్చి వారిని తఱిమివేసెను. ఇంత మాత్రమునకు సాదతుఖాను ప్రగల్భవచనంబులతో తన కార్యము నద్భుతముగ కొనియాడుకొనుచు చక్రవర్తికి యుత్తరములు వ్రాసికొనెను. సాదతుఖాను మహావీరుఁడని ఢిల్లీయందుస్తోత్రపాఠము లెగసెను. బాజీరా విది వినినవాఁడై 'నే నింకను హిందూస్థానమున నున్నానని జ్వాలాతోరణంబులతో. చక్రవర్తికి నిర్ధారణచేసెద' నని చెప్పెను. ఖాను దురాను సాదతుఖానును కలియుటకు పూర్వము అఱుదినములక్రింద, వారు కలియుదురని బాజీరావు ఢిల్లీకి ప్రయాణమై మేవాటు నగములదగ్గఱనున్న బాట మీఁదుగ పోయి దినమునకు 40 మైళ్ల చొప్పున నరిగిరాజధాని శివారులదగ్గఱ శిబిరము చేసెను. ఆ పట్టణమును కొల్లబెట్టుటగాని తగులఁ బెట్టుటగాని యతఁడేమియు చేయలేదు. కొల్లధనము వలన నతని నడక కిబ్బంది యగుననియు, తగులబెట్టినయెడల తన కనుకూలముగఁ గాబోవు రాయభారములు చెడిపోవుననియు నతఁడు తలంచెను. మఱునాటి దినమున నతఁడు రెండు ఉత్తరములు వ్రాయించెను. ఒకటి చక్రవర్తికిని, రెండవది, రాజాభక్త మల్లునకును పంపెను. ఆ యుత్తరముల తాత్పర్య మేమోగాని చక్రవర్తి వకీలును పంపమని యడిగెను. బాజీరావు రక్షకసైన్యములేనిదే వకీలును పంపుట కంగీకరింపలేదు. అయిన నతఁడు మర్యాదగ కబురు పంపెను. 'నా సైన్యము దగ్గఱ నుండుటవలన పట్టణమునకు హాని కలుగునేమో-

యని తలంచుచున్నందున నేను జీలు సరోవరము దగ్గఱకు వెనుకకు తగ్గద'నని అతఁడు చెప్పిపంపెను. ఇందువలన పట్టణములో 8000 జనులు ధైర్యవంతులై ముజఫర్ ఖాను క్రిందను న్యూసింగు క్రిందను మహారాష్ట్రులను గొట్టఁ బ్రయత్నించిరి. కాని మల్హారరావు హోల్కారును, రాణోజీసింధియాయు వారి నందఱిని తఱిమకొట్టి 2000 గుఱ్ఱములను ఒకయేనుఁగను పట్టుకొనిరి. రాజా న్యూసింగు రణ నిహతుఁడయ్యెను. మహారాష్ట్రులు బహు కొద్దిమంది హతులైరి. బాజీరావు తన సైన్యములను విశ్రమింపఁ జేయుచుండగ కమరుద్దీను ఖాను వచ్చి దాకెను. అతనితో స్వల్పయుద్ధము నతఁడు చేసెను. ఇంతలో ఖాను దురానును సాదతుఖానును కమరుద్దీను ఖానుతో కలసికొని నందున. వెంటనే తెల్లవారు సరికి బాజీరావు పశ్చిమమునకు ఎనిమిది మైళ్లు వెనుకకు తగ్గిపోయెను. అటు తరువాత బాజీరావు గ్వాలియరునకు పోయెను. యమునానదిని దాటి వర్షకాలము రాక ముందు దూయాబును కొల్లపెట్ట వలయునని యతని యుద్దేశము. కాని మాల్వాయందు తన గివిన్యాను వసూలు చేసికొనక ముందు నిజాములు ముల్కు అడ్డు వచ్చునేమో యని యతఁడాలోచించి, తమ్ముఁడు చిమ్నాజీని నిజాముయొక్క ప్రయత్నములను కనిపెట్టుచుండ వలయునని యాజ్ఞ యిచ్చెను. పీష్వా తన ఉత్తరములో 'అతఁడు రీవా (నర్మదా) నదిని దాటఁ బ్రయత్నించినయెడల తత్క్షణమే వెనుకకుఁబోయి, వెనుక కాళ్లకు బంధము వేయుము' అని వ్రాసెను. బాజీరా వింతలో దక్కనుకు పోవలసిన యావసరము కలిగినందున, మాల్వారాజ్యమునకు 14 లక్షల రూపాయి లిచ్చు వాగ్దానముమీఁద, మఱల తన వకీలును ఖానుదురాను దగ్గఱకు పంపి తాను సతారాకు తిరిగివచ్చెను.

పోర్చుగీసువారు, కొలాబాను పట్టుకొనుటలో కొంత సాహాయ్యము చేసినందుకు, వాగ్దానము చేయఁబడిన కొన్ని కోట లియ్యఁబడనందున, నిప్పుడు
1737 శంభాజీ ఆంగ్రియా పక్షముచేరి మన్నాజీపై కొలాబాను ముట్టడిం
చిరి. పీష్వాయిందుకు నియుక్తుండై వారిని తఱిమివేసి మన్నాజీని తన రక్షణక్రిందికిఁ దీసికొని సంవత్సరమునకు 7000 రూపాయలిచ్చునట్లును,

రాజాకు యూరపు చీనా దేశములనుండి 3000 రూపాయిల విలువఁగల యంత్ర రూపమైన వస్తువులను తెచ్చి యిచ్చునట్లును ఏర్పాటుచేసెను. తరువాత పోర్చుగీసు వారి స్థానములగు బేసీను వగ్గఱనున్న నొకకోటయు, ఠాణాయు మహారాష్ట్రులచే పట్టుకొనఁబడెను. పీష్వా ఈ స్థలములను వశము నం దుంచుకొనుటకును పోర్చుగీసువారి నింకను సాధించుటకును కొందఱు అరబ్బులను తన వాపసైన్యము నందుంచెను. మావలీల హేత్కారీల కాల్బలమును మఱియు నతఁడు వృద్ధిచేసెను. ఇంతలో డిల్లీ వర్తమానములవలన కొంకణమునుండి అతఁడు వెడల వలసినవాఁడాయెను.

ఇంతలో, చక్రవర్తి నిజాముల్ముల్కును దర్బారునకు రావించి యతని పెద్దకుమారుఁడగు గాజియుద్దీనుకు గుజరాతు మాల్వాలనిచ్చి, యనేక విధముల స్తోత్రములుచేసి, మహారాష్ట్రులను తఱిమివేయువలయునని ప్రార్థించెను. అతనికి సర్వాధికారమియ్యఁబడెను. సామంత రాజులెల్ల నతని జెండా క్రింద చేరు కొనఁగ 34000 సైన్యము రణరంగమున నిలచెను. ఆకాలమున ప్రశస్తమగు ఫిరంగిదళము ప్రయుక్తమయ్యె. నిజాము జాగ్రత్తగ నానావ క్రియల సలుపుచు, దూయాబును దాటి, యమునానదిని దక్షిణ పార్శ్వమున నుంచుకొని కాల్పినదిని దాటి, బందలఖండు రాజాలను తనతో కలియుటకు ప్రోత్సాహముచేసి, మాల్వాకు బయలుదేరెను.

బాజీరావు, కూర్చుకొనఁగలిగి నన్ని సేనలను ప్రోగుచేసికొనఁగా నర్మదానదిని సమాపించు నప్పటికి 80,000 సైన్యమున కధిపతి యయ్యెను. జస్వంతరావు దాభరేగాని మఱిసేనాపతి యుద్యోగస్థు లెవ్వరుఁగాని యతనిఁ జేరలేదు. రఘూజీ భాంస్లే బేరారుమీఁదకు దండయాత్ర జరుగునను మిష మీఁదఁ జేరకుండ తప్పించుకొనెను.

బాజీరావు నర్మదను దాటునప్పటికి నిజాముల్ముల్కు శిరంజీ చేరెను. జనేవరి నెలలో రెండుసైన్యములును భూపాలు దగ్గఱ తారసిల్లెను. నిజాము,
1738 శత్రువుపై తత్క్షణము విజృంభించుటకు మాఱుగ, భూపాలుకోట దగ్గఱగ వెనుక నొక సరోవరమును, ముందొక నదీప్రవాహమునుఁ

బెట్టుకొని దృఢమైన స్థానము నాక్రమించుకొనెను. ఈ యతి జాగ్రత్తయే యుద్ధఫలితమును నిశ్చయపఱచెను. మహారాష్ట్రులు కొంచెము భయము పడుచు దగ్గఱకు వచ్చి బలవంతులమని తెలిసికొనినతోడనే నిశ్చయముగ బలవంతులే యైరి. వారు నిజామును అతని శ్రేణులలోనే తిరస్కరించిరి. ఒక్క బూందిరాజు తప్ప తక్కిన రాజపుత్రు లెల్లరును నిజాము పక్షముచేరిరి. రాజపుత్రు లపరిమిత శౌర్యముతో పోరాడిరి. వారిలో 500 భటులును 700 గుఱ్ఱములును రణమున నష్టమైయుండెను. మహారాష్ట్రులందు నూఱుమంది మడిసిరి. 300 మంది గాయపడిరి. రానోజీ సింధియా,పీలాజీ జాధవు, శాయాజీగుజరు, వీరు మహారాష్ట్ర భటులను నడిపిరి. పీష్వా నిజామునకు రెండు అవాయిల దూరమునుండి యతఁడెప్పుడు దృఢమైన స్థానమును వదలునా, కొట్టివేయుదుమా యనివేచియుండెను. కాని యది మాత్రము వీలుపడలేదు. నిజాము తన సైన్యమునంతను దగ్గఱకుఁ జేర్చుకొని చుట్టుముట్టడింప నిచ్చెను. భోజన సామగ్రులును, జంతువులకు మేఁతయు స్వల్పమయ్యెను. వానిని తీసికొని వచ్చు సైన్యభాగ మొకదానిని మల్హారరావు హోల్కరును, జస్వంతరావు పవారును అడ్డముకొట్టి 1500 మంది జనులవఱకు ఖండించివేసిరి. మహారాష్ట్రులు రేయింబవలు నిజాము సైన్యమునకు నిద్రాహారములులేకుండఁ జేసిరి. ఈ బాధల కోర్వఁజాలక, సంతత పరిశ్రమకోడి, రాజపుత్ర భటులు శత్రు పక్షమునకుఁ బోవ సమకట్టిరి. కాని బాజీరావు అట్టి రాయభారముల నంగీకరింపలేదు. హిందూదేశము నందెల్ల తన సైన్య ముత్తమంబైనదని ఊహింప సమయ మొదవె నని యతఁడాలోచించెను. చుట్టు నవరోధము చక్కఁగ నున్నంతకాలము జను లెక్కువయైన కొలఁదిని వారి కష్టము లెక్కువయే యని యతఁడెఱింగి యుండెను. నిజాములు ముల్క ఇట్లు తన వశమున కేల చిక్కెనో యతఁడూహింపలేకపోయెను. పీష్వా తన సోదరునకు వ్రాసిన యుత్తరములో 'నబాబు వృద్ధుఁడును అనుభవశాలియునై యిట్టి యిక్కట్టున నేల చిక్కుకొనెనో నే నూహింపఁ జాలకున్నాను. ఢిల్లిలో యతనిఁగూర్చిన సదభిప్రాయ మింతటితో నాశనమగును.' అని వ్రాసెను.

దక్కను నందును హిందూస్థానమందును అతని రక్షింపఁ బ్రయత్నములు చేయఁబడుచుండెను. ఖానుదురాను తన వైరి యొక్క యాపదనుఁ జూచి మనసున సంతోషమందుచునే యుండెను. నిజాముల్ముల్కు స్వయముగ వచ్చునంత వఱకు ముందుకు పోవలదని, చక్రవర్తి ఖానుదురానుకాజ్ఞ యిచ్చెను. కావున బాజీరావు, ఉత్తరము నుండి సాహాయ్యము వచ్చునని, భయము లేక యుండెను. కాని దక్షిణమున హైదరాబాదునందును, ఔరంగబాదు నందును రెండవ కుమారుఁడగు నాజరుజంగుచే సైన్యములు కూర్పఁబడుచుండెను. బాజీరావు వారు రాకుండ నడ్డగించుటకు బహుకష్టపడుచుండెను. రఘోజీ భోంస్లే నతఁడు నయమునను భయమునను ప్రార్థనల వలనను హెచ్చరించినప్పటికిని వ్యర్థమాయెను. అప్పుడు సూరతు దగ్గఱ సోనేగడలో నున్న సేనాపతిని బలవంత పెట్టి పంపవలసినదని రాజాను ప్రార్థించెను. సాహూ తన స్వదస్తూరితో నాజ్ఞఁ బంపెను. చిమ్మాజీ అప్పా తపతీదగ్గఱఁ గాచి యుండెను. నిజామునకు సాహాయ్య సైన్యము ఔరంగబాదునందు కూడుకొనెను. పీష్వా తనతమ్ముని సాధ్యమైన ప్రతివానిని సైన్యమునందు కూర్చుకొనవలసినదని గట్టిగా వ్రాసెను. "దక్షిణమునుండి ఫత్తేసింగు భోంస్లేను, శంభూసింగు జాధవును, సర్‌లష్కరును తీసికొని రావలసినది. దాభరేయు గాయక్వాఁడుయు, భాండేయును నన్ను కలిసికొనుటకు రారేని, వారిని నీతోఁగూడ తపతీదగ్గఱ నుండనిమ్ము. ప్రతి మహారాష్ట్రుని రానిమ్ము. ఒక్క పెద్ద ప్రయత్నముతో మనము దక్కను కధిపతుల మగుదుము' అని అతఁడు వ్రాసెను.

నిజాము సాగి పోవుటకు ప్రయత్నము చేసెను. కాని సామానుల భారముల వలన నతఁడు మరల వలసివచ్చెను. ఆతని సైన్యములు వెనుకకు తగ్గుట వలన భూపాలు యొక్క కోటలోనికి తఱుమఁబడెను. బాజీరావు, ఫిరంగిదళము లేని హేతువు చేత, గోడలను బ్రద్దలఁ గొట్టలేక పోయెను. కాని అవాయిల వలనను, శతఘ్నులవలనను మొగలులను చాల బాధపెట్టెను. నిజాముల్ముల్కు తప్పించుకొనుటకు కడపటి ప్రయత్నమును చేయ నెంచెను. అతఁడు సామానుల నన్నిటిని భూపాలగడయందుంచి ఫిరంగి దళము యొక్క రక్షణ

క్రింద వెనుకకు తగ్గుటకు నిశ్చయించుకొనెను. మహారాష్ట్రులు ఫిరంగులపై విజృంభించిరిగాని వానిని పట్టుకొన లేక పోయిరి. మొగలులు దినమునకు మూడు మైళ్లకంటె ఎక్కువ సాగి పోలేకపోయిరి. అట్లు నిజాము దుఃఖితుఁడై 24వ దినమున శిరంజీ దగ్గఱనున్న దురాయిసురాయి యొద్ద ఫిబ్రేవరి 11వ తారీఖున సంధికి వేడుకొనెను. మాల్వాయంతయు బాజీరావునకిచ్చునట్లును, నర్మదా చంబలు మధ్య రాష్ట్రమంతకును సంపూర్ణ ప్రభుత్వమిచ్చునట్లును, చక్రవర్తిచే నది స్థిరపఱిపించునట్లును, పీష్వాయొక్క ఖర్చులకుఁగాను 50 లక్షల రూపాయి లిప్పించునట్లును, అతఁడు స్వదస్తూరితో వ్రాసి యిచ్చెను. 'నబాబు నుండియేమైన సంపాదింప వలెనని నేను చాల ప్రయత్నము చేసితిని. కాని యిది నేనెప్పుడును తలపలేదు. అతనికి నేనుసాహాయ్యము చేయుట కొప్పుకొనినపుడు ధనమిచ్చుట కతఁడు చూపిన అయిష్టము నాకు జ్ఞాపకము వచ్చెను.' అని బాజీరావు వ్రాసియుండెను.

పీష్వా చంబలు నదికి దక్షిణమున కప్పములు వసూలు చేయుచు ఢిల్లీ దర్బారుతో రాయభారములు సలుపుచు నుండెను. అప్పుడు వాదరుషా కాంధహారును ముట్టడించి యున్నాఁడనియు ఢిల్లీకి రాఁగలఁడనియు ఢిల్లీయందు చెప్పుకొనుచుండిరి. ఈదండయాత్ర భయము వలననే నిజాము మహారాష్ట్రులతో గెలువ లేక పోయెనని మహమ్మదీయులు చెప్పుదురు కాని దర్బారునందు కించిత్తు భయమును అప్పటికి కలిగి యుండలేదు. ఢిల్లీవాసులు, నిర్వీర్యులును స్వార్థపరులు నగు జనులందఱి వలెనే, దూరమున నున్న యాపదకెంత నిర్లక్ష్యముగ నుండిరో, దగ్గఱకు వచ్చిన పిమ్మట నంత భయభ్రాంతులును, నిస్సహాయులునై యుండిరి.

ఈ మధ్యకాలములో, కొంకణమందు పోర్చుగీసువారిపై యుద్ధము
1739 జరుపఁబడుచుండెను. ఆ కాలమున బొంబాయి యింకను ప్రసిద్ధి లేక
యుండెను. పోర్చుగీసువారి యొక్క సాలసెట్టి బేసీను ద్వీపములు
బహుదృఢమైన దుర్గములుగ నెంచఁబడుచుండెను, బొంబాయియు సాలసెట్టి
యు పోర్చుగీసు రాజాచే నింగ్లీషురాజగు రెండవ చార్లెసునకు అరణముగా

నియ్యఁబడెను. కాని పోర్చుగీసు వారు బొంబాయి నిచ్చిరిగాని సాలసెట్టి నిచ్చుటకు నిరాకరించిరి. ఈ కారణమునను, మఱి పోర్చుగీసువారి వర్తక వ్యాపారము సెడల నింగ్లీషు వారి కున్న యప్పటి యసూయ వలనను, వారు మహారాష్ట్రులకు మందుగుండు సామానులను సప్లై చేయుటవలన సహాయము చేసిరి. మహారాష్ట్రులు చిమ్నాజీ యప్పా, రానోజీ భాంస్లే మొదలైన వారి క్రింద నాలుగు మందుగనులను నిర్మించి సాలసెట్టి దుర్గము యొక్క గోడలను పగులఁ గొట్టి లోపలకుఁ బ్రవేశించి ఘోరమగు దొమ్మియుద్ధమ్మునఁ దాకిరి. రానోజీ భాంస్లే మఱియొక ప్రక్క గోడను రంధ్రములేని చోట అగడ్తను దాటి లగ్గల కెక్కి కరవాలంబుతో లోనికిఁ బ్రవేశించెను. కొంతవడికి పోర్చుగీసు వారోడ పోయిరి. కోట వశమాయెను.

ఈ యుద్ధ మిట్లు జరుగుచుండ రానోజీ భాంస్లే యొక్క యన్న కుమారుఁడును సేనాసాహేబు సుభేయునైన రఘోజీభాంస్లే తూర్పున తనదేశమును విస్తరింపఁజేయుచుండెను. అతఁడు కటకమునుకొల్లఁబెట్టెను నిజాము భూపాలు నొద్ద చుట్టుముట్టడింపఁబడినపుడు, రఘోజీ ఉత్తరమునకు అలహాబాదు వఱకును దండయాత్రల సెలపెను. అచ్చట సుభేదారు షుజాఖానును యుద్ధమున నోడించి చంపి చాల కొల్లధనమును నాగపూరునకు తీసికొని వచ్చెను తగిన యాజ్ఞ పొందకుండ, నిజాములు ముల్కుతోడి యుద్ధమున సాహాయము చేయకుండ నశ్రద్ధచేసి, తన యిష్టము వచ్చినటుల దండయాత్రలఁ జేసినందు కితనిపై బాజీరా వలిగి యితని శిక్షింప అవుజీకారేనుపంపెను. కాని యాదురదృష్టయుద్యోగి రఘోజీ వలన నోడింపఁబడెను.

బాజీరావు దీనికి మఱింత క్రోధావేశుఁడై యతని కఠినముగ శిక్షింపఁ దలంచెను, కాని యింతలో నాదరుషా ఢిల్లీ వచ్చినాఁడనియు, మొగలుల నోడించి, ఖానుదురానును యుద్ధమునందు హతముచేసి, సాదతుఖానును చక్రవర్తిని ఖైదుచేసి, ఢిల్లీని కొల్లఁబెట్టి, పట్టణవాసులను నరుమాడిన వర్తమానములసెల్ల నొకటి తరువాత నొకటిగ నతనికి వినవచ్చి యాతురతనొందెను. బాజీరావిప్పు డిట్లు చెప్పెను. 'రఘోజీభాంస్లేతో మనయంతఃకలహములు [illegible]

క్షుద్రమైనవి. పోర్చుగీసువారితో మనయుద్ధ మొక లెక్కలోనిదికాదు. హిం
దూస్థానమందు మనకిప్పు డొక్కఁడే శత్రువున్నాఁడు.' అతఁడు బహుశః,
నాదరుషా చక్రవర్తియై స్థిరముగ నచ్చటుండునని, యనుకొనియుండవచ్చును.
నూఱువేలమంది పరిషియనులు దక్కనుకు బయలువెడలిరని యతఁడు వదం
తులను వినినపు డేమాత్రమును వ్యాకులపడలేదు. అతఁడప్పు డిట్లుచెప్పెను.
"హిందువులు, మునల్మానులు, దక్కను యొక్కబలము లన్నియు కూడవలెను.
నేను మహారాష్ట్రులను నర్మదనుండి చంబలవఱకును విస్తరింపఁజేసెదను."
అతఁడు నాజరుజంగును తమ సామాన్యశత్రువుపై యుద్ధసన్నద్ధుఁడు కమ్మని
చెప్పెను. కొంకణయుద్ధమునుండి మరలవలసినదని చిమ్నాజీ అప్పాకుత్తరు
విచ్చెను.

ఈ యుత్తరువు వెడలునప్పటికి చిమ్నాజీకి సాలసెట్టి స్వాధీనమాయెను.
బేసీను నతడు ముట్టడించెను. సముద్రమువైపునుండి మన్నాజీ ఆంగ్రియా
ముట్టడికాసెను. ముందుగనులవలన కోటగోడలు బ్రద్దలు కొట్టఁబడెను కావలి
సైన్యము తీక్షణముగ పోరాడెను కాని చివరకు ముట్టడికి తాళలేక కోటను
వశము చేసి వెడలిపోయిరి.

బేసీను స్వాధీనమైనవెంటనే సింధియాహోల్కారులు బాజీరావునకలి
సికొనుటకు తక్షణము పంపఁబడిరి. కాని యప్పటికి పరిషియనులు 1739వ సం
మే 5 వ తారీఖున డిల్లీని విడిచిపెట్టిపోయిరని వర్తమానము వచ్చెను. నాద
రుషా, యవమానితుఁడగు చక్రవర్తికి మయూరసింహాసనమునకు బదులు మఱి
యొక సామాన్యపు సింహాసనమిచ్చి యందుకూర్చుండుమని యానతిచ్చి, ఇండి
యాలోని రాజుల కెల్లరకు తద్విషయమును దెలియపఱచి తాను పరిషియా
కరిగెను. సాహూ కొకయుత్తరమును, బాజీరావున కొకయుత్తరమును వ్రా
యఁబడెను. ఈరెండవదానియందు 'నేను మహమ్మదుషాను మరల సింహాస
నాధిష్ఠితుని చేసితిని. అతని నిప్పుడు సోదరునిగా భావించెదను. నీవు బహుసేనా
సమన్వితుఁడవైన పూర్వసేవకుఁడవైనను, చక్రవర్తికి సాయము చేసియుండ
లేదు. కాని యిప్పుడందఱును చక్రవర్తియాజ్ఞలను శిరసావహించవలెను. లేని

యెడల నేను సైన్యసమేతుఁడనై మరల వచ్చి యవిధేయులను శిక్షించెదను' అని వ్రాసియుండెను.

నాదరుషా డిల్లీనుండి వెడలిపోయిన కొన్ని దినములకు బాజీరావు చక్ర
1739 వర్తికి తన వినయవిధేయతలఁ దెల్పుచు నుత్తరము వ్రాసి 100 మొహి రీలను నజరానాను బంపెను. చక్రవర్తియు సముచితంబుగఁ దన యంగీకారమును దెలియ బఱచుచు, నొక గొప్ప *ఖిల్లతును బహుమానముగాఁ బంపెను. చక్రవర్తి, యతని పదవిని, జాగీరులను, ప్రాంతములను, వతనులను స్థిరపఱచుచు, సామ్రాజ్యప్రభుత్వము నెడల భక్తితో నున్నందువలన నతఁడభివృద్ధిపొందఁగలఁడని యాశీర్వదించుచు నతనికి తెలియఁబఱచెను.

మాల్వాకు క్రొత్తసుభేదారుఁడుగాని డిప్యూటీగాని నిజాములుముల్కుచే నియమింపఁబడక పోయినను, ఆ గవర్నమెంటు బాజీరావునకు స్థిరపఱచినటుల సనదు పంపఁబడి యుండలేదు. దీనిని బాజీరావు నిజాములుముల్కుయొక్క వాగ్దానభంగముగ నెంచియుండెను. కాని నిజాములుముల్కు సైన్యమింకను హిందూస్థాన మందుండుట వలనను, బాజీరావుయొక్క యుత్తమ యోధులును, ఉత్తమసైన్యమును కొంకనునుండి యింకను మార్గమధ్యమం దుండుట వలనను తనహక్కులను, బలవంతపెట్టుటకు బాజీరావు సమయము నెదురు చూచుచుండెను. ఇంతలో మాల్వాయందు తన వ్యవహారమును చక్కఁజేసికొనుచు, పశ్చిమ దేశభాగమున చంబలు తీరమున కోటానుండి అలహాబాదు వఱకు నున్న రాజపుత్రరాజులతో, ముఖ్యముగఁ దనస్నేహితుఁడగు చిత్తూరుసాలు రాజకుమారులును బందలుఖందురాజులును అగు జగదేవురావులోడను, అతని

---

* శిర్పాయనగా శిరమునుండి పాదమువరకును ధరింపఁదగిన దుస్తులన్నియునని యర్థము. ఖిల్లతు అనఁగా అట్టిదుస్తులతో పాటు భూషణములు, గుఱ్ఱము, ఏనుఁగ, ఆయుధములు మొదలైన ఆయాజనుల హోదాకు తగిన యావత్తు సామానుఅని అర్థము. ఈపర్యాయము బాజీరావు రెండుపాగాయొక్క యాభరణములును. ఒకముత్యములహారమును, ఒకగుఱ్ఱమును, ఒకఏనుగను ఖిల్లతుగాఁ బడసెను.

సోదరుఁడగు హరిదాసుతోడను సఖ్యము దిట్టపఱచుకొనుచుండెను. వీరందఱును గొప్పప్రమాణముల వలన బద్ధులుగఁజేసికొనిరి. బందలుఖండు రాజులు, యమునా చంబలునదీ ప్రాంతముల నంతను బాజీరావు దండయాత్రలో కలియుటకును, బర్ద్వానురాష్ట్రము తప్ప తక్కిన జయార్జిత దేశము లన్నియు తమయొక్క సేనాసంఖ్య కనురూపముగఁ బంచుకొనుటకును, ఒప్పుకొనిరి. వారు, 'బాజీరావు దక్కనునందు యుద్ధమునఁ బనివడి యున్న యెడల రెండు నెలల వఱకు బందలుఖండును స్వయముగ రక్షించునట్లును, అప్పటికిని మహారాష్ట్రులు కలిసికొనలేకపోయిన యెడల తత్కాలమునకు తమ క్షేమముకొఱకు వారికి ఉత్తమములుగఁ దోఁచిన సమాధానములను శత్రువులతోఁజేసికొని, తిరిగి హిందూస్నేహితులతోఁ గలిసికొనినతోడనే యాసమాధానములను భంగము చేయునట్లును,' వాగ్దానము చేసిరి. చిత్తూరుసాలు రాజ్యములో, జాన్సీగాక బాజీరావుయొక్క పంతు 5 లక్షలురాఁబడి కలదిగ నప్పుడు గణింపఁబడినది.

ఉత్తరదిక్కునం దీకట్టుదిట్టములు చేయుట, నిజాముతో యుద్ధమునకో లేక కర్ణాటకదండయాత్రకొఱకో యైయుండవలెను. నిజాముల్ముల్కుతో వెనుకటి యుద్ధమునందు జయమును,అతఁడు సమాధానమునుండి చేసిన యతిక్రమణమును, అతని వృద్ధాప్యమును, అతనికుమారుల యందలి యంతః కలహములు, బహుశః బాజీరావును,దక్కనునంతను జయించుటకు ప్రేరేపణమును ప్రోత్సాహమును చేసి యుండవచ్చును. కాని యంతగొప్పకార్యమునకుఁ దగిన యుపాధులులేక తత్కార్యనిర్వహణము నడ్డగించెను. మఱియుఁ దనఋణము దీర్చుటకు కప్పములును, దోపిడి ధనమును వచ్చునను నాశయు, బహుశః ఆర్కాడునుండి సఫ్దరాలీయొక్క దివానగు మీరు అసదుయొక్క రహస్యప్రోత్సాహమును,అతనిని కర్ణాటకమునకు రావించెనని తోఁచుచున్నది. బాజీరావుయొక్క యవస్థ యిప్పు డాపత్కాలీతముగ నున్నది కావుననతఁడు దక్కను నే తన యాహావరంగముగఁ జేసికొనెను. దాభడే సేనాపతిపక్షము,అనఁగా ఉమాబాయి యేజంటు దమ్మాజీగైక్వాడు పక్షము,(ఉమాబాయి కుమారుఁడగు జస్వంతరావు పెద్దవాఁడైన తరువాతకూడ నా యుద్యోగమున కసమర్థుఁడై యుం

డెను.) చాల యుపాధులు కలదిగ నుండెను. ఇదివఱకుఁ జెప్పఁబడిన కారణముల వలన నా పక్షము పీష్వాకు విరోధముగ నేయుండెను.

ఇఁక బేరారు నాయకుఁడగు రఘోజీ భోంస్లే, బ్రాహ్మణాధిక్యత యెడల నసూయాపరుఁడై యుండెను. అతఁడు రాజాను తన వశములోనికిఁ దెచ్చుకొని, విప్లవమును కలుగఁజేయ నాలోచించు చుండెను. సాహురాజు సంతతి కలుగు నాశ యిఁక లేదు. రఘోజీ యతని కుమారుఁడుగ పెంపునకుఁ బోయి రాజ్యాధిపతి కాఁదలంచి యుండవచ్చును. ఇతనికి మారుగ రాజ్యకాంక్ష కుఁదగినవాఁడు అక్కలకోట జాగీరుదారుఁడగు ఫత్తేసింగు భోంస్లే యొకఁడు మాత్రమే యుండెనుకాని యతఁడు శక్తిసామర్థ్యములు లేక పోవుట చేత భటుల యనురాగమునకు పాత్రుఁడు కాఁజాలఁడు. ఈయెత్తువేసి గెలుచుటకీతని కాటంకములు చాలఁగలవు. పీష్వాకు ప్రతిపక్షులు చాలమంది యుండినను, బాజీరావు స్నేహితులును బంధువుల నేకులును రాజాచుట్టునుజేరి యాయన విశ్వాసము నంతను సంపాదింపలేక పోయినను ఆయనకు బోధరైన చేయంగలవారై యుండిరి. ఇంతియుకాక రఘోజీ భోంస్లేకాని, దమ్మాజీగాయక్వాడుకాని బ్రాహ్మణమధ్యవర్తులు లేక సంప్రదింపు చేయలేని వారైరి. ఈ యిద్దఱి దేశముల మధ్యను బాజీరావు తన స్థానమును విడిచిన వారి యైకమత్యమున కాటంక ముండదు.

రఘోజీ అలహాబాదును కొల్లఁబెట్టినందు వలనను, అతని భూములను వతనులను అనుభవించుచున్న పద్ధతుల ప్రకారము, ఆజ్ఞాపింపఁబడినపుడు వెంటనే వచ్చి కలిసికొనక పోవుట వలనను, అతనికిని బాజీరావునకును భేదము కలిగెను. ఇందు కొఱకు పీష్వా యిదివఱకు శిక్షింప నిశ్చయించు కొనినట్లు ఈ వఱకు చెప్పియుంటిమి. అయినను ఢిల్లీయందు పరిషియనులు ప్రవేశించినపుడు తత్కాలమునకు సంధి యేర్పడెను. కాని యీవివాదము పూర్తిగ పరిష్కారము కాలేదు. అయినను పరస్పరలాభములకు విఘాతము కలుగు నను జ్ఞానము వారిని బహిరంగ యుద్ధము నుండి విముఖులఁజేసెను.

ఈ పైఁజెప్పిన వాంఛములవలన మహారాష్ట్రుల యొక్క విజృంభణ

యీ కాలములో మరల కర్ణాటకముపై జరిగెను. బాజీరావును రఘోజీభాంస్లేయు సఖ్యపడి కర్ణాటకమునందుఁ దోఁపిడిధనమును పంచుకొనుటకును, దక్కనునందు కొంతభాగమును పీష్వాదేశమునకు కలుపుకొనిన తరువాత బంగాళా హిందూస్థానములను పంచుకొనుటకును, వారు సంప్రదింపు చేసికొనిరి.

నిజాముల ముల్కు హిందూస్థానమునం దుండిన తరుణము చూచి, అతని రెండవ కుమారుఁడగు నాజరుజంగు 10,000 సైన్యములో ఔరంగబాదునం దుండగ నతని బాజీరావుముట్టడించి యుద్ధమారంభము చేసెను. నాజరుజంగు చాల పదాతి యశ్వఫిరంగి సైన్యములచే సాహాయ్య భూతుఁడై గోదావరినిదాటి మహారాష్ట్రసైన్యములను నిర్లక్ష్యము చేసి అహమ్మదు నగరము దిక్కునకు నడచి మార్గమున గ్రామములను కొల్లఁబెట్టెను. పీష్వాయు చిమ్నాజీ అప్పాతోఁ గూడుకొని మరల గోదావరి దాటు సరికును నాజరు జంగును బాధించెను. కొన్ని మాసము లిట్లు జరిగిన తరువాత మహారాష్ట్రులీ వ్యర్థయుద్ధము నాపి నాజరుజంగు కోరిన సమాధానమునకు మంగిపైటను దగ్గరయొడంబడిరి. దీని వలన నిరుపక్షులవారును దక్కను నందు కొల్లఁబెట్టుటను మానుకొందమని యనుకొనిరి. నర్మదాతీరమున సిందియా కిరూను జిల్లాలు బాజీరావునకు జాగీరుగ నియ్యఁబడెను. పీష్వాపూనాసతారాలకు పోకుండ నత్యంత విసుగుదలతో తన సైన్యమును తీసికొని హిందుస్థానమున కరిగెను. చిమ్నాజీ అప్పా పీష్వాకుమారుఁడైన బాలాజీబాజీరావు కొంకణమందు కలహముల యం దుండ నతనికి సాయము చేయఁబోయెను.

శంభాజీ అంగ్రియా, ఇంకను కొలాబాను జయింపవలె నను దృష్టికలవాఁడై పీష్వా సైన్యములు దూరమునకుఁ బోవుటఁ జూచి, మహ్నాజీ జిల్లాలను మరల జయింపఁ దొడంగెను. శంభాజీ కొలాబాను ముట్టడించి కావలి సైన్యమునకు మంచితీర్థము లేకుండ నవరోధించెను. బాలాజీ బాజీరావు, తన తండ్రిచే యుపదేశితుఁడై, బొంబాయిలోని ఇంగ్లీషు సంఘమువారిని సహాయ మందఁజేయించుటకు కోరెను. వారును అటులఁజేసిరి. నానాసాహెబు అని సామాన్యముగ నప్పుడు పిలువఁబడు, బాలాజీబాజీరావు హీరాకోటలోనున్న

శంభాజీభోటులను తఱిమివేసి యతని దాసీసోదరులలో పెద్దవాఁడగు తులాజీని ఖైదీగ పట్టుకొనెను. తరువాత ఇంగ్లీషువారి సహాయ్యమువలన శంభాజీ యోడలు తఱిమివేయఁబడెను. శంభాజీ యెటులనో తప్పించుకొనిపోయెను. చిమ్నాజీ అప్పా నానాసాహేబుతోఁగలిసి రేవదుండాను పట్టుకొనఁ బ్రయత్నముచేయు చుండగ, బాజీరావు, నర్మదానదీతీరమున 1740 ఏప్రిలు 28వ తారీఖున స్వర్గస్థుఁడయ్యెనని తెలియవచ్చెను. ఈ వర్తమానము తెలిసినతోడనే శంక్రాజీనారాయణుఁడు కొంకణకు సుభేదారుగ నియమింపఁబడెను. చిమ్నాజీ అప్పాయు అన్నకుమారుఁడును మైలశుద్ధియైనతరువాత పూనాకువచ్చి యచ్చటనుండి సతారాకువచ్చి చేరిరి.

బాలాజీ విశ్వనాథునివలన నేర్పాటు చేయఁబడిన పద్ధతులవలని లాభనష్టము లీవఱకు వివరించిన ప్రకారము బాజీరావు కాలమునందుఁ గనఁబడియుండెను. బాజీరావు, వ్యవహారముయొక్క వివరములను విమర్శించుటకుఁ, దగిన యవకాశములేని వాఁడయ్యెను. అతనియొక్క బాహ్యాంతరంగ వ్యవహారములందు చిక్కులను మనము పరికించి నపు డతని పరిపాలన యొక్క యన్ని శాఖలయందును గల కలకలము విస్మయకరముకాదు. క్రమమైన పరిపాలన యెడల నతఁడు విస్తారమిష్టము కనఁబఱచలేదు. అతని దేశీయు లనేకు లతనికి ధనకాంక్షనారోపింతురు. మఱికొంద ఱతఁడు పరిపాలనా ధర్మముల యొక్క అన్ని శాఖలను అశ్రద్ధచేసి మతాచారములయందు నిర్లక్ష్యము కలవాఁడై కేవలము యోధునివలెఁ బ్రవర్తించె నని నిందింతురు. ఈయభిప్రాయములందు కొంత సత్యముండవచ్చునుగాని యాలోపములతని యుత్తమ వర్తనమును విస్తారముతగ్గింపఁజాలవు. అతఁడు బ్రాహ్మణ వర్ణముయొక్క కొన్నిలోపములను కలిగియున్నను, బ్రాహ్మణుల యొక్క యాచరమార్గావలంబనమును కలిగియుండలేదు. అతని దేశీయు లతనిఁగూర్చి చేసిన ఖండనల కన్నిటికిని అతనికి తటస్థించిన యాపత్కాలితమైన స్థితిగతులే ప్రత్యుత్తరము లియ్యఁగలవు. అతఁడత్యాశాపరవశుఁడైన మాట సత్యము. దక్కను నంతను వశపఱచు కొనవలెనని యతఁడు కడపట చేసిన ప్రయత్నమునందు తన సాధనసంపత్తిని తప్పుగణించెను. అయిన నా దూర

దృష్టి లేమి నతఁడు తరుణములోనే గ్రహించుకొని యా యుద్యమమును నుండి జాగ్రత్తగ తప్పుకొనెను. కత్తులు, కుట్రలు, ఆపదలు మెండలైనవాని మధ్య ననేక కష్టములలో నతఁడు వేసిన యెత్తులు, ఆదేశీయు లనేకుల వానివలెనే, దీర్ఘదర్శితములు కావు. అయినను అంతరంగ విరోధముల నణచుట యందును, నిజాములుముల్కు యొక్క యెత్తులను వెంటనే గ్రహించి ప్రతిఘాతములు గావించుట యందును, అతఁడు సూక్ష్మబుద్ధిని, శక్తిని, చాతుర్యమును చూపించెను. తనవశము నందున్న యొక్క శక్తిని వ్యర్థంబుగ ప్రయోగించుటయం దతని దృష్టి విశాలము, అతఁడెట్టిమహాకార్యములైన నిర్వహింపఁగలఁడని మనకుఁదోఁపక పోదు. దోఁపిడిసైన్యముల కధినాధుండుగ నతనిసామర్థ్యము చాలా గొప్పది. అతఁడు ధైర్యసాహస వక్తృత్వములందు సుప్రసిద్ధుఁడు. అతఁడు జీవించిన కాలమును, అతఁడు పనిచేసి నప్పటి స్థితిగతులును, శివాజీ యొక్క కాలమును స్థితిగతులును, పూర్తిగ వేఱైనందున నుపమానమున కవకాశములేదు. అయినను బాజీరావునకు బుద్ధిబల మెక్కువ కలదనియు, శివాజీకి దైవబల మెక్కువ కలదనియు జెప్పవచ్చును.

బాజీరావు రూపమునం దందమైనవాఁడు. అతని విలాసాభినయంబులు, నయవినయ శీలుండగు సభికునివిగాక, నిష్కపట యోధునివై యుండెను. అతఁడు సైన్యములతో రణక్షేత్రమున నున్నపుడు రాజ్యాటోపంబు లేమియును లేక, సామాన్య ఆశ్వికుని యొక్క కష్టముల నన్నిటిని సంతోషముగ ననుభవించెడువాఁడు. ఇతని యొక్క యీ ప్రవర్తనను గూర్చిన యొక కథ యీ క్రింది సందర్భము వలన నిప్పటికిని తెలియవచ్చుచున్నది. నిజాములు ముల్కు ఇతనిఁ జూడకపూర్వము, వారు మొట్టమొదటి యుద్ధమునందు ఎదుర్కొనినపుడు, నిజాములు ముల్కు తన దగ్గఱ నుద్యోగములోనున్న యొక్క గొప్ప చిత్రకారుని, బాజీరావు సైన్యములోనికిఁబోయి యతఁడు ప్రథమమున కనఁబడగానే యేయవస్థలో నున్న నటుల చిత్రమురచించి తీసికొని రావలసినదని పంపెను. ఆచిత్రకారుఁడట్లు చేసి పీష్వాను, గుఱ్ఱముపై నెక్కి, గుఱ్ఱపు వెనుక కాళ్ల

కట్టు త్రాళ్లను ముందుకాళ్ల త్రాళ్లను సామాన్యభటుని వలె డాణాసంచిలో వేసికొని బల్లెమును భుజముపై వానించుకొని, రెండుచేతులతోడను జొన్నకంకులనునలుపుకొని తినుచు సవారి చేయుచుండగ, పటమునఁ జూపించెను.

బాజీరావునకు ముగ్గురుకుమారులు గలరు. పెద్దవాఁడగు బాలాజీ బాజీరావు తండ్రితరువాత పీష్వాయాయెను. రెండవకుమారుఁడగు రఘునాథరావు మహారాష్ట్రరాజ్యవినాశమునకు ప్రథమపురుషుఁడు. ఈతనికుమారుఁడగు రెండవబాజీరావుతో రాజ్యవినాశము పూర్తియయ్యెను. మూఁడవవాఁడు జనార్దనరావాయను నతఁడు యౌవనమందే చనిపోయెను. వీరుగాక బాజీరావునకు మహమ్మదీయ భార్యవలన నొక పుత్రుఁడు కలఁడు. వానిని ఉపనయనము చేసి బ్రాహ్మణులలో కలుపుకొనవలెనని యతఁడు కొంత ప్రయత్నము చేసెననియు, బ్రాహ్మణుల యాక్షేపములవలన నాప్రయత్నము విఫలమైనదనియు పీష్వా బఖరు చెప్పుచున్నది. కావున వానిని షంషీరు బహద్దరను పేరుతో ముసల్మానుగానే యాతఁడు పెంచెను. ఈమహమ్మదీయభార్య, మస్తానీయను నామె, నిజాములముల్కు కూతురనియు, అతని యొక్క సఖ్యము కుదురుటకుఁగాను నబాబుభార్య కూతురును బాజీరావుకు వివాహమున నిచ్చునట్లు మగనికి బోధించి యట్లు చేయించెననియు, బాజీరావు చరిత్రయందు చెప్పఁబడియున్నది. వివాహము మాత్రము ఖడ్గముతో చేయఁబడెను. బాజీరావు మస్తానీని తరువాత తీసికొని వచ్చి పూనాయందు శనివారభవనపుస్థలమునం దొక ప్రత్యేకయంతఃపురమును కట్టించి యుందుంచెనని తెలియవచ్చుచున్నది.

ఈ మహారాష్ట్రుల చరిత్రయందు, అప్పుడప్పుడు సంగ్రహముగనైన వారితో సంబంధములుగల రాజ్యముల నన్నిటిని కొంచెము వివరింపకున్న చదువరులకు దేశకాలపాత్రంబులు స్పష్టముగఁ దెలియ నేరవు.

మహమ్మదుషా, నిరంకుశ ప్రభు వగు నాదరుషాచే నవమానితుండై, తన కిరీటమును స్వేచ్ఛను మరల పొందెను. ఢిల్లీయందలి 8 కోట్ల నవరసుల ధనము వానికి కొల్ల పెట్టఁబడెను. దేశమునందు వారిని వీరు కొల్లఁబెట్టుకొనినను,

వీరిని వారు కొల్లఁబెట్టుకొనినను, ధన మిచ్చటనే యుండుటవలన ఒకరి క్రిందపడినను మఱియొకరు మీఁద బడుచుండెడువారు. పరదేశీయులచే కొల్లఁబెట్టబడిన ధనము మరల వచ్చుటకు లేకపోయెను. వీరంతటి గొప్ప నైకమత్యము లేకపోవుటవలన నా నాదరుషా వచ్చి జయము చేకొనిపోయెను. కానియెడల నతని ప్రతిష్ఠయెల్లనిచ్చట భస్మమయ్యెడిదే. ఢిల్లీపట్టణవాసులు వేలకొలఁది చంపఁబడిరి. మహామ్మదుషా మరల తల యెత్తుకొనలేక సింహాసనమందు జీవచ్ఛవమై పడియుండెను. మొగలు రాజ్యమెల్ల ఖండతుండెము అయ్యెను.

కాబూలు, తట్టా ముల్తాను రాజ్యములు పరిషియాతో కలుప కొనఁబడెను.

నిజాములుముల్కు, అమీరుల్ఉమ్రావు అను బిరుదుతో కొంతకాలము ఢిల్లీయందుండి, తన రెండవకుమారుఁడగు నాజరుజంగు తిరుగబాటు చేయఁ దలచుచున్నాఁడని విని, పెద్దకుమారుఁడగు గాజియుద్దీనుకు తన బిరుదమునిచ్చి తాను హైదరాబాదునకుఁ బ్రయాణమాయెను.

ఔదు (అయోధ్య) నవాబైన సాదతుఖాను, నాదరుషా వెడలక పూర్వమే కాలముచేసెను. అతని అల్లుఁడును మేనల్లుఁడునైన మున్సూరుఖాను సఫ్దరుజంగు తరువాత నబాబయ్యెను.

చక్రవర్తికింకను సామంతులైన రాజపుత్రరాజులు, జయపూరు, జాడ్పూరు, ఉదయపూరులై యుండెను. చివర రెండు రాజ్యములును మహారాష్ట్రులచే చాలవఱకు వశముచేసికొనఁబడెను. కాని జయపూరు రాజగు జయసింగునకును బాజీరావునకును కల స్నేహమువలన నారాజ్యమున దండయాత్రలు జరుపఁబడలేదు.

సింధునదికి యొడ్డున పూర్వమున్నటువంటి జాటులని యొకక్రూరసంఘమువారు, ఔరంగజేబు మరణమునకు పూర్వమే ఆగ్రాజయపూరులకు మధ్యస్థలము నాక్రమించుకొని యుండిరి. దక్కనునందు మహారాష్ట్రులెటులనో,

హిందూస్థానమందు వీరునటులనే. వీరినాధుఁడగు చూరమను ఆకాలపు గంద్రగోళములో నధికారసమన్వితుఁడయ్యెను. ఔరంగజేబుయొక్క సామానులను దోఁచుకొనుటవలన వీరు భరతపుర పుర్కోటను కట్టుటకు ప్రారంభించిరని తెలియుచున్నది. మహారాష్ట్రులును వీరును మారముగ నున్నప్పటికిని, మహారాష్ట్ర విజృంభణమే వీరి విజృంభణమునకును కారణమై యుండెను. తరువాత మహారాష్ట్రులు చంబలునదిని దాటిన తరువాత ఈరెండు జాతులవారికిని పరస్పర స్నేహభావ ముదయించెను.

ఆలీవర్డీ ఖాను అనునతఁడు బేహారమునకు 'నవాబైయుండి బెంగాలు ఒస్సారినవాబులను చంపి మూఁడురాజ్యములకును తానే యధిపతియయ్యెను.

డిల్లీయొక్క చుట్టుప్రక్కలనే క్రొత్తరాజ్యము లుద్భవిల్లుచుండెను. రోహిలఖండమని యొక చిన్నరాజ్యము అచ్చట ప్రబలుచుండెను. దీనికి మూలపురుషుఁడు హిందూస్థాని అహీవంశమువాఁడు (మహారాష్ట్రమందు గొల్లవాండ్ర కులమువంటిది). ఒక అఫ్గనుఁడు గొల్లవాని నొకని చిన్నపిల్లవాఁడుగనుండగా పెంచుకొని వానికి ఆలీమహ్మదు రోహిలాయని పేరుపెట్టెను. వానియొక్క యనుచరులందఱును తరువాత రోహిలాలని పిలువఁబడుచు వచ్చిరి. అతఁడు మూరదాబాదు గవర్నరుల క్రింద అఫ్గను అశ్వసైన్యమున కధిపతిగనుండెను. తరువాత శిస్తుయొక్కువ నిచ్చెదనను మిషమీఁద కొన్నిభూములను తీసికొని రాజ్యమును వృద్ధిచేసికొని డిల్లీపట్టణమునకు 100 మైళ్లు దక్షిణమున దూయాబులో వజీరగు కమారుద్దీనుఖాను నోడించి రాజ్యమును స్థిరపఱచుకొనెను.

దక్కనునందు, మహారాష్ట్రుల కధికారమున్న దేశమునందు తప్ప తక్కిన ఔరంగజేబుకు లోఁబడియుండిన దేశమునం దంతను నిజాములుముల్కు మహారాష్ట్రులతో కప్పమును సగభాగముగ ననుభవించుచుండెను.

బీజపూరు గోలకొండల వంశములక్రింద కడప, కర్నూలు, సావనూరు, గవర్నరుల సంతతివారగు నవాబులు, మహారాష్ట్రులతో సఖ్యముగనుండి యొక

విధమైన స్వాతంత్ర్యము ననుభవించుచుండిరి. ఆర్కాడు నవాబుయొక్క యల్లుఁడై పేరుపడిన చందాసాహేబు తిరుచునాపల్లిరాజునకు రక్షణమొసఁగెద నను మిషమీఁద నా సంస్థానము నాక్రమించుకొనెను.

తంజావూరునకు నామమాత్రమునకు రాజగు నతఁడు వెంకాజీయొక్క మనుమఁడు. వెంకాజీయొక్క ముగ్గురు కుమారులలో కడసారివాఁడగు తుకాజీకే సంతానమే కలిగియుండెను. ఈసమయములో తుకాజీయొక్క యిద్దఱుకుమారులు జీవించియుండిరి. పెద్దవాడగు శాయాజీయను నతఁడు, చాలదినములనుండి మంత్రిగనున్న యొక మహమ్మదీయ యుద్యోగస్థునివలన పదభ్రష్టుఁడుగఁ జేయఁబడి మద్రాసులో ఇంగ్లీషువారి నాశ్రయించియుండెను. రెండవవాఁడును దాసీపుత్రుఁడునైన ప్రతాపసింగను నతఁడు మహమ్మదీయ వజీరుచే సింహాసనాధిష్ఠితుఁడుగఁ జేయఁబడెను. కాని యతఁడు మంత్రియధీనములో నుండుట కిచ్చగింపక వెంటనే యతనిఁ జంపివేసెను.

తరువాత కొలది కాలములోననే తుత్తునియలైన మొగలురాజ్యమును క్రమక్రమముగ నాక్రమించి కలహంబులందు చేరనున్న యింగ్లీషు ఫ్రెంచి రాజ్యముల వారు విధేయవినమ్రులై, తమ చుట్టునున్న చిన్నచిన్న దర్బారులన్నిటికిని లంచములును నజరానాలు నిచ్చుటచేత వ్యాపారపు హక్కులను వృద్ధిచేసికొనుటకే యత్నించుచుండిరి.

పోర్చుగీసువారు మహారాష్ట్రులచే గర్వభంజనులైరి. బొంబాయియందు ఇంగ్లీషువారు చిమ్నాజీ అప్పాద్వారా తమ వ్యాపారహక్కులను వృద్ధిచేసికొనుటకు ప్రార్థనలను చేయుచుండిరి.

సూండా రాజాయును, కార్వారు దేశాయియు, మహారాష్ట్రులతోడి యుద్ధమునందు పోర్చుగీసువారికి సహాయ్యము చేసియుండిరి. కొల్లాపురపురాజా సంస్థానమునకు దగిలియున్న రాజ్యము కల బెద్నూరురాజా సుభావముగ నుండెను.

మైసూరురాష్ట్రము, మొగలులకును సాహూకును సామంతుఁడుగ నెంచుకొనఁబడినప్పటికిని పది పదునైదు సంవత్సరములనుండిఁ దగ్గఱ సంస్థానాధిపతు లెల్లరుల వలనను, యుద్యోగస్థులయొక్క సామర్థ్యము వలనను మహారాష్ట్రుల యాధిపత్యమునుండి తప్పించుకొని యుండెను.

బాజీరావు కాల మంత మగునప్పటికి భరతవర్ష రంగ మీ విధముగ నుండెను.



పీష్వాబాలాజీబాజీరావు.

ప్రకరణము. 16.

మహారాష్ట్రులయొక్క పూర్ణ విజృంభణము.

బాలాజీబాజీరావు.

1740—1761.

ఈతని కాలమందు మహారాష్ట్రసంఘము విజృంభింపఁగల కడపటి హద్దుల వఱకును సాగిపోయెను. ఇదివఱకు వారు చేయుచున్న ప్రయత్నముల వలన ననుభవసిద్ధులై యుచ్ఛదశకు వచ్చినవారైరి. కాని ఈ కాలమంత మగు నప్పటికి పానిపట్టు నొద్ద నాఫ్గనులచే దారుణయుద్ధమున నోటమిని పొంది వినాశపథమునకు దిక్కు చూచినవారైరి.

అటుల కర్ణాటకమునకు బయలుదేరిన సేనలు రఘోజీభాంస్లే క్రింద నడు
పఁబడెను. పీష్వాయొక్కయు, ప్రతినిధియొక్కయు, ఫత్తేసింగు భాంస్లేయొ
1740 క్కయు మరి యనేక ముక్కడి ప్రముఖులయొక్కయు సైన్యములు
కూడుకొనెను. శాంతాజీయొక్క యన్నమనుమఁడును, గుత్తి మురా
రావుచే పెంచుకొనఁబడి యతని యాస్తికి వారసును అయిన మురారిరావు,
అక్రమముగ తన బంధువు చంపఁబడినపిమ్మట, నిప్పుడే ప్రథమ పర్యాయము
జాతీయ కేతనము క్రింద మరల చేరెను. ఇతఁడు సేనాపతిత్వమును కోరెను
కాని, తుంగభద్రానదియొద్ద మూడు జిల్లాలిచ్చిన మీఁదట నాకోరికను వదలి
వేసెను. ఈ కూడుకొనిన సైన్యమంతయు 50,000 వఱకు నుండెను. వీరు నిర్జనం
బగు నొకమార్గమున దామల్చెరీకనుమ (వెంకటరమణగిరి) మార్గమున ప్రవేశించి
కర్ణాటక నవాబైన దాస్తాలీని రణమున నిర్జించి అతని దివానగు మీరాసు అను
దును ఖైదీగ పట్టుకొనిరి. కాని యటుతరువాత రణ నిహతుఁడైన నవాబు

కుమారుఁడగు సఫ్దరాలి వారికి విశేషధనమిచ్చి తిరుచునాపల్లి నాక్రమించుకొనిన చందా సాహేబుపై పురికొల్పెను. మహారాష్ట్రులును ఆకస్మికముగ నతనిపైఁ బడుటకు వెనుకకు ప్రస్తుతము 250 మైళ్లు తగ్గియుండిరి.

ఇట్లు ప్రధాన సైన్యములు శివగంగాతీరమున శిబిరము నందుండ, రఘోజీ భోంస్లే సతారా కరిగి పీష్వా యుద్యోగమునకు బాలాజీ బాజీరావు రాకుండ నడ్డగించుటకు, బారామతిలో భాగ్యవంతుడగు సాహుకారును బాజీరావుయొక్క చుట్టమును వైరియు నైన బాపూజీనాయకుని, యా స్థానమునకు రాజుతో ప్రస్తావించెను. ఈ బాపూజీ నాయకుఁడు బాజీరావు బావగారి సోదరుఁడని యీవఱకు చెప్పియుంటిమి. వీరిద్దఱకును వైరము, బాపూజీయప్పిచ్చిన కొంత ధనము బాజీరావు తీర్చలేకపోవుట నుండియే, వచ్చినది. మత్సర యుతుండగు నీ ఋణదాతను రఘోజీ పక్షమువారు తమ పగతీర్చుకొనుటకు సాధనముగ నుపయోగించిరి. బాపూజీ పీష్వాగా చేయఁబడినయెడల, చాల ధనమిత్తుమని, సాహుతో వారు మనవి చేసికొనిరి.

ప్రతినిధి శ్రీపతిరావు, పీష్వాయొక్క యాధిక్యత కిష్టుఁడు కాకపోయినను, రఘోజీయొక్క యాధిక్యత కంతకంటె నిష్టుఁడు గాకుండెను. కావున నీ కుట్రయందు అతఁడు కలియనందున, బాలాజీ బాజీరావు, పినతండ్రి సాహాయ్యమున, 1740 ఆగస్టున పీష్వా యుద్యోగమున కభిషిక్తుఁడయ్యెను. బాలాజీ బాజీరావు తండ్రి ఋణములకు బాధ్యుఁడుగఁ జేయఁబడుటవలన, నతని కింతకంటె మనోవ్యాకులతకుఁ గారణముగ లైను. బాపూజీ నాయకుఁడు బాలాజీపై మొదట తన ఋణమునకు తకాజు (నక్షత్రకులను వెంటఁబంపుట) చేసెను. అటు తరువాత నతఁడు స్వయముగ ధారణ (అభోజనము కూర్చుండుట) చేసెను. ఈ పీడననుండి బాలాజీయొక్క దివానగు మహాదాజీ పంతు పురంధరే వలన నతఁడు తప్పింపఁబడెను.

రఘోజీ, తన యెత్తులు వ్యర్థమాటెరింగి, బాపూజీనాయకుని తనవెంట కర్ణాటకమునకు తీసికొనిపోయెను. తిరుచునాపల్లి 1741 మార్చి 26వ తేదీని లోఁబడెను. చందాసాహేబు ఖైదీగ సతారాకు తీసికొనిరాఁబడి 1748 వఱకును

విడ ఖైదున కావలిలోనుంచఁబడెను. మురిరారావు ఘోరేపురే తిరుచునాపల్లి కోటకు రక్షకుఁడుగా నుంచఁబడెను.

బాజీరావు మరణానంతరము మాల్వాగవర్నమెంటు చక్రవర్తిచే అజిముల్లాఖాను కియ్యఁబడెను. క్రొత్త పీష్వాదానిఁగూర్చియు మఱియితర వాగ్దానములను గూర్చియు విజ్ఞాపనలు, జయసింగు నిజములుముల్కుల ద్వారా పంపెను. బాలాజీ రొక్కముకూడ నడిగెను. కావున 15 లక్షలరూపాయ లుచితముగా చక్రవర్తిచే నియ్యఁబడెను. మాల్వా రాజ్యమిమ్మనికొన్ని ప్రస్తావనలు చేయుచు పీష్వాయు నతని పినతండ్రియు తెలియపఱిచిరి. కాని దానినిచక్రవర్తి విచారింప లేదు. తరువాత నిజాము కుమారుడైన నాజరుజంగును యవిధేయతకుశిక్షింపవచ్చుచున్నపుడు, పీష్వానర్మదానదియొద్ద మర్యాదార్థమతనిఁగలిసికొనిరాచకార్యములను సంభాషించి, తనసైన్యములను కొన్నిటి నతనికి సాహాయ్యమిచ్చెను. 1741 జనేవరిలో చిమ్నాజీ అప్పా లోకాంతరగతుఁడైనందున నతనికి గొప్పనష్టము కలిగెను. చిమ్నాజీ అప్పా, యూరోపియను దేశీయులపై జయములనొంది నందువలన, నెక్కువ ప్రతాపప్రతిష్ఠగలవాఁడుగా నుండెను. అతని జయములలో ననుభవమును పట్టి యతడుఁసైన్యముయొక్క బలము కాల్బలమునందును ఫిరంగిదళమందును కలదని విశ్వసించెను. ఇది చాలవిషయములలో నిజమేగాని దీనిమీఁదనె యెప్పుడును ఆధారము గల్గియుండకూడదు. వానర యుద్ధములో నున్న లాభములుమఱచి యీయనుభవమునే రూఢముగాఁదీసికొని యితని కుమారుఁడగు సదాశివరావుభావూ పానిపట్టు యుద్ధమున నొక్కసారిగనే మహారాష్ట్రుల సేనల రణదేవికి బలిగా నర్పించెను. చిమ్నాజీ అప్పాకోటలపై ప్రయోగించిన ప్రక్రియను మైదానముపై సదాశివరావు ప్రయోగించెను.

పినతండ్రి చనిపోయిన పిమ్మట పీష్వా పూనానతారాలయందు సివిలువ్యవహారములను చక్కఁజేయుచు నొక్కసంవత్సరము గడిపెను. రాజాయొకఁడు నతఁడు తన గౌరవము చూపుచునే పోర్చుగీసు వారియొద్దనుండి రాజ్యముగెలిచెను, నర్మదానదికి ఉత్తరమున గుజరాతు తప్ప తక్కిన మహారాష్ట్ర దేశము

ఘంతటిను రివిన్యూ వసూలుచేయు నధికారమంతను తనకిచ్చునటుల, రాజుగారి యంగీకారమును పుచ్చుకొనెను.

బెంగాలులో ఆలీవర్డీఖానుడు అదివఱకు బెంగాలునకుసుభేదారుగ నున్న వానిని యుద్ధమునందు తెగటార్చెను. ఆ సుభేదారుని దివానగు మీరు హబీబు
1742 రఘోజీభోంస్లే యొక్క దివానగు భాస్కరపంతును సాయముకోరెను. భాస్కరపంతు దండయాత్రకు సన్నాహము చేయుచుండెను. పీష్వాకూడ తద్దేశమును తాను స్వాధీనము చేసికొనఁదలఁచి హిందుస్థానమునకు ప్రయాణమై వర్షకాలమందు నర్మదానదీతీరమున దరిడువిడిసి యుండెను. ఇంతలో రఘోజీ భోంస్లేచే ప్రేరితుఁడై దమ్మాజీగాయక్వాడు గుజరాతునుండి మాల్వాపై దండెత్తివచ్చెను. బాలాజీబాజీరావు గాయక్వాడును తటిమిచేసిన వాఁడై బాజీరావు కాలములో త్రింబకరావు దాభడేతో కలిసి యుద్ధముచేసిన వాఁడగు అనందరావు పవారుతో సఖ్యముచేసి, ధారును దానిచుట్టుప్రక్కల నున్న ప్రాంతములు నతనికిచ్చి గుజరాతునుండి గాయక్వాడు దండయాత్రలు కలుగకుండ నడ్డుగట్టినవాఁడాయెను. పీష్వా రాజాజయసింగు ద్వారాగను నిజాములుముల్కు ద్వారాగను మాల్వాగవర్నమెంటునకు సనదులకొఱకై రాయభారములు నడుపుచుండెను. చక్రవర్తి వెనుక నతనితండ్రికిచ్చిన దానికంటె యధికమైన ఖిల్లతును బాలాజీరావునకుఁ బంపించెను. పీష్వా యెట్లైన మాల్వాను సంపాదింపవలెనని తలఁచుచుండెను. చక్రవర్తి యెట్లైన కాలము జరుపవలెనని యాలోచించుచుండెను.

ఆలీవర్డీఖానుఁడు, కటకములో తన యన్నమనుమఁడైన సురాజద్దౌలా యొక్క నిరంకుశ ప్రభుత్వమువలన తిరుగఁబాటు జరుగగా, దాని నణచుటకుఁ బోయి యుండెను. భాస్కరపంతు ఈసమయముననే బేహారునకు దండయాత్ర చేసెను. ఆలీవర్డీ తత్క్షణమే విద్రోహుల నణచివేసి భాస్కరపంతులు నెదుర్కొన వచ్చెను. మహారాష్ట్ర సైన్యము పది పండ్రెండు వేల వఱకు నుండెను. ఆలీవర్డీఖానుఁడు మూఁడువేల సైన్యముతో వారిఁదాకి సామగ్రులను గోలుపోయి పలుబాములఁ బడి కట్టకడపటకు సాహసముచే కట్వాకు తప్పించుకొని పా

ఘంతటీను రివిన్యూ వసూలు చేయు నధికారమంతను తనకిచ్చునటుల, రాజాగారి యంగీకారమును పుచ్చుకొనెను.

బెంగాలులో అలీవర్దీఖానుడు అదివఱకు బెంగాలునకు సుభేదారుగ నున్న వానిని యుద్ధమునందు తెగటార్చెను. ఆ సుభేదారుని దివానగు మీరు హబీబు
1742 రఘోజీభోంస్లే యొక్క దివానగు భాస్కరపంతును సాయముకోరె
ను. భాస్కరపంతు దండయాత్రకు సన్నాహము చేయుచుండెను. పీష్వాకూడ తద్దేశమును తాను స్వాధీనము చేసికొనఁదలఁచి హిందుస్థానమునకు ప్రయాణమై వర్షకాలమందు నర్మదానదీతీరమున దండువిడిసి యుండెను. ఇంతలో రఘోజీ భోంస్లేచే ప్రేరితుఁడై దమ్మాజీగాయక్వాడు గుజరాతునుండి మాల్వాపై దండెత్తివచ్చెను. బాలాజీబాజీరావు గాయక్వాడును తఱిమివేసిన వాఁడై బాజీరావు కాలములో త్రింబకరావు దాభడేతోఁ గలిసి యుద్ధము చేసిన వాఁడగు ఆనందరావు పవారుతో సఖ్యము నెఱపి, ధారను దానిచుట్టుప్రక్కల నున్న ప్రాంతములు నతనికిచ్చి గుజరాతునుండి గాయక్వాడు దండయాత్రలు కలుగకుండ నడ్డుగట్టినవాఁ డాయెను. పీష్వా రాజాజయసింగు ద్వారాగను నిజాముల్ముల్కు ద్వారాగను మాల్వాగవర్నమెంటునకు సనదులకొఱకై రాయభారములు నడుపుచుండెను. చక్రవర్తి వెనుక నతనితండ్రికిచ్చిన దానికంటె యధికమైన ఖిల్లతును బాలాజీరావునకుఁ బంపించెను. పీష్వా యెట్లైన మాల్వాను సంపాదింపవలెనని తలఁచుచుండెను. చక్రవర్తి యెట్లైన కాలము జరుపవలెనని యాలోచించుచుండెను.

అలీవర్దీఖానుఁడు, కటకములో తన యన్నమనుమఁడైన సురాజద్దౌలా యొక్క నిరంకుశ ప్రభుత్వమువలన తిరుగఁబాటు జరుగగా, దాని నణచుటకుఁ బోయి యుండెను. భాస్కరపంతు ఈసమయముననే బేహారునకు దండయాత్ర చేసెను. అలీవర్ది తక్షణమే విద్రోహుల నణచివేసి భాస్కరుపంతులు నెదుర్కొన వచ్చెను. మహారాష్ట్ర సైన్యము పది పండ్రెండు వేల వఱకు నుండెను. అలీవర్దీఖానుఁడు మూఁడువేల సైన్యముతో వారిఁదాకి సామగ్రులను గోలుపోయి పలుబాములఁ బడి కట్టకడపటకు సాహసముచే కట్వాకు తప్పించుకొని పా

తిపోఁగలిగిన వాఁడాయెను. ఈపోరాటములలో మీరుహబీబు తప్పించుకొని శత్రువులలోఁ జేరినవాఁడై భాస్కరపంతునునడిగి కొంత మహారాష్ట్ర సైన్యమును తీసికొనినవాఁడై మూర్షిదాబాదునకువచ్చి ఖైదునందున్న తనసోదరుని రక్షించి, జగతుసేటు ఆలంచెందు అనుసాహుకారు ధనాగారమును 2½ కోట్లు నవరసులవఱకు కొల్లఁబెట్టినవాఁడై, భాస్కరపంతులును వర్షకాలమునకు విశ్రమంపఁ జననీక భాగ్యవంత మగు నాదేశమును దోఁచుకొందము రమ్మని ప్రోత్సాహపెట్టెను. భాస్కరపంతు తరువాత హుగ్లీని పట్టుకొనెను. కట్వానుండి మిడ్నపురము దగ్గఱ వఱకు నతఁడు కొల్లఁబెట్టెను.హుగ్లీ వరద వచ్చి పొంగి యుండుటచే మూర్షదాబాదునకు పోవుటకు వీలులేకపోయెను.ఈ స్థితిగతులలో చక్రవర్తి యొద్దనుండి కప్పము కొఱకు ఆలివర్దీఖాను దగ్గఱకు ఉద్యోగస్థుఁడు వచ్చియుండెను. ఆలివర్దీఖానుఁడు తన స్థితినిఁ దెల్పుచు సాహాయ్యము కొఱకు సైన్యముల నడిగెను.అదేవిధముగ నతఁడు పీష్వాను కూడ బేరారులోని భొంస్లే జిల్లాలలోనికి దండెత్తి సాహాయ్యము చేయుటకు కోరెను. కాని యీదూత త్రోవలో శౌదు నవాబగు సఫ్దర్ జంగు వలన కొట్టివేయఁబడెను.

ఆలివర్దీఖానుఁడు పరుల సాహాయ్యము కోరుచు నశ్రద్ధతో నుండక స్వప్రయత్నములు కూడ చేసి యుండెను. సాధ్యమైనంత మంది భటులను ప్రోగు చేసికొని కట్వాలోని భాస్కరపంతు శిబిరమును ముట్టడింపవలెనని హుగ్లీపై పడవల వంతెనను నిర్మించెను. రాత్రికాలమున దానిని దాటుచుండగ 1500 మంది నదియందుఁగూలిరి. చాల కాలము వఱకా యాపదను సేనాపతిగనుఁగొనలేదు. మహారాష్ట్రులు యీసంగతి నెఱుఁగనివారై ఒరిస్సామార్గమున బేరారునకు పాఱిపోయిరి. భాస్కరపంతు పలాయనమై బేరారు చేరునప్పటికి రఘోజీ భోంస్లే కర్ణాటక దండయాత్ర పూర్తిచేసికొనివచ్చి, తన యధికారమును బంగాళమునందు నెఱపుటకు మరల బయలుదేరెను.

ఈ మధ్యను, చక్రవర్తి బంగాళములో మహారాష్ట్రుల విజృంభణము విని బాలాజీ బాజీరావును సాహాయ్యము చేయుమని కోరెను. ఇందుకు ప్రతి

ఫలముగ నతనికి అజింబాదు నుండి ఛౌతువసూలు చేసికొనుటకు అలీవర్దీఖాను దేశములో భాగము నిచ్చుచు, మాల్వాగవర్నమెంటును స్థిరపఱిచెను.

పీష్వా మాల్వానుండి బయలుదేరి అలహాబాదుమీఁదుగ దేశమునకు హాని కలుగకుండ రాజబాటలను విడిచిపెట్టి చుట్టు తిరిగి మూర్షడాబాదునకు చేరె
1744 ను. రఘోజీ భోంస్లే తూర్పునకు ప్రయాణమై వచ్చుచుండెను. బాలాజీ అలీవర్దీఖానుతో వ్యవహారములు పరిష్కారము చేసికొనెను. ఈవర్తమానమును వినినతోడనే బర్ద్వాను నుండి రఘోజీ వెనుకకు మరలెను. అలీవర్దీఖాను వారిని తఱుముటకు బయలుదేరెను. బాలాజీ మహారాష్ట్రులను తఱుముటకు బెంగాలు సైనికుల వలన కాదని తెలిసికొని సమాధాన ప్రకారము తానే సమరసన్నాహంబు గావించుకొని యతిత్వరిత గతిని రఘోజీ సైన్యములఁదాకి వారిని యుద్ధమునం దోడించెను. తరువాత బాలాజీరావు తనకు చాల దినముల నుండి వాగ్దానము చేయఁబడుచున్న క్రొత్త రాజ్యమును భద్రపఱచుకొన మాల్వాకువచ్చెను.

కడచిన యుద్ధమందు పీష్వాప్రవర్తన అంత యథార్థముగనున్న తరువాత నిఁకమహమ్మదుషాకు తన వాగ్దానమును నెఱవేర్పకుండుటకు సహేతుకమైన మిషయేమియు నుండఁజాలదు. కాని సామ్రాజ్యము యొక్క గౌరవమును నిలుపుకొనుటకు మాత్ర మతఁడు జయసింగు నిజాములు ముల్కుల యుపదేశముల వలన, పీష్వాకు చక్రవర్తి కుమారుఁడగు అహమ్మదుషాకు ప్రతినిధి యనియుద్యోగము నిచ్చెను. తక్కిన సమాధాన మంతయు వెనుక చిమ్నాజీ అప్పా బాలాజీరావులవలన ప్రస్తావింపఁబడినటులనే యుండెను. కాని 4000 గుఱ్ఱపు దళమునకు బదులు 12000 గుఱ్ఱపు దళమును పంపునట్లును, అందుమొక్కటైన 8000 గుఱ్ఱపు దళమునకును చక్రవర్తియే ఖర్చులు భరించుటకును, ఏర్పాటు చేయఁబడెను. ఈ సమాధానమునకు చక్రవర్తి పక్షమున జయసింగు జామీనుగ నుండెను. పీష్వాపక్షమున మల్హారి రావు హోల్కారు, రణోజీసింధియా పిలాజీజాధవు, జామీనులుగ నుండిరి.

పీష్వా,రాజుకు తన భక్తిగౌరవములను దెలియపఱచుటకు,సతారాకు

వచ్చెను. సంవత్సరాంతపు రివిన్యూ లెక్కలన్నియు తయారు చేయుటకుఁ గొన్ని దినము లచ్చట నుండెను. మహారాష్ట్రరాజులు కేవల నామమాత్రులైన ను పీష్వాయొక్క లెక్కలు మాత్రము యథావిధిగ చివరవఱకును సరిచేయుఁ బడుచుండెను.

రఘోజీ భాంస్లే యోడిపోయిన తరువాత సఖ్యపడవలెనని యుద్దేశ మున్నటుల పీష్వాదగ్గఱకు వకీలులను పంపుచుంచెను. బాజీరావుయొక్క పద్ధ
1744 తులన్నియు, తనలాభములకును మహారాష్ట్ర జాతియొక్క లాభమునకునుకూడ ననుకూలములైనవని, మనస్సునకిప్పుడు బోధయైన దని యతఁడు ప్రశంసించెను. అతఁడు యదార్థముగనే యిట్లుపలికినట్లు కన బడెను కాని యతఁడొకవైపునను, దమ్మాజీ గాయక్వాడొకవైపునను సతారాకు వచ్చుచున్నారని తెలిసి, బాలాజీరావుయును తగిన జాగ్రత్తతోడ నుండెను. ప్రతినిధి శరీరారోగ్యముతప్పియున్నను, అతని ముతలిక్ అగు యమాజీ శివదేవుఁడు పీష్వా యాధిక్యతయెడల ననూయయుతుండై యుండెను. కావున బాలాజీ రావుమహారాష్ట్రముఖ్యులతో యుద్ధమునకైన డీకొనవలసియుండెను, లేనియెడ చక్రవర్తితోఁ జేసికొనిన సంధికి వ్యతిరేకముగ రఘోజీకైన బెంగాలు నిచ్చి వేయ వలసియుండెను. బాలాజీ యంతఃకలహములం దిష్టములేని వాఁడును సామోపాయమునే ప్రథమమున నుపయోగించువాఁడునై యందున రాజాద్వారా యట్లు సమాధానపడెను.

నిజాములుముల్కు కుమారుఁడగు నాజరుజంగును ఔరంగబాదునందు ఖైదుచేసిన తరువాత కర్ణాటకమునకు 1743 సం॥ము జనేవరి నెలలోనరిగి, తిరు చునాపల్లిని వశము చేసికొనుటకుఁ బ్రయత్నించెను. శాంతాజీ చంపఁబడిన తరువాత ఘోరేపురేలు తమదేశీయుల యెడల నంతయభిమానము గలవారు కారైరి. కావున తద్వంశజుఁడైన మురారిరావు తిరుచునాపల్లిని నిజాములుముల్కు న కిచ్చివేసెను. అందు కతఁడు గుత్తిసముఖుఁడుగ స్థిరపఱుపఁబడెను.

నిజాములుముల్కు కర్ణాటకమునం దొకసంవత్సరము పాటు తన యాధి కారమును వృద్ధిచేసికొను చుండుటవలన బాలాజీరావును మాల్వారాజ్యమును

సంపాదించుకొననిచ్చెను. బాలాజీరావు మాల్వాను సంపాదించుకొనుట యందును, రఘోజీ భోంస్లే బంగాళముపై విజృంభించుట యందును, ధ్యానముకలవారై నిజాములు మున్నగు దక్షిణమున చేయుచున్న సంపాదనల నుపేక్షించి యుండిరి.

1744వ సం॥ములో సతారాయందు రఘోజీకిని బాలాజీరావునకును సమాధానములై యొకరి రాజ్యభాగములోనికి మఱియొకరు రాకుండ నేర్పాటు జరిగిన తరువాత, భోంస్లే బెంగాలునందు తన పోయిన యధికారమును సంపాదించుకొన నుద్దేశించెను. పీష్వా రఘోజీ నెదిరింప నందుకు చక్రవర్తికి క్షమాపణ చెప్పుకొనుటకుఁగాను దక్కనునందే నిలిచిపోయెను. వర్షఋతువు సాంతమయిన తోడనే భాస్కరు పంతు 20000 సైన్యముతో ఒరిస్సా మార్గమున బెంగాలునకు పంపఁబడెను. అలీవర్ది ఖానుఁడు సైన్యసన్నాహము చేసికొనెను కాని, సమాధానము చేసికొను నట్లు నటించి, రాయభారములు నలిపి, జియాఫతు (విందు) న కాహ్వానముచేసి, అతనితోఁ గూడ నిరువది మంది యుద్యోగస్థులను ఘోరముగ హత్యఁగావించెను. రఘోజీ గాయక్వాడు అను నొక్క సర్దారుఁడు మాత్రము తప్పించుకొని సైన్యమునంతను వచ్చినమార్గమున వెనుకకుఁ దీసికొని వచ్చెను. వెనుకఁబడిన భటుల నేకులు నఱికి వేయఁబడిరి.

రఘోజీ భోఁస్లేకు మరల దండెత్తుటకు వెంటనే సమయము దొరకెను. ఆలి వర్ది ఖాను క్రింద నున్న కొందఱు ఆఫ్ఘనులు తిరుగఁబాటు చేసినందున నతఁడు ఒరిస్సా నరక్షకముగ వదలిపెట్టి పోవలసిన వాఁడాయెను. వెంటనే రఘోజీ, తాను గూఢచారులుగ నుంచిన గోసాయిలవలన నాసంగతి తెలిసినవాఁడై ఒరిస్సాలోనికి దండెత్తి యనేక జిల్లాలను వశము చేసికొని 3 కోట్ల రూపాయలిచ్చినఁగాని తక్కిన దేశమును ధ్వంసము చేయకుండ వదలిపెట్టినని చెప్పెను. అలీవర్ది ఖానుఁడు తిరుగఁబాటు నణగ గొట్టువఱకును రాయభారములతో కాలము గడపి యటు తరువాత నిర్లక్ష్యముగ తిరస్కరించుచు వర్తమాన మంపెను. వానలు వెలసిన తరువాత కలహములు ప్రారంభమాయెను. కాని కట్వాదగ్గఱ మహారాష్ట్రులు స్వల్పముగ నోడిపోయిన తరువాత గోండ్వానాలో దేవగిరి

సంస్థానమున వారసత్వమునుఁ గూర్చిన వివాదమువలన రఘోజీ తన రాష్ట్రమునకు రావలసివచ్చెను. ఔరంగజేబుచే మహమ్మదీయులలో కలుపఁబడిన భక్తబులందుడను రాజు కుమారులు తమలో తాము పోరాడుకొనిరి. అందు వలీషాయనువాఁడు తనసోదరులగు అక్బరుషా బురానుషాయను వారలను ఖైదునందుంచుటయే గాక, చాందా రాజగు సింకోక్ మహమ్మదీయులలో కలిసిన నీలకాంతి షా యనువాని సహాయమునఁ బొంది, మహారాష్ట్రులకు ఘాతు నిచ్చుటకు కూడ నిరాకరించెను. అక్బరుషా నిజామును సాయమడిగెను. బురానుషా మహారాష్ట్రుల సాహాయ్యమడిగెను.

రఘోజీ దేవగిరి చాందా సంస్థానములను తన రాజ్యములో కలుపుకొనెను. రత్తంపూరు మాత్రము బురానుషాకు కుటుంబపోషణ కియ్యఁబడెను. ఈ సంతతివారు ఇప్పటికిని దాని ననుభవించుచు నాగపూరునందున్నారు. నిజాములో రాజ్యభరణము తినుచు అక్బరుషా చనిపోయెను.

రఘోజీ బంగాళములోనికి ప్రవేశించిన కొద్దికాలమునకు బాలాజీబాజీరావు మాల్వాలో బెల్షా గ్రామమునకు వచ్చి యచ్చటినుండి చక్రవర్తికి తన
1745 వినయ విధేయతలను దెల్పుచు నుత్తరములు వ్రాసి స్వయముగ దర్బారున దర్శనము చేసికొన నందుకు కారణములు ప్రస్తావించియుండెను. తాను రఘోజీయొక్క దండయాత్రల నడ్డగింప నందును గూర్చి చర్చింపక వదలివేసెను.

ఆ మఱుసటిసంవత్సరము అతఁడు తనదాయాదుఁడగు సదాశివ చిమ్నాజీ
1746 భావును, మహదాజీ పంతు పురంధరేను, కామ్యా నగు శకారాం బాపును, కర్ణాటకమున నేడులక్షలకు బాపూజీ నాయకునకు గుత్తకియ్యఁబడిన కృష్ణాతుంగభద్రల మధ్యభూమియందు, దేశముఖులు గుత్తదారుని ఠాణాలు తఱిమి వేసినందుకు, అచ్చట దేశముఖులను శిక్షించుటకు పంపెను. సదాశివరావు ఈదండయాత్రనుండి తిరిగివచ్చిన తరువాత రాజువలన పేష్వా యుద్యోగమునం దుంచఁబడెను. ఇతఁడు, పేష్వాకంటె సాహసవంతుఁడును అశాపరుఁడును కాన, నధిక యధికారమును సంపాదింపఁ బ్రయత్నించెను, కనోజీ

యాంగ్రియాయొద్ద సుశిక్షితులైన నిద్దఱు సమర్థులగు కాయస్థులగు, వాసుదేవ జోషి, రఘునాథహరి అను వారలను తనయొద్ద నుంచుకొనెను.

పీష్వా బందలఖండు రాజులతో ప్రత్యేకముగ క్రొత్తసమాధానము చేసి
1747 కొని, వెనుకటి పీష్వాకు పూర్తిగ నిచ్చివేయఁబడిన రైలీ జిల్లా కాక తక్కిన వారి రాజ్యములో మూఁడవవంతు సంవత్సరమునకు మదింపు ప్రకారము $16\frac{1}{2}$ లక్షలు రాఁబడి వచ్చు భాగమును పుచ్చుకొనెను. అది యే విధముగు భాగమును, పన్నా రత్నఖనులలో కూడఁ బుచ్చుకొనెను.

దక్కనునందు శాంతము కలిగిన నీకాలమందు, పీష్వా వ్యవసాయమును వృద్ధిచేసి, జనులకు రక్షణఁగల్పించి, యా కాలపు పరిశ్రమలకును విద్యలకును అభివృద్ధికలుగునట్లు చేసియున్న స్వల్పకాలముననే మరల దక్కను హిందూస్థానకర్ణాటకము లందు కలవరమునకు కారణములు కలిగెను.

ఏకవ్యక్తిపరిపాలన వలన కలుగు నిక్కట్టులు మరల త్వరలోనే మన భారతదేశమునకుఁ జూపట్టెను. ఆ రాజవ్యక్తి దుర్మార్గుడై నిరంకుశప్రభువైనచో ప్రజల యాపదలఁ జెప్ప నక్కఱలేదు. ఇఁక సన్మార్గుఁడై ప్రజానురాగము గలవాఁడైన చో సురాజ్యము, రామరాజ్యము, కలుగునని చెప్పుటకు సందియములేదు. అయిన నట్టిసురాజ్యము వలనఁ గూడ నష్టములుగలవు. ఆకాలమున ప్రజలు రాజ్యభారము వంతను రాజుమీదనే యుంచి తాము సుఖానురక్తులై తగినంత రాచకార్యములందు శ్రద్ధ తీసికొనక అశ్రద్ధ కలవాటు పడి యుందురు. ఆ రాజవ్యక్తి, దానున్నంతకాలమును రాజ్యము చక్కగ పాలించి తరువాత కాలము చేసిన పిమ్మట, సంతతి లేని వాడైన ప్రజలలో నరాజకమును, ఏక పుత్రవతుఁడై దుర్మార్గునిఁ గాంచిన యెడల ప్రజాపీడనమును, బహు పుత్రవతుఁడైన యంతఃకలహములను దెచ్చిపెట్టి, దేశమును పరపర దళితంబుగఁ జేసినవాఁడై ప్రజలకు ముప్పు తెచ్చిపెట్టినవాఁ డగును. ప్రజలును పూర్వసురాజ్యము వలన స్వరాజ్య నిర్వహణంబు చేసికొన నసమర్థులై యుందురు. కావున నెట్టి సురాజ్య మైనను ప్రజాప్రతినిధి రాజ్యము కానినాడు సుస్థిరంబు గానేరదు. మన

భరత వర్షమంతయు నప్పు డేదో యొక విధముగ కొంత శాంతిస్థితికి వచ్చినను మరల పైఁ జెప్పఁబడిన ప్రమాదము లన్నిటి వలనను నొక్కుమాఱు చంచలమై క్రమక్రమముగ కల్లోలమై, ప్రళయంబునకు లోనైనది.

మన భరతవర్ష చరిత్రయందు 1748 సం॥ ము బహుళ కార్యసంభవ సమన్వితమైనది. నాదరుషా సైన్యమునందు ఉద్యోగముచేసి ప్రసిద్ధిఁజెంది తరువాత హీరటునందు అఫ్గను దేశీయులకు ప్రభువుగ నేర్పడినవాఁడు అహమదుషా అబ్దాలీయని యొకఁడుండెను. డిల్లీయందు వజీరగు కుమారుద్దీను ఖాను అన్న కుమారుఁడగు మూల్తాను గవర్నరు, అదీనాబేగు అను మొగలు ద్రోహిచే ప్రబోధితుఁడై, అహమదుషాఅబ్దాలీని భారతదేశముపై దాడి వెడలఁగోరెను. కాని సకాలములో నీ సంగతి ఢిల్లీయందు తెలియుటవలన చక్రవర్తి సైన్యములు సంసిద్ధములై, అహమ్మదుషా అబ్దాలీ మూల్తాను లాహోరులను జయించి వచ్చుచున్నను, అతని నెదుర్కొని తఱిమివేయఁగలిగినవి. అయిన నీ యుద్ధమునందు కుమారుద్దీను హతుఁడయ్యెను. మొగలు సైన్యములు తిరిగి రాజధానికి వచ్చునప్పటికి చక్రవర్తి పరలోకగతుఁడయ్యెను. అతని కుమారుఁడగు అహమ్మదుషా రాజ్యమునకు వచ్చి సమర్థుఁడగు వజీరు లెవ్వరును లేక నిజాములుముల్కును తదాస్థానమునకు రమ్మనికోరెను. కాని వృద్ధాప్యమువలన నతఁడును కదలఁడయ్యెను. అతఁడును 1748 జ్యాను 19 వ తేదిన, తన 104 వ వత్సరమున కాలముచేసెను.

నిజాములు ముల్కునకు ఆఱుగురు తనయులు కలరు-గాజీయుద్దీను, నాజరుజంగు, సాలబతుజంగు, నిజాము ఆలీ, మహమ్మదు షరీఫు, మీరుమొగలు. ఇందు మొదటి యిద్దఱును యేకోదరులు. తక్కినవారు వేఱు వేఱు తల్లుల బిడ్డలు. ఈ సింహాసనము కొఱకు నాజరు జంగునకును, గాజీయుద్దీను కుమారుఁడగు ముజఫర్ జంగునకును వివాదము జరిగెను. కర్ణాటక నాబాబుగిరికి, అన్వారుద్దీనుకును చందా సాహేబునకును వివాదము సంభవించెను. అన్వారుద్దీను అంబూరు యుద్ధమున హతుఁడయ్యెను. అతని కుమారుఁడగు మహమ్మదాలీ ఇంగ్లీషువారి సాయముకోరెను. చందా సాహేబు ఫ్రెంచివారిని సాహాయ్యము

ను కోరెను. ముజఫరుజంగును చందా సాహేబును ఫ్రెంచివారు నొక్కటైరి. నాజరుజంగు పక్షమున రఘూజీ భొంస్లేయొక్క కొంత సైన్యమును, గుత్తియొక్క మురారిరావు ఘోరేపురే, మైసూరు రాజు,కడప కర్నూలు సావనూరు నవాబులు, మహమ్మదాలీ, ఇతని స్నేహితులగు మద్రాసులోని ఇంగ్లీషు సభవారు నందఱును చేరిరి. దక్కనునందు వీరందఱును చతురంగము నాడ నారంభించిరి.

ఈ తరుణమున మహారాష్ట్రులకు మంచి యాకర్షణీయంబైన సంగ్రామక్షేత్రంబు పీష్వాకు దక్కనునం దొదవెను. కాని, గృహాంతర కల్లోలమచ్చటను సంభవించెను. కొన్ని సంవత్సరములనుండి సాహురాజా మతిభ్రమ * చే బాధపడుచుండెను. అతని ప్రియసతియు నందఱిలోనుచిన్నదియునగు భార్య, సుగుణాబాయి మొహితీ యకాలమరణము నొందినందున

---

* అతఁడు కొంతకాలము నిరుపద్రవకరమును హాస్యకరంబు నగు కొంటెతనపు పిచ్చితో నుండెడు వాఁడు. ఇది మొట్టమొదట,నతఁడిద్దరు మహారాష్ట్ర సర్దారులకు నిండు సభయందు దర్శన మియ్యవలసి వచ్చినప్పుడు, కనుపడినది. బంగారు పువ్వులతోడను, భూషణములతోడను అలంకరింపఁ బడిన దుస్తులను తన ప్రియమగు కుక్కకు తొడిగి, దానికి తన తలపాగను బెట్టి దానిని గద్దెయుం దెక్కించెను. తరువాత మతి తెలిసినపుడుగూడ తన పాగాను అతఁడు ధరింపలేదు. వేటయందు పులినిఁ గొట్టుచుండగ కుక్క తనప్రాణమును రక్షించినదని దానిపేరున జాగీరులనిచ్చి, సనదుల వ్రాయించి, దానికి పల్లకి నుపయోగించుకొనుటకు హక్కునిచ్చెను. ఈపిచ్చి సంతోషములన్నియు నెఱవేర్పఁ బడెను. నిజముగా పల్లకీబోయిల యస్టాబ్లిషుమెంటు దీనికొఱకు ప్రత్యేకముగ నుంచఁబడెను. అతడు కొంత హాస్యరసము కలవాఁడు. అది చివరవఱకు నతని యందుండెను. జయపూరురాజగు జయసింగు, హిందూమతము కొఱకేమి ధర్మములు చేసితి వని,సాహూ నడిగెను. అందుకితడు, 'రామేశ్వరమునుండి ఢిల్లీవఱకును దేశమునంతను నేను ముసల్మానులయొద్ద నుండి జయించి బ్రాహ్మణుల కిచ్చివేసితిని' అని ప్రత్యుత్తరమిచ్చెను.

భిచార గ్రస్తుఁడై యట్టి స్థితిలోనికి వచ్చెనని చెప్పుదురు కాని యతని శేషారో గ్యము చెడిన కొలదిని బుద్ధియొక్క యుపయోగము మాత్రము మరలివచ్చెను. అప్పుడు పీష్వా పక్షమున నతనియొద్దనున్న వారందఱును కుమారుని పెంచు కొనుమని యతనికి బోధించిరి. ఈ మతిభ్రమ కలుగక పూర్వము కొన్ని దినము లకు వెనుక నతని పసి కుమారుఁడు పుట్టిపోయినపుడు, అంతకు పూర్వ మొక యో తాను దూషించుచున్న కొల్లాపురపురాజా యగు శంభాజీని, యతనికి సంతానమున్నయెడల, పెంపుడు చేసికొందునని చెప్పియుండెను. కాని యతనికి సంతతిలేక పోవుట వలన నది విఫల మయ్యెను. అందు కొఱ కిప్పుడు షాజీ యొక్క పినతండ్రియగు విఠోజీ వంశమువా రెవరైన నున్నారేమో విచారింప వలసినదని ప్రస్తావన జరిగెను. కాని వారు నెవ్వరును లేకపోయిరి. అప్పుడు ఆపటేలు వంశములో గౌరవనీయుఁడగు సిలేదారు పుత్రులనేకులు కలరు గాన వారినెవరినైన తీసికొన వలసినదని ప్రస్తావన జరిగెను. కాని దీని నంగీకరించుట కు సాహూ యిష్టములేదని చెప్పెను. కాని తారాబాయి, తనకుమారుఁడగు రెండవ శివాజీ చనిపోయిన తరువాత, నప్పటికి గర్భవతి యైయున్న కోడలు నకు 1712 సం॥ములో పుట్టిన రామరాజుఅను నామెమనుమని నెచ్చటనో దా చియుంచెనని యతఁడు మహదాజీపంతు పురంధరేతో చెప్పెను. సాహూకీ రహస్య మెట్లు తెలిసెనో తెలియదు. అప్పుడు తారాబాయి గ్రుచ్చియడుగఁబడి నపుడు యదార్థమును ఒప్పుకొనెను. సాహూ కప్పటికి బ్రతికి యున్న వారిలో పెద్దభార్యయగు సుక్వారుబాయిసిర్కే, ఈసంగతి తెలిసికొనినతోడనే, తా రాబాయి సంరక్షణక్రింద నామె మనుమఁడు రాజ్యము నందుంచఁబడునని త లంచి, యందువలన తన యధికార మేమియు నుండదని, తన వంశమునకు సహా జంబగు నాశాతీవ్రంబులతోడ, శంభాజీతో రాయభారముల నడపి యతనిని తారాబాయి యొక్కయు నామెయనుమానపు మనుమనియొక్కయు యాహక్కు ల నెదిరింపవలసినదని ప్రోత్సాహము చేసెను. ఆమె శంభాజీకి సాహాయ్యము చేసెదననెను. శ్రీపతిరావు చనిపోయిన పిమ్మట నతనిస్థానమున నియమింపఁబడిన నతని తమ్ముఁడగు జోగిజీవమును, అతనిముతలికు అయిన యయాజీ శివదేవునిని తన

పక్షముగఁ ద్రిప్పుకొనెను. దమ్మాజీ గాయక్వాడు దీనికి సమ్మతించెను. ఘాట్మాతా కును, కొంకణమునకును, తనపక్షమునకు తిరుగఁబాటు చేయుటకు రాయభారు లంపఁబడిరి. బాలాజీ బాజీరావు 35000 సైన్యముతో సతారాకు వచ్చెను. కాని యుదివఱకే బ్రాహ్మణాధిక్యత యెడల నసూయతో నున్న మహారాష్ట్రులగౌరవ భావమున కేమాత్రమును బాధ సోఁకకుండ, నతఁడు సుక్వారుబాయిని మగని నుండి విడఁదీయుటకుఁగాని, నిర్బంధముల నేమైన పెట్టుటకుఁగాని యేప్రయత్నములను చేయకుండ మెలకువతో ప్రవర్తించుచుండెను. సుక్వారుబాయి చేయుచున్న కుట్రలన్నియు నతనికిఁ దెలిసియున్నను, తనను భంజింపవలయునని యామె చేయుచున్న ప్రయత్నములు నతనికి విశదమైనను, అతఁడు తారాబాయి యెడలను అనుమానము కలిగియే యుండెను. రెండవశివాజీయొక్క భార్యయగు భవానీబాయి గర్భము రాజారాము రెండవభార్యయగు రాజాబాయిచే చాల యనుమానింపఁబడెను. ఆ కుఱ్ఱవాఁడు చంపఁబడకుండ రక్షించుటకు తారాబాయి యొక్క జాగ్రత్తయెల్ల వినియోగింపఁ బడవలసివచ్చెను. ఆమె కుఱ్ఱవానిని రహస్యముగ పన్హాలానుండి తీసికొనిపోయి కోడలు భవానీబాయి యొక్క సోదరి రక్షణలోనికిచ్చుట కేర్పాటు చేసియుండెను. అచ్చటనుండి తుల్జాపురమునకును, తరువాత బార్సీకిని కుఱ్ఱవాఁడు తీసికొనిపోఁబడి రహస్యముగ పెంచఁబడుచుండెను.

రాజారామొక్క మరణమునకుఁ బూర్వము మూఁడుమాసములు సతారాయందుండి, పీష్వా యేమిచేయుటకును తోఁచనివాఁడుగనుండెను. సింహాసనము నపేక్షించువా రందఱును అసమర్థులుగనే యుండిరి. పీష్వా యీసమయమున లోభత్వప్రేరితుడై శివాజీవంశజుల రాజ్యము నాక్రమింపఁదలఁచి యుండెనని విదేశచరిత్రకారు లాక్షేపించి మనకు విస్మయమును కలుగఁజేయుచున్నారు. రాజ్యములు స్వప్రయోజనముకొఱకు కావనుమాట మఱచి తగవులాడు వారసుల యజ్ఞానమున కేమిచేయవలెను? రాజ్యము ధర్మరక్షణకొఱకని పూర్ణముగ గ్రహించిన రాజులు పౌరాణికకాలమందు రాముఁడును, ఆధునిక చరిత్రకాలమున శివాజీయొక్కరుఁడును కానఁబడుచున్నారు. తక్కినవారందఱును వారి

తరువాత నే లెక్కకురాఁగలరు. బాలాజీబాజీరావు స్వార్థపరత్వమును అధికారకాంక్షను బొత్తుగలేనివాఁడు కాఁడు. అయిన నతఁడు అసమర్థులును, తనకంటె కడు నెక్కుడు స్వార్థపరులు నగువారికి రాజ్యమొప్పగించి యంతటితోడనే మహారాష్ట్ర రాజ్యమున కంతము గల్పింపవలసినదా లేక యెప్పటికే యుపాయంబున నైన నధికారమును తన చేతులయం దుంచుకొనవలసినదా యని మనము విచారింపవలసియున్నది. ఒకవైపున మహారాష్ట్రులు శివాజీయెడల తమకున్న భక్త్యనురాగములవలన నతనిసంతతివాఁ డెట్టి యధముఁడైనను వానిననుసరించుటకు మూఢభక్తిని కలిగి తమదేశముయొక్క మేలు నెఱుంగకున్నారు. శివాజీయొక్క సంతతివారు రాజ్యమును నిర్వహించుకొను సమర్థత లేకపోయినను స్వప్రయోజనమునకు దానిఁ గోరుచున్నారు. బాలాజీబాజీరావు, రాజ్యముయొక్క యధికారమును చాలదినములనుండి చేతియందు కలిగియుండుటచే, నతఁడున్న స్థానమున నుండకపోయినయెడల, రాజ్యమంతయు పేకముక్కలతో కట్టిన మేడవలె కూలిపోవును. కావున నతఁడు ప్రయోగించిన యుపాయములన్నియు నీ మాఁటికికూడ సామరస్యము చేయుటకే చేయఁబడినవి. ఆయుపాయము లంత ప్రశంసనీయములు కానిమాట నిశ్చయమే కాని యాకాలమువారు స్వప్రయోజనమునకు సామాన్యముగ చేయుచున్న దుర్నయములకంటె నీయుపాయము లొక్క సదుద్దేశముతో చేయఁబడుటవలన కొంతవఱకు ఉత్తమములని చెప్పవచ్చును. కావున నతఁడు తారాబాయి యొక్క మనుమని కథను నమ్మినటుల నుండుటయే మంచిదిగ నెంచెను. రాజ్యముయొక్క యధికారమును మాత్రము గ్రహింప సమకట్టెను. సుకార్వారుబాయి యెప్పుడును సాహూను విడువక కనిపెట్టుకొని యున్నను, రహస్యముగ నైవిధమున కనుకూలముగ సాహూవద్దనుండి మరణశాసనము వ్రాయించి పీష్వా పుచ్చుకొనెను. తారాబాయియొక్క మనుమని సింహాసనమందుంచి శివాజీయొక్క వంశగౌరమును నిలుపుటకును, పీష్వా యాపత్తు అధికారమును జరిగించుటకును, కొల్లాపురము వేఱురాజ్యముగ నుండుటకును, ప్రస్తుతమున్న జాగీరులన్నియు స్థిరపఱుచుటకును, హిందూరాజ్యమును విస్తరింపఁ జేయుటకును, దేవాల

యములనే రక్షించుటకును పుణ్యకార్యములను ఉపయోగమగు కార్యములను జేయుటకును సాహూ మరణశాసనమున విధించెను.

రాజాయొక్క ప్రాణముపోయినతోడనే కొంత యశ్వసైన్యము సతారాలోనికి వచ్చి, ప్రతినిధిని యతని ముతలికును పట్టుకొని సంకెళ్లువేసి, దూరపు దుర్గములకు గొనిపోయిరి. పట్టణముయొక్క ప్రతిమార్గమును భటులచే నాక్రమింపఁబడి యుండెను. కోటలో పీష్వాసైన్యము కొంతయుంచఁబడెను. కొంత సైన్యము రామరాజును తీసికొనివచ్చుటకు పంపఁబడెను.

సుక్వారుబాయి, తనయొక్క ప్రయత్నము లన్నిటికిని భంగము కలిగినదనియు, అవి తెలియఁబడి పోయినవనియు, ఆగ్రహ శోకములచే తప్తురాలై యుండెను. ఆమె తనయొక్క కుట్రను రహస్యముగ నుంచుటకు మగనితోసహగమనము చేసెదనని మదివఱకు పలుమారు చెప్పుచుండెను. బాలాజీబాజీరావు ఆమెసోదరుడగుకోరాజీసిర్కేను పిలిపించియతనిసెటులైన సిర్కేవంశ గౌరవము నుఁగాపాడుటకేఁగాక, రాజాయధికారము క్రిందనున్న దేశమంతయొక్క గౌరవము కొరకును, సోదరిని సహగమనముచేయ బోధించునటుల చేసెనని చెప్పుదురు. అటుల చేసినయెడల కొంకణమందు జాగీరునుకూడ నిచ్చెదనని యతని కాశపెట్టెను. ఈవిషయము నిజమైనయెడల దీనిని సమర్థించుటకు ప్రయత్నము చేయువలసిన యవసరములేదు కాని యాకాలపు ఆచారవిశ్వాసములను మనము లెక్కలోనికి తీసికొనియే యాదుష్కృత్యము యొక్క విచారణచేయ వలసి మాత్రముండును.

సాహూ రాజాయొక్క మరణమునకు పూర్వము, జస్వంతరావు దాభరేకును రఘోజీ భాంస్లేకును సతారాకు రావలసినదని యాజ్ఞలుపంపఁబడెను. ఇందు దాభరే వ్యభిచార విషయాసక్తుఁడై చిత్తచాంచల్యమును బొందినవాఁడై యుండెను. అప్పు డనుకొనినటులనే, దాభరేగాని, దమ్మాజీగాయక్వాడుగాని వచ్చియుండలేదు. తక్కిన జాగీరుదారు లనేకులు వచ్చియుండిరి. కాని యెవ్వరైన పీష్వా యధికారమున కొకవేళ అయిష్టులైనను రఘోజీ

భాంస్లే యే పక్షము తీసికొనునో తెలిసికొను వఱకును ముభావముగ నూరకుండిరి. రఘోజీ భాంస్లే గొప్పయాశలు, యనుభవ విచారణల వలనను, వయోవివేకము వలనను, ఒత్తిపెట్టి నడుపఁబడుచుండెను. అతఁడు బంగాళములోనికి సాంవత్సరిక దండయాత్రలను చేయ నుద్దేశించియుండెను. అంతియకాక అతఁడు 10, 000 గుఱ్ఱపుదళమును కుమారుని క్రింద కర్ణాటకమున నాజరుజంగునకు సాహాయ్యము చేయుటకు పంపియుండెను. మఱికొంత సైన్యమును తనస్వంత దేశమునందు రక్షణ కొఱకు ఉంచుకొనెను. కావున 12, 000 సైన్యముతో మాత్ర మతఁడు జనేవరి 1750 వ సం॥ మున సతారాకు వచ్చియుండెను. పీష్వా యెడల నతని మనోభావము సామముగనే యుండెను. రామరాజును రాజుగ నొప్పుకొనుటకు మాత్ర మతఁడు కొంచెము శంకించెను. ఆ కుఱ్ఱవాఁడు భాంస్లే యైనందునకును, రాజారాము మనుమఁడైనందునకును, నిదర్శనముగ తారాబాయి యామె వర్ణమువారి యెదుట నతనితో భోజనము చేయుచు, నా యన్నముమీఁద నామె ప్రమాణము చేయవలయునని యతఁడుకోరెను. ఈ ప్రమాణ మర్హావిధమున తారాబాయి చేసినపిమ్మట నతఁడు సంతుష్టిని జెందినటుల నొప్పుకొనెను. అటు తరువాత పీష్వాతో చాలసేపు మంతనంబు చేసి యతఁడు పీష్వాయొక్క యేర్పాటుల కన్నిటికిని యంగీకారమిచ్చెను. వారి యిద్దఱకును సఖ్యము కుదిరిన దనుటకు నిదర్శనముగా, బాలాజీరావు, రామరాజును రఘోజీ వశమునందుంచి, తరువాత యేర్పాటుల నన్నిటిని పూర్తిఁజేయుటకు జాగీరుదారు లందఱిని తీసికొని పూనాకు రావలసినదని చెప్పి, తాను ముందుగ బయలుదేరి పూనాకు వచ్చెను. ఈ కాలము నుండియే పూనా మహారాష్ట్రులకు రాజధానియైన దని యెంచుకొనవచ్చును. బాలాజీ తన యేర్పాటులన్నియు జయప్రదమైన వను సందడిలో తారాబాయి మాట మఱచి పోయెను. ఆమె కప్పటికి డెబ్బదిసంవత్సరముల వయస్సుకలిగి యున్నను, తనవంటి కార్యముగల స్త్రీని నిర్లక్ష్యము చేయుట యుపద్రవకరమైనదని యామె చూపెట్టఁగ గెను. సింహగడలో నామె పతియొక్క గోరీకి పూజా విధానంబులు జరుపు [illegible] నచ్చట కరిగి మహారాష్ట్ర రాజ్యమున కామె నధిపతిగ ప్రకటించు

టకు పంతుసచివుని ప్రోత్సాహపెట్టెను. బాలాజీ యామె కనేకవిధముల బోధించి, పూనాకు రావించి, పరిపాలనలో చాలభాగము నిచ్చెదనని యాశ పెట్టి యామెను స్తోత్రపాఠంబుల ననునయించి, యామె బోధచే తాను చేసెడు నేర్పాటు లనేకములకు రామరాజు అంగీకార మిచ్చునట్లు చేసెను.

రఘోజీభాంస్లే, బేరారు, గోండ్వానా, బంగాళము, ఈమూడింటికిని, క్రొత్తసనదులను పొందెను. బేరారునకు కలిసి ప్రతినిధికున్న కొన్నిజాగీరు భూములు భాంస్లే కియ్యఁబడెను. గుజరాతులో సగభాగమునకు జస్వంతరావు దాభరేకు సనదులు పంపఁబడెను. రానోజీ సింధియా యీసమయములోనే పరలోక గతుఁడయ్యెను. అతని కుమారుఁడు జయపా అతని జాగీరు నందు స్థిరపరుపఁబడెను. మాల్వా యంతయును, సుమారు 150 లక్షల రూపాయిల సంవత్సరాదాయము క్రింద లెక్కవేయఁబడి, యందు పది లక్షలు తప్ప తక్కినదంతయు హోల్కారు సింధియాలకు 9 లక్షల భేదముతో కొంచె మెచ్చుతక్కువగ సమానముగ పంచిపెట్టఁబడెను. మిగిలిన పది లక్షలును అనేకజాగీరుదారులకు పంచిపెట్టఁబడెను. ఆనందరావు పవారుకుమాత్ర మిందు పెద్దభాగమియ్యఁబడెను. వీరందఱును పీష్వా యొక్క యుద్దేశములతో నేకీభవించిరి. వీరి నుండి యికనతని కేభయమును లేకుండెను.

బాలాజీరావు నామమాత్రమున కష్టప్రధాన పద్ధతియుంచెను. గంగాధర శ్రీనివాసుని ప్రతినిధిగా నియమించెను. కాని రఘోజీ భాంస్లేయొక్కయు మఱికొందఱు జాగీరుదారుల యొక్కయు కోరికల ప్రకారము అతఁడు జోగిజీవను పరశురాముని విడుదలచేసి, యతని స్థానమందతని మరల స్థిరపరచెను. కాని రాజుయొక్క సేవకావళిని చాలవరకు తగ్గింపవలసి యున్నందువ, నందు జీవనములు పోయిన వారిని తన వద్ద నుంచుకొనుటకు గాను, ప్రతినిధి యొక్క భూములలో చాలవఱకు అనగా ముఖ్యముగ ఉర్ణారివరుణా నదులమధ్యదేశమును, అచ్చట కొల్లాపురిపు రాజు ప్రోత్సాహమువలన తిరుగఁబాటు జరుగునను భయము వలన, పైఁజెప్పినవారి కిచ్చుటకు, తన యొద్దనుంచుకొనెను.

సాహూ యొక్క పెంపుడు కుమారుఁడైన ఫత్తేసింగు భాంస్లే అక్కలకోటరాజుగ నుంచఁబడెను. సర్‌లష్కరు యుద్యోగము సోమవాషి కుటుంబము నుండి తీసివేయఁబడి నింబాజీ నాయక నింబాల్కరున కియ్యఁబడెను. ఈ మార్పులును, ఉద్యోగములును రాజుయొక్క పేరుననే చేయఁబడెను. కాని యిప్పటికి పీష్వాయొక్క యధికారము రాజ్యమందు ప్రధానమైనదిగ నెల్లరిచే నెంచఁబడి సంతుష్టితో నంగీకరింపఁ బడుచుండెను.

కాని ప్రతినిధితో సమకాలమున విడుదల చేయఁబడిన యమాజీ శివదేవుఁడు పంధరపురము నొద్దనున్న సంగోలాకోటలో చొచ్చి తలుపులు బిగించుకొని పీష్వాపై తిరుగఁబాటునకు ధ్వజమెత్తెను. కాని సదాశివ చిమ్నాజీ భావూచే నతఁ డణఁచ వేయఁబడెను.

పీష్వా, తన వ్యవహారములందు ముఖ్యముగ నతని దివానగు మహాదాజీ పంతుని సాహాయ్యము వలన జయశీలుఁ డగుచుండెను. సదాశివరావున కనంతర మితఁడే బాలాజీరావు యొక్క చిత్తవశంబు గలవాఁడు. సదాశివరావు సంగోలాకు యమాజీ శివదేవుపై దండయాత్ర వెడలినపు డతఁడు పీష్వా యధికారమును నిరాకరించుటకే యాక్షేపణయు నుండకుండు నటుల రామరాజును కూడ తనవెంట తీసికొని పోయెను. ఆ సమయమున నచ్చట శిబిరమున్నపుడు రాజా, తన యధికారము నంతను వదలు కొనుటకును, తన స్వంతమునకు సతారాచుట్టు కొంత దేశమిచ్చిన యెడల, పీష్వాయొక్క యేర్పాటుల్ల కన్నిటికిని ఒక్కసారి యే యంగీకారము నిచ్చుటకును, ఒప్పుకొనెను. బాలాజీరావును దీనికి సమ్మతించెను. రాజా, బలమగు పరివార రక్షణమున, సంగోలానుండి సతారాకు పంపఁబడెను. ఈసమయమున పీష్వాకును సదాశివరావునకును మనస్పర్థ యొకటి పుట్టి బాలాజీరా వేర్పఱుపఁ బ్రయత్నించుచున్న నేర్పాటంతయు కొంచెములో తలక్రిందగుటకు సిద్ధమయ్యెను.

ఈ సమయమున సదాశివరావు రామచంద్ర బాబాశన్వియను నొకనితో సంబంధము కల్పించుకొనియుండెను. ఈరామచంద్రుఁడు వృద్ధిలోనికి వచ్చిన

తెలంగాంత ప్రశస్తమైనది కాకపోయినను, మహారాష్ట్రదేశము మాత్ర మతనికిఁ జాల ఋణగ్రస్తమైయున్నది. ఇతఁడు రామచంద్ర మల్హారు అను పేరున వాడీశావంతుల యధికారములోనున్న అరులీ అనుగ్రామముయొక్క కులకార్ణిగ నుండెడివాఁడు. ఆ గ్రామముయొక్క దస్తు నపహరించినవాఁ డగుటచే నతఁ డచ్చటినుండి పాఱిపోవలసిన వాఁడాయెను. అతఁడు సతారాకువచ్చి కచ్చేశ్వరు బాబాఉతీకరు అను నతని సేవయందు ప్రవేశించినవాఁడై యాయజమానునిచే బాజీరావునకు శిఫారిసు చేయఁబడెను. బాజీరావు క్రింద నతఁడు వ్యవహారతగను, యోధుఁడుగను కూడ ప్రసిద్ధిఁ గాంచెను. బాజీరా వతనిని రానోజీ సింధియాకు దివానుగ నియమించెను. రానోజీయొక్క పేరుబొందిన పేదతనమునకును, ఇతని భాగ్యమునకును, కొంతకారణ మీతని మాహాత్మ్యమే యై యుండవచ్చును. రానోజీ మరణానంతరము అతని కుమారుఁడగు జయపాకు కూడ సంకను దివానుగ నుండుట కతఁడు సదాశివ రావునకు లంచమిచ్చెను. కాని జయపా యందుల కిష్టుఁడుగానుండెను. మల్హారిరావు హోల్కారుకూడ నీయేర్పాటున కంగీకరింపలేదు. ఇందువలన పీష్వా యతనిని యుద్యోగమునుండి తొలఁగించెను. ఈ కారణ మొతస్వల్పమైనదిగఁ గాన్పించినను, మిక్కిలి యుపద్రవంబునకు బీజంబై వెలసెను. హోల్కారునకును సదాశివరావు భావూకును, రామచంద్రునికిని పీష్వాకును, వైరముల కిది మూలమయ్యెను. సదాశివరావు భావూ రామచంద్రుని తన దివానుగనియమించుకొనెను. అతనియుపదేశమువలన నతఁడు తన తండ్రి చిమ్మాజీ అప్పా వహించి యుండెడు నధికారమంతయును తన కియ్యవలసినదని పీష్వానుకోరెను. అటుల చేసినయెడల తన కనేకయుపకారములు చేసిన వాఁడును బుద్ధిమంతుఁడు నగు మహదాజీపంతు పురంధరే యుద్యోగమునుండి తగ్గిపోవలసివచ్చును కావున పీష్వా యందుకు సమ్మతింపలేదు. ఇందుమీఁదట, సంగోలాదండయాత్రనుండి తిరిగివచ్చిన పిమ్మట, సదాశివరావు కొల్హాపురపురాజుతో గాయభారములుజరుపుకొని, పారగడ, కళానిధి, చందగరికోటలను బుచ్చుకొని, సం॥కు 6000 రూపాయిలువచ్చుజాగీరును గైకొన్న యచట పీష్వాగాఁ జేరెను. కాని మహదాజీపంతు మహౌదార్యముతో తన

దివానుపనిని స్వయముగ వదలుకొని గృహకల్లోలము కలుగకుండ చూచివేసిన వాఁడాయెను. అంతట సదాశివరావు కొల్లాపురపు పీష్వా యుద్యోగమును విడిచి పెట్టి యిప్పుడు దివానుగ మరల వచ్చిచేరెను.

రాజారామయొక్క మరణమునకు పూర్వమును, తదనంతరమును, పైన చెప్పఁబడిన యేర్పాటుల కారణమున, మహారాష్ట్రసైన్యములు కర్ణాటకమునందు విస్తారముగ నుండినను, జయముల ననురూపంబుగఁ జేకొనుటకు వీలులేకపోయెను. నిజాముల ముల్క్ పెద్దకుమారుఁడగు గాజీయుద్దీన్, ముల్హారరావు హోల్కారుద్వారా, రాయభారములు నడిపెను. పీష్వా యితనిని నిజామురాజ్యమునకు హక్కుదారునిగా తోడ్పడుటకు సమ్మతించి, చక్రవర్తియగు అహమ్మదుషాకు అతనిని దక్కను వైసరాయిగ నియమింపుమని కోరుచు నుత్తరము వ్రాసెను. ఈమధ్యకాలములో పీష్వా తనసైన్యముల నాయత్తపరచుకొని ఔరంగబాదునకు పోయెను. కాని పూనాను విడిచిపెట్టక పూర్వము పంతు సచివుని తనకు తూంగు త్రికోణకోటలకు బదులుగా సింహగడనిచ్చునటుల నొడంబరచెను. మఱియు, వృద్ధురాలైనను రాజతంత్రవ్యవహారములందు బుద్ధి యేమాత్రమును మందగింపని తారాబాయియొక్క మనస్సును సంతోషపెట్టుటకుఁగాను, కొంచె మవివేకంబుగ పీష్వా సతారాకోటనుండి తన స్వంత సిబ్బందిని తీసివేసి, రాజారాము భార్యయెడల నెక్కువ భక్తిగల గడేకారులను పూర్వపరివారమును నియమించి, వ్యవహారమంతయు నామెకు నొప్పగింతపెట్టెను. సతారా పట్టణములో రామరాజునకు తగిన పరిచారకులతో నివాసమేర్పఱచి, అతనికిని అతని యుద్యోగస్థులకును సంవత్సరమునకు 65 లక్షల యాదాయము వచ్చున ట్లేర్పాటుచేసి స్వేచ్ఛానిర్బంధమునం దుంచెను.

సాహూ వ్యాధిగ్రస్తుఁడైయున్నపుడు, బాలాజీరావు సతారాకు రావలసి వచ్చినపుడు, నాజరుజంగు కర్ణాటకదండయాత్రకై వెడలెను. నాజరుజంగు యుద్ధములందు జయశీలుఁడయ్యెను కాని పఠాను వైసరాయియగు దూప్లేయొక్క కుట్రలవలన నతఁడు క్రమముగఁ జంపఁబడెను. ఈకుట్రలలో ఉత్తరసర్కా

రులలోని యిద్దఱు పురుషుల నిచ్చట చెప్పవలసియుండెను. శ్రీకాకుళ నివాసి యగు రామదాసు అను నొక బ్రాహ్మణుడు నాజరుజంగుయొక్క విశ్వాసమున నుండ, నతనిద్వారా, డూప్లే నాజరుజంగు సైన్యమునందు రాజద్రోహమును పుట్టించెను. నాజరుజంగు మోసమున కడపపఠాను నబాబుచే 1750 డిసెంబరు 5వ తేదిని చంపఁబడెను. రెండవపురుషుఁడు, మన బొబ్బిలి యుద్ధమునందు తరువాత పేరుఁబొందఁబోవు హైదరుజంగు. ఇతని మొదటిపేరు అబ్దుల్ రహిమాన్. ఈతని తండ్రి మచిలీపట్టణములో నిజాము ప్రభుత్వమునకు శిస్తు దాఖీపడి, యచ్చటి పరాసువారితోడఁ గొంచెము సఖ్యముగ నున్నందున, పుదుచ్చేరికి పాఱిపోయి డూప్లేచే దయతో గారవింపఁబడెను. అప్పటికి చిన్నవాఁడుగనున్న యతని కుమారుఁడు అబ్దుల్ రహిమాన్, పరాసుభాషను నేర్చుకొనినవాఁడై, రామదాసుతో కుట్రలు సలుపుటకు డూప్లేచే ప్రయోగింపఁబడెను. ఈకుట్రలు జయప్రదములైనతోడనే ఇతఁడు హైదరుజంగు బిరుదుతో పరాసు దివానుగఁ జేయఁబడి ముజఫర్ జంగుతోకూడ బుస్సీ యరిగినపు డతని వెంటఁబోయెను. ద్రోహియగు రామదాసు రాజారఘునాథదాసు అను బిరుదుతో ముజఫర్జంగునకు ప్రధానమంత్రిగఁ జేయఁబడెను. ముజఫర్జంగు స్వల్పకాలమే దక్కనుయొక్క ఆఱుసుభేలకును వైసరాయిగ నుండెను. పఠాను నవాబు లితఁడు రాజ్యమునకు వచ్చినందువలన తా మెదురుచూచిన లాభములను బొందకపోవుటవలన నసంతుష్టులై యతనిపైఁ గుట్రఁజేసిరి. ముజఫర్జంగు జయమును బొందినను 1751వ సం॥ మున యుద్ధమునందు పడిసెను. నిజాముల ముల్కుయొక్క మూఁడవ కుమారుఁడగు సాలబజ్జంగు వైసరాయిగ నెన్నుకొనఁబడెను.

బాలాజీబాజీరావు, గాజీయుద్దీనుకు సహాయ్యము జేసెదనను మిష మీఁద, నతని రహస్యమిత్రుఁడగు ఔరంగబాదు గవర్నరునొద్దనుండి 15 లక్షలవరకు కప్పము పుచ్చుకొనెను. ఈ ధనమును పుచ్చుకొనినతరువాత సాలబజ్జంగు నెదిరించుటకు, పీష్వా, సైన్యములతో కృష్ణానదీతీరమువరకువచ్చి, సాలబజ్జంగును, అతని పరాసుమిత్రులను ఎదుర్కొనిన కొంతసేపటిలోనే సతా

రానుండి యుపద్రవకరమగు వర్తమానము వచ్చినందున సాలబజ్జంగు చేసిన పొందికటిసంధి రాయభారంబులతో సంతుష్టిపడి శీఘ్రముగ సతారాకు తిరిగిపోయెను.

పీష్వా ఔరంగబాదునకు వెడలినపుడు, తారాబాయి, బాలాజీరావుచే నక్రమముగ నాక్రమింపఁబడిన రాజ్యమును స్వాధీనపఱుచుకొన వలయునని, రామరాజును మనస్సు కదలించిచూచెను. కాని యతఁడా యుద్యోగమున కర్హుఁడుకానటులఁ దెలిసికొని, యా ప్రస్తావనయందు తనకంత యుద్దేశము లేనటుల నటించుచు, రహస్యముగ దమ్మాజీ గాయక్వాడునకు, దేశముయొక్క యరక్షకస్థితిని తెలియఁబఱచుచు, రాజును రాష్ట్రమును బ్రాహ్మణులయధీనమునుండి రక్షించుటకు, తక్షణము సతారాకు దాడి వెడలుటకు బోధించుచు, వర్తమానములనంపెను. ఈప్రార్థన తత్క్షణ మతనిచే నంగీకరింపఁబడెను. గాయక్వాడుయొక్క రాకనుగూర్చి నిశ్చయమైన వర్తమానము తెలియఁగనే, తారాబాయి, రాజును కోటలోనికిఁ బిలిపించి, ఖైదీగఁజేసెను. అటుతరువాత నామె యతని నిట్లనేకవిధంబుల నిందించెను నీకుచూడ శౌర్యమేమాత్రమును లేకున్నది. నిన్ను నామక జీవితంబునుండి బయటకు తీసినందుకు నాకెంతయు పరితాపము గల్గుచున్నది. అట్టి యనామక జీవితమునకే నీ వర్హుఁడ వగుదువు. నీవు నామనుమఁడవు కాఁజాలవు; మహారాజు శివాజీవంశమున నీవు పుట్టియుండవు; నీవు భాంస్లేకులుండవుగాని మొహితీకులుఁడవుగాని కానేరవు. మొట్టమొదట నీవు దాచియుంచబడిన నా గొందిలీల*యింటియందుమార్పఁబడినహీనకులుండవే మోయని నా కనుమానముగనున్నది. నిన్ను నావంశజునిగా నంగీకరించినందుకు పావన కృష్ణానదీతీరంబున ప్రాయశ్చిత్తము చేయించుకొనెదను. ఆమె, హవల్దారును రాజసేవకులపై నగ్నివర్షంబు గురిపింపమని యాజ్ఞయిచ్చెను. వారును జరిగినవృత్తాంతము నెఱుంగక నజాగ్రత్తగ కోటద్వారమునొద్ద నిలువఁబడియుండిరి. అటుతరువాత నామె ఫిరంగులను క్రింద పట్టణంబున నున్న కొంకణస్థులపై గుఱిపెట్టుట కాజ్ఞయిచ్చెను. నానాఫురంధరే యని

* గొందిలీ లనగా బజంత్రీలు, (మంగలికులమువాండ్రు.)

సామాన్యముగ పిలువఁబడు త్రింబకపంతును, గోవిందరావు చిట్నీసును మఱి పీష్వాపక్షమువారగు నితర యుద్యోగస్థులను ఈప్రయత్నములను వెఱ్ఱి మనలావు పిచ్చిపనులని హాస్యముగఁ దిలకించిరి. కాని సోనేగడనుండి దమ్మాజీ గాయక్వాడుయొక్క రాక వినినతోడనే, వారు పట్టణము వదిలి కృష్ణాతీరమున ఆర్లాగ్రామమునొద్ద సైన్యములఁ గూర్చుకొనిరి. సాల్పిఘాటుమార్గమున గాయక్వాడువచ్చినతోడనే యతనిసైన్యము 15,000 ఉండెను. వీరిసైన్యము 20,000 ఉన్నను వీరు యుద్ధమునందు ఓడింపఁబడిరి. దమ్మాజీగాయక్వాడు వెంటనే తారాబాయికడకేగి తన యభినందనములఁ దెలియఁజేసెను. సతారా భోజనసామగ్రులతో పుష్కలముగనుండెను. ప్రతినిధి యామెపక్ష మవలంబించుటకు వాగ్దానముచేసెను. ఈ వ్యవహారముల వర్తమానములవలననే పీష్వా, సాలబజంగుతో యుద్ధమాపి తిరిగివచ్చెను; కాని యతఁడువచ్చులోపలనే నానాపురంధరే, దమ్మాజీ గాయక్వాడును జోరెఖోరాకు తఱిమివేసి, తనపోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకొనెను. అప్పట దమ్మాజీ, కరారునుండి ప్రతినిధివలనను, గుజరాతునుండి కొన్నిసైన్యముల వలనను కలిసి కొనఁబడుదునని నిరీక్షించి యుండెను. కాని యీ యాశయందతఁడు భగ్న మనోరథుఁడయ్యెను. ఒకప్రక్క కొంకను సుభేదారుఁడగు శంక్రాజీ పంతు సైన్యములఁ గూర్చుచుండ, మఱియొకప్రక్క పీష్వాసైన్యము 13 దినములలో 400 మైళ్లు నడచి పైనఁ బడవచ్చుచుండ, దమ్మాజీ, బాలాజీరావుతో సంధిచేసికొనుటకు రాయభారినంపెను. బాలాజీరావు ప్రస్తావింపఁబడిన సంధి పద్ధతుల నంగీకరించి, తనకు సమీపముగ గాయక్వాడును శిబిరము నేర్పఱచు కొనునట్లు చేసి, తనవశమునందు చిక్కినతోడనే గుజరాతునుండి రావలసిన బాకీ శిస్తులను, అతని రాజ్యమునందు విశేషభాగమును, ఇమ్మని బలవంతపెట్టెను. దమ్మాజీ తాను సేనాపతియగు దాభరేయొక్క ముతలికు ననియు నట్లు కోరినదానిని తా నిచ్చుట కధికారము లేనివాఁడ ననియు చెప్పెను. ఈ ప్రత్యుత్తరము మీఁద పీష్వా తేలిగాం నందున్న గాయక్వాడు దాభరే కుటుంబముల యందలి కొందఱిని పట్టుకొనుటకు రహస్యముగ నుత్తరువులు పంపెను. అంతియకాక మంచి తరుణము చూచి పీష్వా, దమ్మాజీ గాయక్వాడు

రియొక్క శిబిరమును ముట్టడించి, కొల్లఁబెట్టి దమ్మాజీని పూనాకు ఖైదిగఁ బట్టుకొని పంపెను. ఈ మోసమునకు దమ్మాజీ తరువాత తన జీవితకాలమంతయు పీష్వాకు తన యెడమచేతితో తప్ప సలాము చేయుట కంగీకరించెడు వాఁడు కాఁడని చెప్పుదురు. అటు తరువాత పీష్వా, తారాబాయికి, కోటను రాజును స్వాధీనము చేయుటకు, బోధింపఁ బ్రయత్నించెను. కాని యామె తన సైన్యము నెల్ల పోగు చేసికొని, భటులందఱును తనపక్షమున స్థిరముగ నిలుచుటకు ప్రమాణము చేయవలయుననియు, నట్లు చేయనివారు కోటను విడిచిపోవలసిన దనియును ఉపన్యసించెను. పీష్వాభటులలో కొంద ఱామె దేవతయనియు, కొందఱు దైత్యయనియును మనంబునఁ దలంపఁజొచ్చిరి. కాని మహారాష్ట్రు లనేకు లామెయే రాజునకు న్యాయమైన సంరక్షణకర్త యని దృఢమైన యభిప్రాయము కలవారైరి. కావున నామె పక్షమున ప్రతిష్ఠగల నాయకుఁడొక డుండెనేని యుపద్రవకరమగు స్థితి యందుండెడిదే. కాని అట్టివా రెవరును లేనందున నామె నుపేక్షించుటకంటె శిక్షింపఁ బ్రయత్నించుటయే యెక్కువ యాపత్కరమని బాలాజీరావు తెలిసికొనెను. ఈ మధ్యకాలములో నీ వ్యవహార మెంత చిక్కుగ నున్నను, తారాబాయియొక్క ప్రవర్తన చివరకు పీష్వాకు లాభకారియే యయ్యెను. రాజును సతారాకోటయందు ముందుగ నిర్బంధించిన యపకీర్తి పీష్వానుండి తప్పిపోయెను. తారాబాయి యతనిని కోటయందు మాత్రమే నిర్బంధించి యుండలేదు. ఇప్పటి వఱకు నున్న యతని కారాగారము రాతితోఁ గట్టఁబడిన చీఁకటి చెమ్మ కొట్టుగా నుండెను. అతని ఆహారము ముతుక ధాన్యముగ నుండెను. కేవలజన్మచే రాజైన శివాజీ మునిమనుమఁడగు రామరాజుయొక్క గతి యీవిధముగ పరిణమించినది.

ఒక్క దమ్మాజీ గాయక్వాడునకే పీష్వా యిదివఱకు ఋణియై యుండెను. అతఁడిప్పుడు పూనాయందు కఠినముగ నిర్బంధింపఁబడి యున్నందు వలన పీష్వా గాజీయుద్దీనుతో తాను చేసిన వాగ్దానములను నెఱవేర్చుటకు ఔరంగబాదునకు పోయెను. సాలబజ్జంగుయొక్క యధికార మంగీకరింపఁబడిన చోటుల నెల్ల కొల్లఁబెట్టుటయు కప్పమును వసూలు చేయుటయు సగు మామూ

లు మహారాష్ట్ర పద్ధతి నవలంబించెను. మొగలు సైన్యములయొక్క నడకలను గడపుట యందుముఖ్యయాలోచన కర్తయగు మాన్షియరు బుస్సీ,తాను స్వయముగ 500 యూరోపియను పటాలమునకును, 5000 సుశిక్షితులగు స్వదేశ సిపాయిలకును నాయకుడుగ నుండెను. ఇతఁడు మహారాష్ట్రుల దండయాత్రలను నిరోధించుటకు మంచి యుపాయము, మహారాష్ట్ర దేశములోనికి యుద్ధమును సాగించుట, యని సలహానిచ్చెను. ఆ యాలోచన ప్రకారము సాలబజ్జంగు అహమ్మదు నగరమునకుఁబోయి యచట తనభారమగు సామగ్రుల నెల్ల నిలువయుంచు చుండగా, ప్రధానమంత్రియగు రాజా రఘునాధదాసు తారాబాయితోడను, కొల్లాపుర రాజగు శంభాజీతోడను సందేశములు జరుపుచుండెను. పీష్వాయు నతని యుద్యోగస్థులును ఈ యెదురు చూడని రాజకార్యంబులకు సంసిద్ధులు కానందున తమయాలోచనములందు భగ్నమానసులైరి. వారు,సమయానుసారంబుగ, గాజియుద్దీనును గాని సాలబజ్జంగును గాని;దక్కను వైసరాయిగ సాహాయ్యము చేయుచు, నిద్దఱను కూడ దుర్బలులను చేయుటకుఁగాని,దక్కను నంతను జయించుటకుఁగాని, లేక యే పక్షమువారి వలన నైనఁగాని గొప్పలాభముల నియ్యఁబడుటకుఁ గాని,మనస్సునం దాలోచించు కొని యుండిరి. ఇటువంటి యాలోచన లాకాలములో హిందూదేశమందు రాజ్యమును సంపాదించుకొనఁదలచి కొనిన వారంవఱికిని సామాన్యముగనే యుండినవి. ఇప్పటికిని ప్రపంచమున రాజ్యకాంక్షగల యెల్లవారికి నీ రాజనీతి తెలిసి యున్నదే. కావున కేవలము మహారాష్ట్రుల నాక్షేపింప నిందు మన కవకాశములేదు. సాలబజ్జంగుయొక్క దండయాత్రలను నిరోధించుటకు వారు మహారాష్ట్ర పద్ధతి ప్రకారము, 40,000 అశ్వసైన్యముతో మొగలు సైన్యమును వానరయుద్ధ లక్షణమున చుట్టుముట్టి బాధించిరి. కాని పవిక్షేత్రపు ఫిరంగులు (Field Pieces) కల పరాసు ఫిరంగిదళము వారిని తీక్ష్ణంబుగ నొవ్వఁజేసెను. మొగలు లీ బలమగు సాహాయ్యమును శరణముగాఁ గొని మార్గమునందలి ప్రతి గ్రామమును ధ్వంసము చేయుచు పూనా వైపునకు సాగివచ్చిరి. వీరి యొక్క దాడికి పీష్వా కొంత యాతురత పడినవాఁడై రాయభారములు నలుప నాలోచించె